

సమాజం
రూ॥ 60/-
పేజీలు: 64
నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



రాజకీయాల్లో యువతను ప్రోత్సహించడమే లక్ష్యం

కమ్యూనిస్టు ఉద్యమాల ఖిల్లా కుత్బుల్లాపూర్

2025–27కు మద్యం దుకాణాల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్.. 3లో



సంపుటి 28, సంచిక: 62 | గురువారం | 21-08-2025 | హైదరాబాద్   Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar   పేజీలు: 12 | వెల రూ. 5.00





# ఓటు హక్కు ప్రశ్నార్థకం

## ఇసి రాజ్యాంగ సంస్థగా పనిచేయడం లేదు

- ఓటు హక్కుకోసం బిహార్‌లో పెద్ద ఎత్తున ఉద్యమం ప్రారంభమైంది
- బిజెపి, మోదీలను గద్దె దింపేందుకు ప్రజాతంత్ర లౌకిక శక్తులు ఏకం కావాలి
- ఇండియా కూటమిలో పరస్పర సహకారం, సర్దుబాటు ఉండాలి
- సిపిఐ రాష్ట్ర 4వ మహాసభను ప్రారంభిస్తూ సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా
- మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా గాజుల రామారంలో ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభమైన మహాసభలు

### ఉప రాష్ట్రపతి ఎన్నిక రాజకీయ యుద్ధం

'ఉప రాష్ట్రపతి ఎన్నికలు దేశ చరిత్రలో ఎంతో కీలకం. ఈ ఎన్నిక రాజకీయ యుద్ధం. దేశ ఉప రాష్ట్రపతి ధన్‌కడ్ ఎందుకు రాజీనామా చేశారు? ధన్‌ఖడ్ రాజీనామాకు ఆయన అనారోగ్యం కారణం కాదు, రాజకీయ కారణం ఉన్నది. అదేమిటో ఇప్పటికీ ఎవరికీ తెలియదు. ఉప రాష్ట్రపతి ఎన్నికలో ఇండియా కూటమి అభ్యర్థిగా జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డిని ప్రకటించారు. సిపిఐ కూడా మద్దతు ప్రకటించింది. లౌకిక పార్టీలు అన్నీ జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతు ఇవ్వాలి. ఉప రాష్ట్రపతిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి గెలుపొందితే దేశ భవిష్యత్ రాజకీయాలలో తీవ్ర ప్రభావం చూపుతుంది. చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుంది.'

ఇ. చంద్రశేఖర్
కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వర రావు నగర్ నుంచి

రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అయిన ఓటు హక్కు ప్రశ్నార్థకంగా మారిందని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఆందోళన వ్యక్తం చేశారు. అర్హులైన ప్రతీ ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండేలా చూడడంలో భారత ఎన్నికల సంఘం రాజ్యాంగ సంస్థగా లేదా తటస్థ సంస్థగా పని చేయడం లేదని మండిపడ్డారు. అందుకే బిహార్‌లోఓటు హక్కు కోసం పెద్ద ఎత్తున ఉద్యమం ప్రారంభమైందన్నారు. రాజ్యాంగం, ప్రతీ ఒక్కరి ఓటు హక్కు పరిరక్షించబడాలంటే బిజెపిని, ప్రధాని మోదీని అధికారం నుంచి దించి వేయాల్సిందే నన్నారు. అందుకు లౌకిక, ప్రజాతంత్ర పార్టీలన్నీ ఒకే వేదికపైకి వచ్చి బిజెపిని, మోదీని గద్దె దించేందుకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లాలోని 'కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వరరావు నగర్' (గాజుల రామారం)లోని 'కామ్రేడ్ ఎన్.బాలమల్లేశ్ హాల్' (మహారాజా గార్డెన్స్) లో మూడు రోజుల పాటు జరిగే సిపిఐ రాష్ట్ర 4వ మహాసభ బుధవారం అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభమైంది. ప్రారంభ సభకు సిపిఐ శ్రేణులు ఎర్ర చొక్కాలు, ఎర్ర చీరలు ధరించి పెద్ద ఎత్తున హాజరయ్యారు. ప్రాంగణంతా అరుణవర్ణం సంతరించుకుంది. మహాసభ ప్రారంభోత్సవ సభలో ముఖ్యఅతిథిగా రాజా, అతిథులుగా సిపిఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజ్‌పాషా పాల్గొన్నారు. సభలో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సౌహార్ధ సందేశాలిచ్చారు. మహాసభ ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఎం.డి.యూసుఫ్ అధ్యక్షతన జరిగిన సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట రెడ్డి, పశ్య పద్మ, సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట రెడ్డి, కె.శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్ళపల్లి శ్రీనివాస రావు, సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మాజీ ఎమ్మెల్సీ పి.జె.చంద్రశేఖరరావు, సిపిఐ సీనియర్ నాయకులు కందిమళ్ల ప్రతాపరెడ్డి, కవి, రచయిత ఏటుకూరి ప్రసాద్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాగం హేమంతరావు, తరువాయి 2లో

## మతోన్మాద బిజెపిని అడ్డుకునేది వామపక్షాలే

### ఆ శక్తి తెలంగాణ గడ్డపై కమ్యూనిస్టులకే ఉంది

సిపిఐ సీనియర్ నాయకులు కందిమళ్ల ప్రతాపరెడ్డి



వీర తెలంగాణ గడ్డపై మతోన్మాద బిజెపి అధికారంలోకి రాకుండా అడ్డుకునే శక్తి కేవలం వామపక్ష పార్టీలకే ఉందని, ఇందుకు అన్ని కమ్యూనిస్టు పార్టీలు ఏకం కావాలని సిపిఐ సీనియర్ నాయకులు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధులు కందిమళ్ల ప్రతాపరెడ్డి పిలుపునిచ్చారు. సిపిఐ వందేళ్ల ప్రస్థానంలో చేసిన పోరాటాలు, త్యాగాలు సాధించిన విజయాలను మననం చేసుకుంటున్నామన్నారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సిపిఐ పోరాటాలు నిర్వహించిందని, మాతృదేశం కోసం నాయకులు ప్రాణాలను అర్పించారని గుర్తు చేశారు. 1942 వరకు తరువాయి 2లో

## అమరుల త్యాగం, రక్తంతో ఎరుపెక్కిన ఎర్ర జెండా

ఏటుకూరి ప్రసాద్



అమరవీరుల త్యాగం, రక్తంతో ఎరుపెక్కిన జెండా ఎర్రజెండా అని, నిజాంకు వ్యతిరేకంగా రైతాంగ సాయుధ పోరాటంలో ఎందరో అమరులైన వారి వారసత్వం బాట ఎర్రబాట అని ఏటుకూరి ప్రసాద్ అన్నారు. ప్రస్తుతం కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిన నాటి దశలో ఉన్న రాజకీయ పరిస్థితులే ప్రస్తుతం దేశంలో ఉండడంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఫాసిజం మళ్లీ విజృంభిస్తోందన్నారు. గతంలో కమ్యూనిస్టులు రక్తార్పణతో ఏ ఆశయాలు, అదర్శాలతో ముందుకు వెళ్లారో ఆ ఆశయాల స్ఫూర్తిని ముందుకు తీసుకువెళ్లాలన్నారు. ఫాసిజం ఎన్నో రకాల ముసుగు ధరించి చిన్నల నుంచి పెద్దల వరకూ అనేక తరువాయి 2లో

# మన పొత్తు ప్రజలతోనే

- ప్రజావ్యతిరేక విధానాలు అవలంబించిన గత బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దెదింపడంలో సిపిఐ కీలక పాత్ర
- రాష్ట్రంలో బిజెపిని అధికారంలోకి రానీయకుండా ఉండేందుకు వామపక్షాలు మరింత ఐక్యతతో ముందుకు సాగాలి
- మహాసభలో కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టిన కూనంనేని



బి.అంజన్ కుమార్
కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వరరావు నగర్ నుంచి

కమ్యూనిస్టు పార్టీ స్థాయికి తగిన ఉద్యమాలను కొంత కాలంగా నిర్మించలేదని, ఇందుకు అధికార కాంగ్రెస్‌తో ఎన్నికల్లో ఉన్న అవగాహన ఒక కారణమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. ప్రభుత్వం స్థిమితపడేందుకు కొంత సమయం ఇవ్వాలని ఎదురుచూసామని తెలిపారు. తమకు పొత్తు ఉన్న మాట వాస్తవమేనని, అసలు పొత్తు ప్రజలతోనే అని చెప్పారు. ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరించిన గత బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దింపడంలో సిపిఐ కీలక పాత్ర పోషించిందని వివరించారు. మతోన్మాద పార్టీ బిజెపిని తెలంగాణ గడ్డపై అధికారంలోకి రానీయకుండా ఉండేందుకు వామపక్షాలు మరింత ఐక్యతతో ముందుకు సాగాల్సి ఉందని కూనం నేని సాంబశివరావు పేర్కొన్నారు. మున్ముందు ప్రజా సమస్యలపై పెద్ద ఎత్తున ఉద్యమాలకు కార్యాచరణను ప్రస్తుత మహాసభలో రూపొందిస్తామన్నారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వరరావు నగర్‌లోని కామ్రేడ్ బాలమల్లేశ్ హాల్‌లో జరుగుతున్న సిపిఐ రాష్ట్ర నాలుగవ మహాసభలో బుధవారం నాడు కూనంనేని సాంబశివరావు ప్రతినిధుల సభలో ముసాయిదా రాజకీయ, నిర్మాణ నివేదికను ప్రవేశపెట్టారు. ఎన్నికల హామీల విషయంలో కాంగ్రెస్ కొంత మంచిగానే చేస్తున్నప్పటికీ, ప్రజల్లో మిగతా హామీల విషయంలో కొంత అసంతృప్తి ఉన్నదన్నారు. కాంగ్రెస్‌తో ఎన్నికలలో కలిసి పోటీ చేసినంత మాత్రాన కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభించే ప్రజా వ్యతిరేక విధానాలు, ఎన్నికల హామీల అమలుపై కమ్యూనిస్టు పార్టీ విమర్శ, పోరాటం విషయంలో రాజీపడబోమని స్పష్టం చేశారు. పార్టీకి బలమైన అవకాశాలు ఉన్న నియోజకవర్గాలపై దృష్టి సారించి ప్రాధాన్యతాక్రమంలో పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. బిజెపిని బిఆర్ఎస్ పైకి విమర్శిస్తున్నప్పటికీ పరోక్ష సహకారం అందిస్తోందని విమర్శించారు. కాళేశ్వరం విచారణ, ఇతర కేసులతో ఆ పార్టీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నదని, బిజెపిలో సైతం అంతర్గత ఇబ్బందులు ఉన్నట్లు పేర్కొన్నారు. పార్టీ ఆధ్వర్యంలో వివిధ జిల్లాలలో వేసిన గుడిసెవాసులందరికీ పట్టాలు సాధించే కృషి, పోరాటాలు కొనసాగించాలని, ఆర్.టి.సి, సింగరేణి లాంటి ప్రభుత్వ సంస్థలను పరిరక్షించుకొనేందుకు ఉద్యమించాల్సి ఉందని చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ పునాది కలిగిన స్థానాలలో, అవకాశమున్న చోట పోటీ చేసి విజయం సాధించేందుకు కృషి చేయాలని ఇందుకు పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని తెలిపారు. పార్టీ శత జయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగసభను జయప్రదం చే సేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని సూచించారు అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టంతో పాటు వివిధ రంగాల ప్రజల సమస్యలపై ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరంతర అవిశ్రాంత పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.




12

# భారీ రెడ్ ఫ్లాగ్ మార్చ్

## షాపూర్ నగర్ కూడలి నుంచి కామ్రేడ్ బాలమల్లేశ్ హాల్ వరకు దారంతా అరుణమయం

## రాష్ట్రానికి 50 వేల మెట్రిక్ టన్నులు

- సరఫరాకు కేంద్రం ఆమోదం
- ఫలించిన కాంగ్రెస్ ఎంపిల యూరియా పోరాటం

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రైతాంగం శ్రేయస్సు కోసం సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతాంగం కు ఎల్లపుడు ప్రభుత్వం అండగా ఉంటుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు పేర్కొన్నారు. తెలంగాణ కాంగ్రెస్ ఎంపిలు కేంద్రంతో పోరాడడం వల్ల యూరియా సరఫరాకు మోక్షం లభించిందన్నారు.. తెలంగాణ రాష్ట్రానికి ఈ వారంలో 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా కు కేంద్ర రసాయనాలు ఎరువుల శాఖ ఆమోదం తెలిపిందన్నారు..కర్ణాటక నుంచి 10800 మెట్రిక్ టన్నుల తరువాయి 2లో

### వరుసగా 30 రోజులు నిర్బంధంలో ఉంటే

# పిఎం, సిఎంల తొలగింపు

## మూడు బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టిన హోంమంత్రి అమిత్‌షా

- బిల్లులు రాజ్యాంగ విరుద్ధం,ప్రజాస్వామ్యంపై ప్రత్యక్ష దాడి
- ప్రతిపక్షాల తీవ్ర ఆగ్రహం, నిరసనతో దద్దరిల్లిన లోక్‌సభ
- ప్రతులు చించి వెల్‌లోకి దూసుకొచ్చిన ఎంపీలు



**న్యూఢిల్లీ:** ప్రధానమంత్రి,ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, రాష్ట్రాలలో మంత్రులపై తీవ్ర నేరారోపణలు వచ్చినప్పుడు అరెస్టై 30 రోజులు కస్టడీలో ఉంటే వారు సహజసిద్ధంగా పదవీచ్యుతులయ్యేవిధంగా 130వ రాజ్యాంగ సవరణతోపాటు ఇతర సవరణ బిల్లులను హోంమంత్రి అమిత్ షా లోక్‌సభలో ప్రవేశపెట్టడంతో ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ బిల్లులకు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. దోషిగా నిర్ధారణ కాక ముందే కేవలం ఆరోపణలపై పదవీచ్యులను

### మూడు బిల్లులు

1. రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 75, 164, 239ఎఎఎలను సవరించేందుకు ఉద్దేశించిన "రాజ్యాంగ (130వ సవరణ) బిల్లు.
2. జమ్మూ అండ్ కశ్మీర్ రీ ఆర్గనైజేషన్ (సవరణ) బిల్లు
3. గవర్నమెంట్ ఆఫ్ యూనియన్ టెరిటరీస్ (సవరణ) బిల్లు, 2025.

రాజ్యాంగ (130వ సవరణ) బిల్లు లక్ష్యాలు, కారణాలు ఇలా చెబుతున్నాయి. ఎన్నికైన ప్రజాప్రతినిధులు భారత ప్రజల ఆశలు, ఆకాంక్షలకు ప్రాతినిధ్యం వహిస్తారు. వారు రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా ప్రజాప్రయోజనాల కోసం, ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తారని భావించబడతారు. అధికార పదవుల్లోని మంత్రుల (ప్రధాని, ముఖ్యమంత్రులు సహా) వ్యక్తిత్వం, నడవడిక అణుమాత్రం తరువాయి 2లో

### టోక్యో, న్యూయార్క్‌తో

# హైదరాబాద్ పోటీ

- రాజీవ్ గాంధీ కృషి వల్లే దేశంలో ఐటి విప్లవం
- గచ్చిబౌలిలో ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రార్ కార్యాలయం శంకుస్థాపన చేసిన సిఎం రేవంత్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ నగరానికి బెంగుళూరు, చెన్నై లాంటి నగరాలతో పోటీ కాదని టోక్యో, న్యూయార్క్ లాంటి నగరాలతో పోటీ అని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు. గచ్చిబౌలిలోని తాలిమ్‌లో ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ భవన నిర్మాణానికి బుధవారం సిఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నిర్మాణంతో రిజిస్ట్రేషన్ తరువాయి 2లో

# ప్రపంచం
WORLD NEWS

## కీలక పట్టణం స్వాధీనం చేసుకున్న మయన్మార్ జుంటా సైన్యం

**బ్యాంకాక్ :** మయన్మార్‌లో జుంటా పాలకుల సైన్యం ఒక కీలక పట్టణాన్ని స్వాధీనం చేసుకుంది. జుంటా పాలకులు అధికారంలోకి వచ్చిన 2021 నుండి డిమోసో పట్టణం ప్రజాస్వామ్య తిరుగుబాటుదారుల ఆధీనంలో ఉంది. దేశ రాజధాని నేపిదాకు 105 కి.మీ దూరంలో ఉన్న ఈ పట్టణాన్ని స్వాధీనం చేసుకున్నట్లు జుంటా సైన్యం ప్రకటించింది. ఈ ఏడాది డిసెంబరు 28న మయన్మార్‌లో వివాదాస్పద ఎన్నికలకు ప్రకటన వెలువడిన తర్వాత జుంటాకు ఇది పెద్ద విజయం. దేశంలో ప్రజాస్వామ్యంకోసం తిరుగుబాటు చేసిన ప్రజాదళాల నుండి ఎక్కువ ప్రాంతాలను స్వాధీనం చేసుకుని ఎన్నికలు నిర్వహించాలని జుంటా పాలకులు భావిస్తున్నారు. ఆంగ్‌సాన్ సూకీని పదవీచ్యుతురాలిని చేసిన తర్వాత తలపెట్టిన ఈ ఎన్నికలు కేవలం తమ అధికారాన్ని సుస్థిరం చేసుకోవడానికి తప్ప నిజమైన ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించడానికి కాదని అంతర్జాతీయ పరిశీలకులు ఇప్పటికే మయన్మార్ సైనిక పాలకులపై విమర్శలు ప్రారంభించారు.

## అఫ్ఘానిస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం
### 76 మంది వలస ప్రజలు మృతి

**కాబూల్ :** అఫ్ఘానిస్థాన్‌లో మంగళవారం రాత్రి హెరాత్ ప్రావిన్స్‌లోని రహదారిపై జరిగిన పెద్ద ప్రమాదంలో 76 మంది మరణించారు. వీరంతా ఇటీవల ఇరాన్ నుండి బలవంతంగా అఫ్ఘానిస్థాన్‌కు తరలిపోయిన అఫ్ఘానిస్థాన్ వలస ప్రజలు. ఈ ప్రమాదంలో మరో ముగ్గురు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నారు. ఇటీవలి సంవత్సరాలలో దేశంలో జరిగిన అతి ఘోరమైన రోడ్డు ప్రమాదం ఇదేనని ఆ దేశ పత్రికలు తెలిపాయి. గుజారా జిల్లాలో హెరాత్ నగరం వెలుపల ఈ ప్రమాదం జరిగింది. వలస ప్రజలను తీసుకువెళుతున్న ఒక బస్సు ఎదురుగా వస్తున్న ఒక మోటారు సైకిలును, ఇంధనాన్ని తీసుకువెళుతున్న మరో లారీని ఢీకొట్టడంతో మంటలు చెలరేగాయి. ఈ అగ్నిజ్వాలల్లో ప్రయాణికులు మరణించారు. ఈ బస్సులో ప్రయాణిస్తున్న వలస ప్రజలంతా ఇటీవలే ఇరాన్ నుండి అఫ్ఘానిస్థాన్ కాబూల్‌కు చేరుకున్నారు. ఈ ఏడాది ప్రారంభం నుండి ఇరాన్, పాకిస్థాన్ దేశాల నుండి 15 లక్షలమంది అఫ్ఘానిస్థాన్ ప్రజలు తిరిగి స్వదేశం చేరుకున్నారు. ఈ రెండు దేశాలూ వారిని బలవంతంగా అఫ్ఘానిస్థాన్‌కు తిప్పి పంపాయి. అనేక దశాబ్దాలపాటు పాకిస్థాన్, ఇరాన్ దేశాలు వారికి ఆతిథ్యం ఇచ్చాయని, ఇప్పుడు స్వదేశానికి తిప్పి పంపాయని ఐక్యరాజ్యసమితి మైగ్రేషన్ ఏజన్సీ ప్రకటించింది. అఫ్ఘానిస్థాన్‌లో దశాబ్దాలుగా జరిగిన అంతర్యుద్ధం వల్ల, పేదరికంవల్ల రహదారులన్నీ మరమ్మతులు లేక దారుణస్థితిలో ఉన్నాయి. ఈ రహదారులపై ప్రమాదాలు సాధారణంగా మారాయి.

# హమాస్ ప్రతిపాదనకు తిరస్కృతి

● గాజా సిటీ ఆక్రమణ ప్రణాళికకు ఐడిఎఫ్ ఆమోదం ● 60,000 మంది రిజర్విస్టుల మోహరింపుకు సిద్ధం

**టెల్‌అవీవ్ :** మధ్యవర్తుల ఒత్తిడితో గాజాలో కాల్పుల విరమణకు, పలుమంది బందీల విడుదలకు హమాస్ తెలిపిన అంగీకారాన్ని ఇజ్రాయెల్ తిరస్కరించింది. 50 మంది బందీలను ఒకేసారి విడుదల చేయాలనేది ఇజ్రాయెల్ షరతు. కానీ బందీలు, గల్లంతైనవారి బంధువుల వేదిక ఇజ్రాయెల్ చర్యను ఖండించింది. హమాస్ అంగీకారాన్ని ఎందుకు తిరస్కరించారని ప్రశ్నించింది. అధికారంలోనే నెతన్యాహూ హమాస్ ప్రతిపాదనను తిరస్కరించారని విశ్లేషకులు మరోవైపు విమర్శించారు. పది మంది విడుదలకు హమాస్ అంగీకారం తెలిపిన మరునాడే రక్షణమంత్రి ఇజ్రాయెల్ కట్జ్ సారథ్యంలో ఉన్నత సైనికాధికారులతో టెల్అవీవ్‌లో జరిగిన సమావేశం గాజా సిటీ ఆక్రమణ ప్రణాళికను ఆమోదించింది. గాజా సిటీ ఆక్రమణ ఆపరేషన్ ''గిడియాన్స్ ఛారియట్స్—బి'' అనే సంకేతనామంతో చేపడుతున్నారు. 60,000 మంది రిజర్విస్టు సైనికులను యుద్ధ రంగానికి రావాలని సమావేశం పిలుపు ఇచ్చింది. వీరంతా దశలవారీగా వస్తారు. హమాస్‌ను పూర్తిగా ఓడించి గాజాలో ఉన్న 50 మంది బందీలను ఒకేసారి చెరవిడిపించి తీసుకురావడం ఈ ఆపరేషన్ ప్రధాన ఉద్దేశం. గాజాలో సైనిక చర్యను విస్తరించేందుకు ఈ ఏడాది మే నాలుగో తేదీన ''గిడియోన్స్ ఛారియట్'' సంకేతనామంతో సైనికచర్యను



ఇజ్రాయెల్ సెక్యూరిటీ కేబినెట్ ఆమోదించి ప్రారంభించింది. గాజాను గెలుచుకుని పాలస్తీనియన్లను దక్షిణ ప్రాంతం వైపు నెట్టి, హమాస్ ఉగ్రవాద సంస్థను పూర్తిగా నిర్మూలించి మానవ సహాయ కేంద్రాలను తమ నియంత్రణలోకి తెచ్చుకోవాలనేది మే నెలనాటి సైనిక చర్య లక్ష్యం. కానీ హమాస్ పూర్తి నిర్మూలన, బందీలందరి విడుదల అనేక ప్రధాన లక్ష్యాలు పూర్తి కాలేదు కాబట్టి ఇప్పుడు ''గిడియోన్స్ ఛారియట్—బి'' సంకేతనామంతో గాజాసిటీ ఆక్రమణ చర్య ప్రారంభిస్తున్నట్లు కట్జ్ చెప్పారు. ఈసారి దాడుల్లో ఐ డి ఎఫ్ గాజా స్ట్రిప్‌లో 75 శాతం భూభాగాన్ని తన అధీనంలోకి తెచ్చుకుంటుందని చెప్పారు. ఐతే హమాస్ అధీనంలో ఉన్న ప్రాంతాలలోకి గనుక ఐడిఎఫ్ ప్రవేశిస్తే, బందీలదరినీ ఉరితీసి చంపుతామని హమాస్ హెచ్చరించడంతో ఇజ్రాయెల్ సైన్యం ఇంకా ముందుకు వెళ్ళే సాహసం చేయడంలేదు. కానీ ఉత్తర గాజాలోని బెయిట్ హనౌన్‌లో హమాస్ ఉగ్రవాదులను ఐడిఎఫ్ పూర్తిగా నిర్మూలించింది. దక్షిణ గాజాలోని ఖాన్ యూనిస్‌లో కొద్దిసంఖ్యలో ఉన్న హమాస్ ఉగ్రవాదులు ఐడిఎఫ్‌తో తీవ్ర పోరాటం చేస్తున్నారు. మే నెలలో గిడియోన్స్ ఛారియట్స్ సైనిక చర్య ప్రారంభించాక ఇప్పటివరకూ 48 మంది ఇజ్రాయెల్ సైనికులు పేలుడు ఘటనల్లో మరణించారు. కట్జ్‌తోపాటు ఐ డి ఎఫ్ (ఇజ్రాయెల్ డిఫెన్స్‌స్టాఫ్) ప్రధానాధిపతి లెఫ్టినెంట్ జనరల్ ఏయల్ జమీర్, సహాయ సైన్యాధిపతి మేజర్ జనరల్ తమిర్ యాద్రై, ఆపరేషన్స్ డైరెక్టొరేట్ ప్రధానాధిపతి ఇట్జిక్ కోహెన్, ఇంటెలిజన్స్ డైరెక్టరేట్ ప్రధానాధిపతి మేజర్ జనరల్ స్లోమీ బిండెర్ తదితరులు మంగళవారం జరిగిన సమావేశంలో పాల్గొని గాజా సిటీ ఆక్రమణ ప్రణాళికకు ఆమోదం తెలియజేశారు. 60 రోజులు కాల్పుల విరమణతోపాటు 10 మంది సజీవులతోపాటు మరో 18 మంది నిర్జీవులైన బందీల మృతదేహాలను స్వాధీనం చేసేందుకు సోమవారం రాత్రి హమాస్ అంగీకరించింది. ఇందుకు బదులుగా ఇజ్రాయెల్ జైళ్ళల్లో ఉన్న 140 మంది పాలస్తీనా ఖైదీలను విడుదల చేయాల్సి ఉంటుంది. కానీ పూర్తిగా ఒకేసారి 50 మంది బందీలను విడుదల చేయాలని ఇజ్రాయెల్ పట్టుపట్టింది.

### 8 మంది హమాస్ ఉగ్రవాదులు కాల్చివేత

గాజాలోని ఖాన్ యూనిస్ ప్రాంతంలో ఒక సొరంగంలో దాక్కున్న హమాస్ ఉగ్రవాదులు ఇజ్రాయెల్ సైన్యంపై బుధవారం ఉదయం కాల్పుల దాడిచేశారు. ఈ దాడులను సైన్యం తిప్పికొట్టింది. సైన్యం ఎదురు కాల్పుల్లో ఎనిమిది మంది హమాస్ ఉగ్రవాదులు మరణించగా మిగిలినవారు తిరిగి సొరంగంలోకి పారిపోయారు. కాగా గాజాలో బుధవారం ఉదయం నుండీ ఐడిఎఫ్ దాడుల్లో మరణించిన పాలస్తీనా ప్రజలసంఖ్య 35కు పెరిగింది. కాగా ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతూ ఉండటంతో గాజా సిటీలో ఆకాశంలో అతిపెద్ద పొగ మేఘం కమ్ముకుంది.

## ఓటు హక్కు ప్రశ్నార్థకం
(మొదటి పేజీ తరువాయి)

కళవేన శంకర్, ఎం.బాల నరసింహ్, వి.ఎస్.బోస్, ఇ.టి.నరసింహ్, ప్రముఖ సినీ నటుడు డాక్టర్ మాదాల రవి, ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు డి.జి.సాయిల్‌గౌడ్, ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి ఇ.ఉమా మహేశ్ తదితరులు ఆసీనులయ్యారు. సభలో డి.రాజా ప్రసంగిస్తూ దేశం ప్రస్తుతం అత్యంత సంక్లిష్టమైన సవాళ్లను ఎదుర్కొంటోందని, ప్రాథమిక హక్కులు, పౌరుల హక్కుగా ఉన్న ఓటు హక్కు ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు. బిజెపి, ప్రధాని మోదీ అధికారంలోకి వచ్చిన అనంతరం రాజ్యాంగంపై దాడి పెరిగిందన్నారు. పార్లమెంట్‌ను పనిచేయనివ్వడంలేదని, అది పని చేయకపోతే ప్రజాస్వామ్యం అంతమవుతుందని, ప్రజాస్వామ్యం విధ్వంసం అవుతుందని హెచ్చరించారు. అర్హులైన ప్రజలందరికీ ఓటు హక్కు కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ఎన్నికల కమిషన్‌పై ఉండగా, బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్‌ఐఆర్—సర్) పేరుతో పాలకులకు ఇష్టం లేని ఓటర్లను పెద్ద ఎత్తున తొలగించే కార్యక్రమం చేస్తున్నారని విమర్శించారు. త్వరలో ఎన్నికలు జరిగే తమిళనాడు, కేరళ, బెంగాల్ రాష్ట్రాలలో ఎన్నికల కమిషన్ ఎలా పనిచేస్తుందనేది పెద్ద సమస్య అన్నారు. అర్హులైన వారందరికీ ఓటు హక్కును కల్పించేందుకు రాజ్యాంగ బద్ధమైన ఎన్నికల కమిషన్‌కు అధికారాలు ఉన్నాయని, కానీ ప్రస్తుతం ఆ సంస్థ రాజ్యాంగ బద్ధమైన సంస్థగా పనిచేయడం లేదని విమర్శించారు. ఎన్నికల కమిషన్ అర్హులైన ప్రతి పౌరునికి ఓటు హక్కు కల్పించాలని సిపిఐ డిమాండ్ చేస్తున్నదని, అర్హులైన వారు తమ ఓటు హక్కును కోల్పోతున్నారని, ప్రజాస్వామ్యం ఎక్కడ అమలు జరుగుతున్నదని నిలదీశారు. బిహార్‌లో ఎస్‌ఐఆర్‌ను నిలుపుదల చేయాలని సుప్రీంకోర్టులో సిపిఐ తరపున స్వయంగా తాను పిటిషన్ దాఖలు చేసినట్టు రాజా వెల్లడించారు. భారత్ హిందూత్వ దేశం, మతతత్వ రాజ్యాంగ మారితే దేశానికే పెద్ద విపత్తుగా పరిణమిల్లుతుందని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఏనాడో హెచ్చరించారు. భారతదేశాన్ని కాపాడాలంటే బిజెపికి వ్యతిరేకంగా, ఆర్‌ఎస్‌ఎస్‌కు వ్యతిరేకంగా లౌకిక, ప్రజాస్వామ్య శక్తులన్నీ ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అందుకే ఇండియా కూటమి ఏర్పాటైందని, దాని ఏర్పాటులో సిపిఐ కీలక పాత్ర పోషించిందని రాజా తెలిపారు. ఇండియా కూటమిలో భాగస్వాములు కూడా పరస్పర సహకారం, సర్దుబాటు అవసరమని సూచించారు.

**ఓటు హక్కును 18 ఏళ్ళకు సవరించిన ఘనత సిపిఐదే**

ఇటీవలనే దేశ స్వాతంత్ర్య దినోత్సవం జరిగిందని, స్వాతంత్ర్యం రాకముందు భారతదేశం బ్రిటీష్, ఫ్రెంచ్, పోర్చుగీస్ వలస పాలనలో ఉండేదని, అప్పట్లో ఎన్నికలు జరిగాయని, కానీ ఓటు హక్కు అందరికీ ఉండేది కాదని, సంపన్నులు, ఉన్నత స్థాయి వ్యక్తులకు మాత్రమే ఓటు హక్కు ఉండేదన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే భారతదేశంలో 21 ఏళ్లు దాటిన పౌరులందరికీ మతాలు, ప్రాంతాలు, స్త్రీ, పురుష బేధం లేకుండా వయోజన ఓటు హక్కును రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కల్పించారని తెలిపారు. సిపిఐ నేత సి.కె.చంద్రప్పన్ పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న సమయంలో వయోజన ఓటు వయస్సును 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించాలని పార్లమెంట్‌లో ప్రస్తావించగా, నాటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ అంగీకరించి, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ కులం, మతం, ప్రాంతం అనే తేడాలు లేకుండా ఓటు హక్కును కల్పించారు. భారతదేశంలో స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే వయోజనులైన పురుషులతో సమానంగా మహిళలకు కూడా ఒకే సమయంలో ఓటు హక్కు లభించిందన్నారు. కానీ అమెరికాలో, యురోపియన్ దేశాల్లో చాలా కాలం పురుషులకు మాత్రమే ఓటు హక్కు ఉండేదని, అనేక పోరాటాలు తరువాతనే మహిళలకు ఓటు హక్కు దక్కిందన్నారు. భారతదేశంలో అత్యంత ధనికులైన అదానీ, అంబానీ ఓటుకు, సామాన్య ప్రజల ఓటుకు ఒకే విలువ ఉంటుందని, అది అంబేద్కర్ గొప్పతనమని చెప్పారు. అదే విధంగా ఓటుతో పాటు ప్రతి మనిషికి ఒకే విలువ ఉండే సమాజం కావాలని ఆయన ఆకాంక్షించారని గుర్తు చేశారు.

**ఎన్నికల్లో సిపిఐ బలం పెరగాలి**

కార్మికులు, రైతులు, మహిళలు, కమ్యూనిస్టు పార్టీని మరింత బలోపేతం చేయాలని రాజా పిలుపునిచ్చారు. తెలంగాణలో సిపిఐ అత్యంత బలమైన పార్టీ అని, ప్రస్తుతం ఒక్క ఎంఎల్‌ఎ, ఎంఎల్‌సి ప్రాతినిధ్యం వహిస్తున్నారన్నారు. ప్రజాసమస్యలను మరింత ఎలుగెత్తి చాటేందుకు పార్లమెంటు, అసెంబ్లీ, ప్రతి ప్రజాప్రాతినిధ్య ఎన్నికల్లో సిపిఐ బలం పెరగాలని ఉద్ఘాటించారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగిన సాయుధ పోరాటంలో ముఖ్యపాత్ర పోషించిన ఘన చరిత్ర సిపిఐది అని గుర్తు చేశారు.

## అడ్డుకునేది వామపక్షాలే
(మొదటి పేజీ తరువాయి)

భారత కమ్యూనిస్టు పార్టీపై నిషేధం ఉన్నా, రైతులు, కూలీలు, విద్యార్థులు, యువకులను సంఘటితం చేసి స్వాతంత్ర్య పోరాటంలో కదిలించిందని వివరించారు. స్వాతంత్ర్య సమరంలో ముందుండి పోరాటం చేసిన కమ్యూనిస్టు పార్టీ నాయకులు జైలు శిక్ష అనుభవించారన్నారు. నిరంకుశ నిజాంకు వ్యతిరేకంగా మట్టి మనుషులతో బంధూకులు పట్టించి సాయుధ సమరాన్ని నడిపిన చరిత్ర సిపిఐదన్నారు. కమ్యూనిస్టు పార్టీ చీలికతో కొంత బలహీనమైందని, దీనిని అధిగమించేందుకు దేశంలోని కమ్యూనిస్టు పార్టీలు, మేధావులను ఏకం చేసేందుకు కీలకపాత్ర పోషించాలని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజాను ఆయన కోరారు. రాజకీయాలు వ్యాపారంగా మారాయని, తెలంగాణ విప్లవగడ్డపై కమ్యూనిస్టులుగా కమ్యూనిస్టుల పాత్ర ఏమిటనేది మహాసభలో ఆత్మపరిశోధన చేసుకోవాలని సూచించారు. నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన వీర తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను మరుగున పడేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమే స్ఫూర్తి అని, అయితే మాజీ సిఎం కెసిఆర్ తానే ఒక వీరునిగా చెప్పుకుంటున్నారని, సాయుధ పోరాటాన్ని తామే నడిపించినట్టు చరిత్రను బిజెపి వక్రీకరిస్తున్నారన్నారు. కమ్యూనిస్టులందరి ఆశయం ఒక్కటేనని, ఐక్యత తమ ఆయుధమని, ఈ ప్రజాతంత్ర ఐక్యత ద్వారా కమ్యూనిస్టు స్ఫూర్తిని, ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

## ఎరుపెక్కిన ఎర్ర జెండా
(మొదటి పేజీ తరువాయి)

రూపాల్లో బయటపడడం ప్రజాస్వామ్యానికి తీవ్ర విఘాతమన్నారు. ఈ పరిస్థితులు ఎదుర్కొనే శక్తి కేవలం వామపక్షాలకు మాత్రమే ఉందన్నారు. ఈ దశలో అమరవీరుల ఆశయాల స్ఫూర్తితో వామపక్షాలన్నీ ఐక్యంగా ముందుకు కదిలి ఫాసిస్టు శక్తులను ఓడించేందుకు ప్రతిజ్ఞ చేయాల్సి అవసరముందన్నారు. సినీ నటులు మాదాల రవి మాట్లాడుతూ కమ్యూనిస్టు శక్తులన్నీ ఏకమై పోరాటం చేసినప్పుడే సామాన్యుడి గుండె ప్రతిధ్వనిస్తుందని, కుళ్ళుతున్న వ్యవస్థను కూకటి వేళ్లతో పీకేస్తారని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సాంస్కృతిక విప్లవం రావాల్సిన అవసరం ఉన్నదన్నారు. మతతత్వ శక్తులను ఎదుర్కొవాలంటే డబ్బులు ప్రధానంగా మారిన ఎన్నికల వ్యవస్థపై అందరూ కలిసి పోరాటం చేయాలన్నారు. కళ కాసుల కోసం కాదని, సామాన్యులలో చైతన్యం తీసుకురావడం కోసమని, ప్రజా కళాకారులందరూ ప్రజలను చైతన్య వంతులను



చేసినప్పుడే ప్రజలలో చైతన్యం వస్తుందన్నారు. మానవ సంబంధాలను మట్టి కరిపించే విధంగా ప్రస్తుత సినిమాలు, సీరియల్స్ ఉన్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఎర్రమల్లెలు లాంటి సినిమాలు తీసిన మాదాల రంగారావు కూడా కమ్యూనిస్టు పార్టీ తయారు చేసిన ఆయుధం అన్నారు.

## 50 వేల మెట్రిక్ టన్నులు
(మొదటి పేజీ తరువాయి)

యూరియా షిప్‌మెంట్ ప్రారంభమైందన్నారు.. ఈ వారంలో మరో మూడు షిప్‌మెంట్‌ల ద్వారా యూరియా సరఫరాకు కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌కు ఆదేశాలు జారీ అయ్యాయన్నారు.. యూరియా కొరతపై పార్లమెంట్ ఆవరణలో ఆందోళన చేసి తెలంగాణ రైతాంగం యూరియా కష్టాలపై దేశానికి తెలిసేలా చేసిన ఎంపిలకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల అభినందనలు తెలిపారు. ప్రతిపక్ష పార్టీ రాజకీయ స్వార్థం కోసం చేసే కుట్రల పట్ల రైతాంగం ఆలోచన చేయాలని సూచించారు. తెలంగాణకు కేటాయించిన యూరియా సకాలంలో సరఫరా చేయకుండా కేంద్ర ప్రభుత్వం వివక్ష కారణంగానే రైతులకు ఇబ్బందులు ఎదురయ్యాయన్నారు.

## హైదరాబాద్ పోటీ
(మొదటి పేజీ తరువాయి)

కార్యాలయాలలో ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చెప్పబోతున్నామన్నారు. ఆదాయాన్ని ఇచ్చే రిజిస్ట్రేషన్ కార్యాలయాల రూపురేఖలు మార్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. అన్ని సౌకర్యాలతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు నిర్మించబోతున్నామని తెలిపారు. ఫైవ్ స్టార్ హోటల్, ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ స్థాయిలో సౌకర్యాలతో సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలు నిర్మిస్తామన్నారు. ప్రభుత్వానికి రూపాయి ఖర్చు లేకుండా కార్యాలయాలు నిర్మిస్తున్నామని స్పష్టం చేశారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ నాటికి 11 ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నిర్మాణం పూర్తి చేయాలని మంత్రికి శ్రీనివాస్‌రెడ్డికి సూచించారు. 2034 ప్రపంచమంతా హైదరాబాద్ నగరంవైపు చూస్తుందని ఆశాభావం వ్యక్త పరిచారు. ఆ స్థాయిలో నగరాన్ని అభివృద్ధి చేసుకుందాం, నగర అభివృద్ధిని అడ్డుకునే వారు మనకు శత్రువే, అలాంటి దొంగల పని పట్టాల్సింది మీరే అని తెలిపారు. ఆనాడు రాజీవ్ గాంధీ చేసిన కృషి వల్లే దేశంలో ఐటీ రంగం అభివృద్ధి చెందిందన్నారు. తెలంగాణలోనూ హైటెక్ సిటీ అభివృద్ధికి ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం పునాది వేసిందని గుర్తు చేశారు. ప్రపంచంలో ప్రసిద్ధిగాంచిన కంపెనీలు ఇక్కడికి వచ్చాయంటే ఆనాటి ముఖ్యమంత్రుల దూరదృష్టినే కారణమన్నారు. మూసీ ప్రక్షాళన, భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణం కొంతమందికి ఇష్టం లేదని, ఆనాడు హైటెక్ సిటీ నిర్మాణాన్ని కూడా కొంత మంది అవహేళన చేశారని ఆరోపించారు. తెలంగాణ సమగ్ర అభివృద్ధికి 2047 ప్రణాళికను సిద్ధం చేస్తున్నామన్నారు. హైదరాబాద్ పాతబస్తీ ఓల్డ్ సిటీ కాదు.. ఒరిజినల్ సిటీ అని కొనియాడారు.మూసీ ప్రక్షాళనతో ఓల్డ్ సిటీకి పూర్వ వైభవాన్ని తీసుకొస్తామన్నారు. గోదావరి జలాలను తీసుకొచ్చి 365 రోజులు మూసీలో నీరుండేలా రివర్ ఫ్రంట్ అభివృద్ధి చేస్తామన్నారు.మధ్యతరగతి ప్రజల కోసం నగరంలో రాజీవ్ స్వగృహ భవనాలను నిర్మించాలని నిర్ణయించామని తెలిపారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగాలంటే నగర అభివృద్ధితో పాటు నగర విస్తరణ జరగాలన్నారు.

**త్వరలో 4 లక్షల సాదాబైనామాలపై నిర్ణయం: మంత్రి పొంగులేటి**

ఈ కార్యక్రమంలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం అక్రమంగా తీసుకువచ్చిన ధరణి పోర్టల్ ను సిఎం రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బంగాళాఖాతంలో కలిపేశామని, దేశంలోని 18 రాష్ట్రాలలో అధ్యయనం చేసి భూభారతి 2025 చట్టాన్ని రూపొందించామన్నారు. రోల్ మోడల్‌గా నిలిచిన ఈ భూభారతి చట్టం మేరకు రైతన్నల, ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు సదస్సులు నిర్వహించగా 8.60 లక్షల దరఖాస్తులు వచ్చాయని తెలపారు. వీటిలో 2లక్షల దరఖాస్తులు పరిష్కారం కాగా సుమారు 4లక్షల సాదాబైనామా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. రాష్ట్ర హైకోర్టు మంగళవారం ఈ సాదాబైనామాలపై ఉన్నస్టేను తొలగించినందున నిజమైన, అర్హత కలిగిన దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని మంత్రి పొంగులేటి ప్రకటించారు. ప్రస్తుతం జిహెచ్‌ఎంసీ, ఓఆర్‌ఆర్ పరిధిలోగల 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ల రూపేణా సుమారు 6263 శాతం ఆదాయం లభిస్తోందని, వీటిని 11 ఇంటిగ్రేటెడ్ భవనాల పరిధిలోకి తీసుకువస్తామని తెలిపారు.

**ప్రజలకు మంచి చేయాలన్నదే మా ప్రభుత్వ సంకల్పం: మంత్రి శ్రీధర్‌బాబు**

హైదరాబాద్ మహా నగరాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఐటి శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ అన్నారు, గతంలో ఎన్నడూ లేని విధంగా బడ్జెట్‌లో రూ.10వేల కోట్లు కేటాయించి మా చిత్తశుద్ధిని నిరూపించుకున్నామన్నారు. రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే ప్రజల సౌకర్యార్థం ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. గచ్చిబౌలిలోని తాలిమ్‌లో ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ భవనం మూడు ఎకరాల విశాల స్థలంలో రూ.30 కోట్లతో నిర్మిస్తున్నామన్నారు.

## మూడు బిల్లులు
(మొదటి పేజీ తరువాయి)

అనుమానానికీ అతీతంగా ఉండాలి. తీవ్రమైన క్రిమినల్ నేరారోపణలపై అరెస్టు చేయబడిన, కస్టడీలో ఉంచబడిన మంత్రి రాజ్యాంగ నైతికత, సుపరిపాలన సూత్రాలకు విఘాతం కలించవచ్చు, ప్రజలు అతనిలో ఉంచిన రాజ్యాంగ విశ్వాసాన్ని దిగజార్చవచ్చు. అటువంటి వారిని పదవుల నుంచి తొలగించేందుకు చట్టం లేనందున ఈ సవరణ అవసరమైంది''. ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాల్లోని మంత్రులపై సిబిఐ, ఇడిలను ప్రయోగించి ఇప్పటికే వేధిస్తున్న మోదీ ప్రభుత్వం, ఆ ప్రభుత్వాలను చట్టబద్ధంగా అస్థిరీకరించే కుట్రను ఈ బిల్లుల్లో ప్రతిపక్షాలు చూస్తున్నాయి. అందుకే వాటిని లోక్‌సభలో ప్రవేశపెట్టే దశలోనే తీవ్రంగా వ్యతిరేకించాయి.

## పిఎం, సిఎంల తొలగింపు
(మొదటి పేజీ తరువాయి)

చేసే యత్నం రాష్ట్రాలలో ప్రతిపక్ష ప్రభుత్వాలను కూల్చివేసే చర్యగా, ప్రజాస్వామ్యంపై ప్రత్యక్ష దాడిగా ప్రతిపక్షాలు పేర్కొంటూ నిరసన వ్యక్తం చేశాయి. ప్రతిపక్ష సభ్యుల విమర్శలను అమిత్ షా తోసిపుచ్చారు. బిల్లును జెపిసికి పంపారు. ఒకదశలో నిరసనలతో తీవ్ర ఉద్రిక్తత ఏర్పడంతో కేంద్రమంత్రులు రవ్‌నీత్ సింగ్ బిట్టు, కిరెణ్ రిజిజు సహా పలువురు అధికారపార్టీ ఎంపీలు వెళ్ళి అమిత్ షా చట్టూ మద్దతుగా నిలబడ్డారు. సభ మార్షల్స్ కూడా అమిత్ షా చుట్టూ వలయంలా ఏర్పడ్డారు. సభ వాయిదా పడిన తర్వాత కూడా ఈ దృశ్యం కొనసాగింది.

రాజ్యాంగ విరుద్ధమైన బిల్లులను సభలో ప్రవేశపెట్టిన బిజెపి ప్రభుత్వంపై విమర్శలు వెల్లువెత్తడంతో లోక్‌సభ దద్దరిల్లింది. ప్రభుత్వం భారత రాజ్యాంగంపైన, ప్రజాస్వామ్యంపైన, సమాఖ్య వ్యవస్థపైనా ప్రత్యక్ష దాడికి దిగిందని ప్రతిపక్ష ఎంపీలు తీవ్ర నిరసనలు వ్యక్తం చేయడంతో లోక్‌సభ అట్టుడికింది. కేంద్ర పాలిత ప్రాంతాల సవరణ బిల్లు—2025, రాజ్యాంగ సవరణ బిల్లు (రాజ్యాంగానికి 130వ సవరణ)—2025, జమ్మూ కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ సవరణ బిల్లు—2025లను అమిత్ షా సభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు ప్రకారం కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వ చట్టం 1963 (20వ నిబంధన) ప్రకారం ఆరోపణలు ఎదుర్కొంటున్న ముఖ్యమంత్రి లేదా మంత్రులు అరెస్టయితే, కస్టడీలో గడిపితే వారిని తొలగించే నిబంధన లేదు. అందువల్ల ఈ చట్టంలోని సెక్షన్ 45 లో సవరణ ప్రకారం ఈ నిబంధనలు చేర్చడం ద్వారా వారిని తొలగించే అధికారం ప్రాప్తిస్తుంది.

ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రులు, రాష్ట్రాలలో మంత్రులు ఎవరైనా 31వ రోజు నాటికి బెయిలు పొంది కస్టడీ నుండి బయటకు రాలేకపోతే ఈ రాజ్యాంగ సవరణ ప్రకారం వారు పదవులు కోల్పోతారు. ప్రతిపక్షాలు వ్యక్తంచేసిన అభిప్రాయాలను హోంమంత్రి అమిత్ షా లెక్కచేయలేదు. ఈ సవరణలు ఆమోదిస్తే, ప్రభుత్వ నిర్వహణపై ప్రజలకు విశ్వసనీయత పెరుగుతుందన్నారు. తర్వాత ఈ బిల్లును మూజువాణీ ఓటుద్వారా ఆమోదించి జాయింట్ సెలక్ట్ కమిటీ (జెపిసి)కి పంపారు. సెలెక్ట్ కమిటీలో 21 మంది లోక్‌సభ సభ్యులు, మరో 10 మంది రాజ్యసభ సభ్యులు ఉంటారు. ప్రతిపక్ష ఎంపీలు తమ అభ్యంతరాలు, సవరణలు ఏమైనా ఉంటే జెపిసికి సమర్పించాలని, ప్రతిపక్షాలకు జెపిసిలో పూర్తి అవకాశం ఉందని అమిత్‌షా చెప్పడం ప్రతిపక్షాలను మరింత ఆందోళనకు గురిచేసింది.

మంత్రి అమిత్ షా ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టగానే ప్రతిపక్ష ఎఐఎంఐఎం సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ స్పందిస్తూ, రాష్ట్రాలలో ప్రభుత్వాలు ఈ సవరణలవల్ల అస్థిరత్వానికి గురవుతాయని విమర్శించా రు. కాంగ్రెస్ ఎంపిలు మనీశ్ తివారీ, కె.సి.వేణుగోపాల్ తీవ్రస్థాయి లో ప్రతిస్పందిస్తూ, ఈ సవరణ బిల్లులు రాజ్యాంగవిరుద్ధమని, ప్రజాస్వామ్య విర్ధమని, సమాఖ్య వ్యవస్థకు వ్యతిరేకమని మండిపడ్డారు.

అమిత్ షా గుజరాత్ హోంమంత్రిగా అరెస్టయిన విషయాన్ని ఈ సందర్భంగా కె.సి.వేణుగోపాల్ ప్రస్తావించారు. ఆయన ఎందుకు ఇంకా రాజకీయాల్లో కొనసాగుతున్నారని, రాజకీయాల్లో కొనసాగడానికి ఆయనకున్న నైతికత ఏమిటని నిలదీశారు. అరెస్టుకు ముందే తాను పదవికి రాజీనామా చేశాననీ, కోర్టు విడుదల చేశాకే తిరిగి రాజకీయాల్లోకి వచ్చి పదవి చేపట్టానని అమిత్ షా తిరిగి తనను సమర్థించుకున్నారు. సభలో చెలరేగిన తీవ్ర గందరగోళం సద్దుమణగకపోవడంతో సభాపతి ఓం బిర్లా సభను సాయంత్రం ఐదు గంటలవరకూ వాయిదా వేశారు. ఐనాగానీ ప్రతిపక్షాలు తమ నిరసన కొనసాగించాయి. సభ్యులు హుందాగా ప్రవర్తించాలని, తమ తమ సీట్లలో కూర్చోవాలని సభాపతి విజ్ఞప్తి చేశారు. బిల్లును అనవసర తొందరపాటుతో ప్రవేశపెట్టారని ఆర్‌ఎస్‌పి ఎంపి ఎన్‌కె ప్రేమ్ చంద్రన్ విమర్శించారు. సభా నిబంధనలకు అనుగుణంగా ఈ బిల్లును ప్రవేశపెట్టలేదని విమర్శించారు.

**ఇది ఆర్‌ఎస్‌ఎస్—బిజెపి ఎజెండా**
**నిరసనలకు సిపిఐ పార్లమెంటరీ పార్టీ పిలుపు**

రాజ్యాంగానికి తలపెట్టిన 130వ సవరణ ప్రతిపాదనతో పాటు కేంద్ర పాలిత ప్రాంతాల సవరణ బిల్లు, జమ్మూ కశ్మీరు పునర్వ్యవస్థీకరణ సవరణ బిల్లులను భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) పార్లమెంటరీపార్టీ తీవ్రంగా ఖండించింది. వీటికి వ్యతిరేకంగా పార్లమెంటు వెలుపల, లోపలా తీవ్ర నిరసనలకు పిలుపు ఇచ్చింది. ఈ బిల్లులు ఆమోదం పొందడానికి అనుమతిస్తే దేశ ప్రజాస్వామ్యానికీ, సమాఖ్య వ్యవస్థకూ తీవ్ర హాని కలుగుతుందని పేర్కొంది. హోంమంత్రి అమిత్ షా ప్రతిపాదించిన ఈ మూడు సవరణ బిల్లులూ ఆర్ ఎస్‌ఎస్, బిజెపిల ఎజెండాలనీ, దేశంలో ప్రజాస్వామ్యానికి తెరదించి, ప్రతిపక్షాలను అణచివేసేందుకు, రాజ్యాంగ మౌలికసూత్రమైన సమాఖ్యవ్యవస్థపై ప్రత్యక్షదాడి చేసేందుకు, న్యాయబద్ధమైన పరిపాలన కొనసాగకుండా చూసేందుకే ఈ బిల్లులను తీసుకువచ్చారని సిపిఐ పార్లమెంటరీపార్టీ విడుదల చేసిన ప్రకటన నిశితంగా విమర్శించింది.

రాజ్యసభలో సిపిఐపక్ష నాయకుడు పి.సందోష్ కుమార్ స్పందిస్తూ, ''ఈ అమానుషమైన బిల్లులు ఆమోదం పొందడం అంటే, పగ, ప్రతీకారాలు తీర్చుకునే రాజకీయాలకు గేట్లు ఎత్తివేయడంతో సమానం, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సిబిఐ వంటి కేంద్రద దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తున్న బిజెపి ఇక ఇప్పుడు చాలా యధేచ్ఛగా ప్రజలు ఎన్నుకున్న ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల ప్రభుత్వాలను అస్థిరీకరిస్తుంది, ఏ ముఖ్యమంత్రి అయినా అరెస్టు కావచ్చు, వారిని పదవి నుండి తొలగించవచ్చు. అందుకు వీలుగా అధికారపార్టీ ఈ సవరణలు ప్రతిపాదించింది, ప్రజాస్వామ్యాన్ని, సమాఖ్యవ్యవస్థను ధ్వంసం చేయడానికి రాజకీయాలలో ఎలాంటి సమానత్వం లేకుం డా చేయడానికి పూనుకుంటున్నది'' అని విమర్శించారు. ఈ బిల్లులకు వ్యతిరేకం గా పార్లమెంటు వెలుపలా, లోపలా చాలా బలంగా ప్రజావాణి వినిపించాలని, నిరసన గళాన్ని చాటాలని సందోష్‌కుమార్ పిలుపు ఇచ్చారు. ఈ బిల్లులు ఆమోదం పొందితే దేశ ప్రజాస్వామ్యానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆయన హెచ్చరించారు. ప్రజల ప్రజాస్వామిక హక్కులకు నష్టం వాటిల్లుతుందన్నారు.

**ప్రజాస్వామ్యశక్తుల ఐక్యతకు సిపిఐ(ఎం) పిలుపు**

సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ ఎక్స్ వేదికగా ఒక ప్రకటన చేస్తూ, నరేంద్రమోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ మూడు సవరణ బిల్లులూ ఆ ప్రభుత్వ నయా నియంతృత్వ పోకడలను బహిర్గతం చేశాయని విమర్శించారు. ఈ బిల్లులు ప్రవేశపెట్టడం ప్రజాస్వామ్యంపై చేసిన ప్రత్యక్షదాడిగా పేర్కొన్నారు. ఈ అమానుష, కిరాతక చట్టాలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్యశక్తులు ఐక్యం కావాలని పిలుపు ఇచ్చారు.

సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య మాట్లాడుతూ, ఈ బిల్లు సమాఖ్య వ్యవస్థకు మృత్యుఘంటికలు మోగిస్తోందన్నారు. ఎన్నికల వ్యవస్థను కూలదోయడం దగ్గర నుండి ఎన్నికల కమిషనర్ల నియామకాలు, ఒకేదేశం, ఒకే ఎన్నిక వ్యవస్థతోపాటు ఇప్పుడు ఈ మూడు సవరణ బిల్లుల వరకూ దేశ పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి, సమాఖ్య వ్యవస్థకు పాడె కట్టేందుకు బిజెపి ప్రయత్నం చేస్తోందని విమర్శించారు.

**పార్లమెంటరీ మెజార్టీ దుర్వినియోగం: ఖర్గే**

కేంద్రంలో బిజెపి నిసిగ్గుగా, బాహాటంగా తన పార్లమెంటరీ మెజారిటీ అధికారాన్ని దుర్వినియోగం చేస్తోందని రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్‌పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే విమర్శించారు. అమిత్ షా ప్రవేశపెట్టిన మూడు బిల్లులను ఆమోదించుకుని ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసేందుకు ఇడి, ఐ.టి, సిబిఐ వంటి కేంద్ర సంస్థలకు అమానుషమైన విపరీతాధికారాలు కట్టబెడతారని విమర్శించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను అస్థిరీకరించేందుకు వీటిని ఉపయోగిస్తారన్నారు. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థల చిత్తశుద్ధి అసాధారణమైన సవాళ్ళను ఎదుర్కొంటున్న ఈ తరుణంలో న్యాయబద్ధంగా, నిష్పక్షపాతంగా, హుందాగా రాజ్యసభ పని చేసేందుకు ఆ విలువలను పునరుద్ధరించేందుకు తాను స్థిరంగా కట్టుబడి ఉన్నానని ఖర్గే పేర్కొన్నారు.

**రాజ్యాంగ విరుద్ధం : ప్రియాంకాగాంధీ**

అమిత్‌షా లోక్‌సభలో ప్రవేశపెట్టిన మూడు సవరణ బిల్లులను రాజ్యాంగ విరుద్ధమైనవిగా కాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎంపి ప్రియాంకాగాంధీ వాద్రా పేర్కొన్నారు. ప్రజల కళ్ళకు గంటలు కట్టాలని ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ఈ బిల్లులు ఆమోదం పొందితే రేపు ఇక ముఖ్యమంత్రిమీద ఎలాంటి కేసులు పెట్టాల్సిన అవసరం ఉండదని, ఎలాంటి నేరం చేయకపోయినాగానీ వారిని అరెస్టు చేసిన 30 రోజుల తర్వాత పదవీచ్యుతులను చేయవచ్చునన్నారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి అభిషేక్ సింఘ్వి మాట్లాడుతూ, ఎన్నికల్లో ఓటమి చెందిన చోట్ల ముఖ్యమంత్రులను గద్దె దించేందుకు ఈ బిల్లులను ఉపయోగిస్తారని విమర్శించారు. కాగా, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ ఎంపి సాకేత్ గోఖలే ఎక్స్ వేదికగా ఒక పోస్టింగ్ పెడుతూ, రాష్ట్రాలలో ప్రభుత్వాలను కూల్చివేసేందుకే కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లులను ప్రతిపాదించిందని విమర్శించారు. ప్రభుత్వాలను కూల్చివేసేందుకు అమిత్ షా కొత్త మాయోపాయాలను ప్రవేశపెడుతున్నారన్నారు. లోక్‌సభలో టిఎంసి ఎంపి మహువా మొయిత్రా కూడా ఒక ప్రకటన చేస్తూ, సమాఖ్య వ్యవస్థను, న్యాయవ్యవస్థను తప్పించుకుని ముఖ్యమంత్రులను, మంత్రులను పదవీచ్యుతులను చేసేందుకు ఈ బిల్లులు తీసుకువచ్చారన్నారు. శివసేన (యుబిటి) నాయకుడు సంజయ్ రౌత్ స్పందిస్తూ, ప్రతిపక్షాల నాయకత్వంలో రాష్ట్రాలలో ఉన్న ప్రభుత్వాలను భయపెట్టేందుకే ఈ బిల్లులు తీసుకువచ్చారని విమర్శించారు. కేరళ అసెంబ్లీలో ప్రతిపక్ష కాంగ్రెస్ నాయకుడు వి.డి.సతీశన్ తిరువనంతపురంలో బుధవారం పాత్రికేయులతో మాట్లాడుతూ, ప్రతిపక్షాలు ఈ బిల్లులను గట్టిగా ప్రతిఘటిస్తాయన్నారు. సహజసిద్ధమైన న్యాయ విచారణకు విరుద్ధంగా ఈ బిల్లులను తీసుకువచ్చారన్నారు.




# జనరల్
STATE & REGIONAL NEWS

## మేడారం జాతరకు రూ.150 కోట్లు మంజూరు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతర ఏర్పాట్ల కోసం తెలంగాణ ప్రభుత్వం రూ.150 కోట్లు మంజూరు చేసినట్లు బుధవారం గిరిజన సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చే ఏడాది జనవరిలో జరిగే మేడారం మహా జాతర నిర్వహణ, మేడారంలో శాశ్వత నిర్మాణాల పనుల కోసం ఈ నిధులను ఖర్చు పెట్టనున్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా మేడారం మహా జాతరను ఘనంగా నిర్వహించేందుకు రూ.150కోట్లు మంజూరు చేసిన సిఎం, డిప్యూటి సిఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ కు పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ధన్యవాదాలు తెలిపారు.

# రాజకీయాల్లో యువతను ప్రోత్సహించడమే లక్ష్యం

* 21 ఏళ్లకే ఎమ్మెల్యేగా పోటీకి అసెంబ్లీలో చట్టసవరణ చేస్తాం
* రాహుల్ గాంధీ ప్రధాని కాగానే అమల్లోకి

**రాజీవ్ గాంధీ జయంతి సభలో సిఎం రేవంత్ రెడ్డి**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాజకీయాల్లో యువతను ప్రోత్సహించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. అసెంబ్లీకి పోటీ చేసేందుకు ప్రస్తుతం 25 ఏండ్లు నిండాలనే నిబంధన ఉన్నదని దానిని 21 ఏండ్లకు సవరిస్తామని చెప్పారు. రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి కాగానే అమల్లోకి తెస్తామని హామీనిచ్చారు. ఈ మేరకు తెలంగాణ శాసనసభలో చట్ట సవరణ చేస్తామన్నారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని సచివాలయం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎంపి అనిల్ కుమార్ యాదవ్, మాజీ ఎంపిలు వి.హనుమంతరావు, అంజన్ కుమార్ యాదవ్, శాసనమండలి ఛీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డితో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ గతంలో 21 ఏండ్ల వయసుకు ఓటు హక్కు ఉండేదని అప్పట్లో పోటీ చేసే వయస్సును 25 ఏండ్లుగా నిర్ధారించారని అన్నారు. ఇప్పుడు 18 ఏండ్లకు తగ్గించనందున పోటీచేసే వయసును 21 ఏండ్లకు తగ్గించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. దానిద్వారా యువత రాజకీయాల్లోకి వస్తారని అన్నారు. రాజకీయాల్లోకి యువత ను ప్రోత్సహించడమే లక్ష్యమని చెప్పారు. తెలంగాణకు గుండెకాయలాంటి సచివాలయం ముందు రాజీవ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. దేశంలోని టెలికాం రంగంలో విప్లవాత్మక మార్పులకు ఆయనే ఆద్యుడన్నారు. రాజీవ్ గాంధీ దేశ యువతకు స్ఫూర్తి అని అన్నారు. దేశ సమగ్రతను కాపాడేందుకు ఆయన తన ప్రాణాలను అర్పించారని గుర్తు చేసుకున్నారు. పారదర్శక పాలన అందించేందుకు సాంకేతికతను వినియోగించాలని ఆయన ఆనాడే ఆలోచించారన్నారు.

హైదరాబాద్‌లో హైటెక్ సిటీకి పునాది కూడా రాజీవ్ గాంధీ స్ఫూర్తితోనే పడిందన్నారు. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించిన మహనీయుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. చట్ట సభల్లోనూ మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలన్న సోనియాగాంధీ ఒత్తిడితోనే పార్లమెంటులో బిల్లు పెట్టి పాస్ చేసిందన్నారు.

**రాహుల్ గాంధీని ప్రధానిగా చేస్తాం..**

రాజీవ్ గాంధీ స్ఫూర్తితో తెలంగాణను ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. దేశ యువత రాజీవ్ గాంధీని స్ఫూర్తిగా తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూనే, బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు, ఎస్‌సి వర్గీకరణ వంటి సామాజిక సమస్యలకు పరిష్కారం చూపామన్నారు. రాజీవ్ గాంధీ కలలను సాకారం చేయాలంటే రాహుల్ గాంధీ దేశానికి ప్రధాని కావాలని ఆయన ఆకాంక్షించారు.

రాహుల్ గాంధీని ప్రధానిగా చేసే వరకు విశ్రమించబోమని, తెలంగాణలో కొలువు దీరిన ప్రజా ప్రభుత్వం హైదరాబాద్‌ను ప్రపంచంతో పోటీ పడేలా తీర్చిదిద్దబోతోందని చెప్పారు. త్వరలోనూ మూసీ ప్రక్షాళనను ప్రారంభించ బోతున్నట్టు చెప్పారు.

# కమ్యూనిస్టు ఉద్యమాల ఖిల్లా కుత్బుల్లాపూర్

**సిపిఐ రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు ఎండి.యూసుఫ్**




**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజ్‌గిరి:** కమ్యూనిస్టు ఉద్యమాల ఖిల్లా కుత్బుల్లాపూర్ అని, ఈ ప్రాంతంలో సిపిఐ రాష్ట్ర మహాసభలు నిర్వహించడం గర్వకారణంగా భావిస్తున్నామని సిపిఐ రాష్ట్ర 4వ మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఎండి.యూసుఫ్ అన్నారు. దశాబ్దాలుగా ఈ ప్రాంతంలో పేదలు, బడుగు బలహీన వర్గాలకు నివాస స్థలాల కోసం భూపోరాటాలు చేస్తూ అనేక కాలనీలు ఏర్పాటు చేసిందని చెప్పారు. మేడ్చల్ జిల్లా 'కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వరరావు నగర్' (గాజుల రామారం)లో 'కామ్రేడ్ ఎన్.బాలమల్లేశ్ హాల్'లో బుధవారం ప్రారంభమైన మహాసభలో ఆయన స్వాగతోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా యూసుఫ్ మాట్లాడుతూ పేదలకు గూడుకోసం చేపట్టిన ప్రజా, భూపోరాటాల సందర్భంగా కమ్యూనిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలు స్థానిక భూకబ్జాదారులు, గుండాల నుంచి అనేక దాడులను, హత్యా ప్రయత్నాలను, కేసులను ఎదుర్కొన్నారని, చివరకు ప్రాణాలను పణంగా పెట్టారని గుర్తు చేశారు. 1972లో సిపిఐ నాయకులైన కె.ఎల్.మహేంద్ర, పొట్లూరి నాగేశ్వర రావు, సభాపతి, వి.సత్తయ్య, నాగయ్యల నాయకత్వంలో ప్రాగాటూల్స్ స్థలంలో భూపోరాటం నిర్వహించి గిరినగర్ బస్తీని స్థాపించామన్నారు. ప్రాగా టూల్స్ యాజమాన్యం బస్తీని బుల్‌డోజర్లతో కూల్చివేయటానికి ప్రయత్నించగా అప్పట్లో ఎంఎల్‌సిగా ఉన్న కె.ఎల్.మహేంద్ర, పొట్లూరి నాగేశ్వరరావు, వి.సత్తయ్యనాయకత్వంలో పార్టీ కార్యకర్తలు బుల్‌డోజర్లకు అడ్డంగా పడుకుని బస్తీని కాపాడామన్నారు. ఇదే స్ఫూర్తితో జగద్గిరిగుట్ట, కళావతినగర్, మఖ్దూంనగర్, లెనిన్ నగర్, రావినారాయణ రెడ్డి నగర్‌లను ఏర్పాటు చేసి వేలాది మందికి ఇండ్ల స్థలాలను పంచిన చరిత్ర సిపిఐదన్నారు. ఈ సందర్భంగా అనేక కేసులు, భూస్వాముల దాడులు, ఆర్‌ఎస్‌ఎస్ దాడులను ఎదుర్కొన్నామని, ముఖ్యంగా ఈ పోరాటాలు నిర్వహించే సందర్భంలో శత్రువుల దాడిలో అబ్బాస్, ఏసు రత్నం తలలు పగడమే కాకుండ. నాయకులు, కార్యకర్తలు భూటకపు హత్యాకేసులతో సహా అనేక పోలీస్ కేసులను ఎదుర్కొవాల్సి వచ్చింది. ఈ ప్రాంతంలో ప్రజానాట్యమండలి శాఖ బలంగా ఉండి అనేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిందని, కరోనాలో మరణించిన ప్రముఖ కవి వాగ్గేయకారుడు నిస్సార్ కుత్బుల్లాపూర్ మండల స్థానికుడేనని యూసుఫ్ పేర్కొన్నారు.

# మెడిసిన్ విషయంలో తప్పుదోవ పట్టిస్తే కఠిన చర్యలు

**మంత్రి దామోదర్ రాజనర్సింహ్మ**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మెడిసిన్ విషయంలో తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఇచ్చే సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డ్రగ్ కంట్రోల్ అథారిటీ అధికారులను మంత్రి దామోదర్ రాజనర్సింహ్మ ఆదేశించారు. ఈ మేరకు డ్రగ్ కంట్రోల్ అథారిటీ పనితీరుపై వెంగళరావు నగర్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. 2024–25లో డిసిఎ వర్క్ ప్రోగ్రెస్‌ను మంత్రికి డిసిఎ డైరెక్టర్ జనరల్ షానవాజ్ ఖాసీం వివరించారు. 2024లో 25,939 తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన 4142 సంస్థలపై చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ ఏడాదిలో జులై వరకు 16,481 తనిఖీలు చేశామని, నిబంధనలు ఉల్లంఘించిన 2827 సంస్థలపై చర్యలు తీసుకున్నామన్నారు. 2024 ఈ ఏడాది జులై వరకు 7200 మెడిసిన్ సాంపిల్స్‌ను టెస్ట్ చేయగా, అందులో 186 నాసిరకం మెడిసిన్‌గా తేలిందని, సంబంధిత సంస్థలపై చట్టప్రకారం చర్యలు తీసుకున్నామన్నారు. సుమారు 700 కేసులు బుక్ చేశామని వివరించారు. ప్రతి కేసులోనూ దోషులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. జనాలను తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఇస్తూ, మెడిసిన్ అమ్మకాలు జరుపుతున్న కంపెనీలు, వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. స్పూరియస్, నాట్ స్టాండర్డ్ డ్రగ్స్ తయారు చేస్తున్న ఫార్మా కంపెనీలు, డిస్ట్రిబ్యూటర్లు, అమ్మకందారులపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు.

మెడిసిన్ అనేది ప్రజల ప్రాణాలతో ముడిపడి ఉన్న అంశం అని, ఈ విషయంలోఎలాంటి ఉపేక్ష పనికిరాదన్నారు. పదేపదే నిబంధనలు ఉల్లఘిస్తున్న సంస్థలను చట్టప్రకారం పర్మినెంట్‌గా క్లోజ్ చేయాలని ఆదేశించారు. నకిలీ, నిషేధిత మందుల తయారీ, అమ్మకం దారులపై అవసరమైతే పిడి యాక్ట్ నమోదు చేయాలని మంత్రి ఆదేశించారు. మెడిసిన్‌ను ఆహార పదార్థాలుగా చూపిస్తూ, వాటి తయారీ, అమ్మకాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. యాంటిబయాటిక్ రెసిస్టెన్స్ అనేది పెద్ద ముప్పుగా పరిణమిస్తోందని, నిబంధనలు ఉల్లంఘించి యాంటిబయాటిక్స్ అమ్మకాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు ప్రేరేపిత మెడిసిన్ అమ్మకాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిసిఎ డిజిని మంత్రి ఆదేశించారు. డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్ అప్‌గ్రేడేషన్ పనులను స్పీడప్ చేయాలని మంత్రి ఆదేశించారు. త్వరలో మరిన్ని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులను మంజూరు చేసి, రిక్రూట్ చేస్తామని.. తద్వారా డ్రగ్ కంట్రోల్ అథారిటీని మరింత బలోపేతం చేస్తామని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. ప్రజలకు క్వాలిటీ మెడిసిన్, క్వాలిటీ ఫుడ్ అందించే విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని మంత్రి స్పష్టం చేశారు.

# 2025-27కు మద్యం దుకాణాల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్..



**త్వరలో నోటిఫికేషన్.. దరఖాస్తు ఫీజు రూ.3 లక్షలు**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మద్యం షాపుల గడువు నవంబర్ 30తో ముగియనుండడంతో తెలంగాణ రాష్ట్రంలో దుకాణాల ఏర్పాటుకు ప్రభుత్వం ఈ నెల 14న గెజిట్ విడుదల చేసింది. 2025–27కు మద్యం దుకాణాల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ గెజిట్ ఆధారంగా ఎక్సైజ్ కమిషనర్ మద్యం దుకాణాలకు దరఖాస్తు స్వీకరణ గడువును నిర్ణయిస్తారు. దరఖాస్తుల స్వీకరణకోసం ఎక్సైజ్ శాఖ అధికారులు త్వరలో నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. దరఖాస్తు ఫీజు రూ.3లక్షలు ఉంటుంది. మద్యంషాపు కోసం కొనుగోలు చేసిన దరఖాస్తు ఫీజు తిరిగి చెల్లించబడదని గెజిట్‌లో పేర్కొన్నారు. మద్యం దుకాణాల్లో గౌడ్స్‌కు 15శాతం, ఎస్‌సిలకు 10శాతం, ఎస్‌టిలకు 5 శాతంగా కేటాయింపు ఉంటుంది. 2011 జనాభా లెక్కల ప్రకారం 5 వేల జనాభా ఉన్న షాపుకు రూ.50లక్షలు, 5 వేల నుంచి 50వేల జనాభా ఉన్న షాపులకు రూ.55 లక్షలు, 50 వేల నుంచి లక్ష జనాభా ఉన్న షాపులకు రూ. 60లక్షలు, లక్ష నుంచి ఐదు లక్షల జనాభాకు రూ.65లక్షలు, 5 లక్షల నుంచి 20లక్షల జనాభా షాపులకు రూ.85 లక్షలు, 20 లక్షలపై అధికంగా ఉన్న మద్యం షాపులకు రూ.110లక్షల సంవత్సరం ఫీజుగా ఉంటుందని గెజిట్‌లో పేర్కొన్నారు. మద్యంషాపు లైసెన్స్ పొందిన యజమాని సంవత్సరం ఫీజుతోపాటు అదనం గా రూ.5 లక్షలు చెల్లిస్తే వాక్ లిక్కర్ స్టోర్ పెట్టుకునే అవకాశం కల్పించారు.

జిహెచ్‌ఎంసి పరిధిలో మద్యం షాపులు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు, జిల్లాల్లో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10గంటలకు మద్యం దుకాణాల ను నడుపుకునే అవకాశం ఉంటుంది. 2025 డిసెంబరు 1 నుంచి 2027 నవంబరు 31 వరకు కొత్త మద్యం షాపులు నడుపుకోవడాని కి ఎక్సైజ్ శాఖ లైసెన్స్ ఇవ్వనున్నారు.

# దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులకు పునరుద్ధరణ చర్యలు

**అధికారులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశం**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర వ్యాప్తంగా అధిక వర్షాల వల్ల దెబ్బతిన్న రోడ్ల వివరాలపై రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అధికారులను ఆరా తీశారు. ఆర్ అండ్ బి అధికారులతో బుధవారం మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కాజ్ వే లు, కల్వర్టులు, బ్రిడ్జిలు, కోతకు గురైన రోడ్ల వివరాలు మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు ఈ సీజన్ లో అధిక వర్షాల వల్ల పాడైన రోడ్లు, కల్వర్టుల వివరాలు ఆర్ అండ్ బి అధికారులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..ప్రజా రవాణాకు ఇబ్బంది లేకుండా తెగిన రోడ్లు, కల్వర్టుల వద్ద తాత్కాలిక పునరుద్ధరణ చర్య లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పాడైన రోడ్లు,వంతెనలకు సంబంధించి శాశ్వత నిర్మాణాలకు ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఆర్ అండ్ బి ప్రధాన ఆఫీస్ లో కంట్రోల్ సెంటర్‌కు వస్తున్న ఫిర్యాదులు, సమాచార వివరాలపై మంత్రి ఆరా తీయగా.. స్టేట్ రోడ్స్ సి.ఇ మోహన్ నాయక్ ఆధ్వర్యంలో షిఫ్టుకు నలుగురు చొప్పున 24 గంటలు మానిటరింగ్ చేస్తున్నట్లు చెప్పారు. మంత్రి గత రివ్యూలో చెప్పిన ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 37 ఆర్ అండ్ బి డివిజన్ల నుండి వివరాలు సేకరణ చేస్తున్నామని, 24 గంటలు అలెర్ట్‌గా ఉంటున్నామని స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్ మంత్రికి తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో సెలవుపై వెళ్ళొద్దన్న ఆదేశాలు పాటిస్తూ..ప్రతి ఆర్ అండ్ బి అధికారి నిబద్ధతతో పనిచేశారని మంత్రి ఈ సందర్భంగా అభినందించారు. గత పది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వచ్చిన వరద ప్రవాహాలకు రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు ఆర్ అండ్ బి పరిధిలో 739 చోట్ల సమస్యాత్మక రోడ్లు గుర్తించామని, అందులో 854 కి.మీ రోడ్డు దెబ్బతిందని, 25 చోట్ల రోడ్డు తెగిపోతే వెంటనే 5 చోట్ల తాత్కాలిక పునరుద్ధరణ చేశామని ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ (ఆర్ అండ్ బి) మంత్రికి వివరించారు. 310 చోట్లలో కాజ్ వే లు, కల్వర్టులు వరద ప్రవాహం ఉండగా అందులో 228 దారి మళ్లింపు చేసినట్లు పేర్కొన్నారు. మొత్తంగా 200 చోట్లలో రోడ్లు, కాజ్ వే, మైనర్ బ్రిడ్జిలు, కల్వర్టులు తాత్కాలికంగా, శాశ్వతంగా పునరుద్ధరించాలని ప్రాథమికంగా గుర్తించినట్లు పేర్కొన్నారు.

తాత్కాలిక పునరుద్ధరణకు 46 కోట్లు వరకు ఖర్చు అవుతుందని,శాశ్వత పునరుద్ధరణ కోసం 984 కోట్లు అవసరమవుతాయని అంచనా వేసినట్లు వివరించారు. రోడ్ల డ్యామేజీ, ప్రజల రాకపోకలకు సంబంధించి ఎలక్ట్రానిక్ మీడియా, పలు దినపత్రికల్లో వార్తలు చూశానని వాటి క్షేత్ర స్థాయి పరిస్థితి ఏంటని మంత్రి ఆరా తీశారు. వెంటనే ఆ ప్రాంతాల్లో రీస్టోర్ చేసి ట్రాఫిక్ క్లియరెన్స్ ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్టేట్, నేషనల్ హైవే రోడ్లకు సంబంధించిన వివరాలు ఇంచార్జి ఈఎన్‌సి జయ భారతి, ఆర్వోబి, ఆర్‌యుబి ల వద్ద పరిస్థితిని సి.ఇ. రాజేశ్వర్ రెడ్డి మంత్రి దృష్టి కి తీసుకువచ్చారు.ఇప్పటివరకు ఆర్ అండ్ బి అధికారులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టిన చర్యలు, క్షేత్ర స్థాయిలో చూపిన పనితీరును అభినందించిన మంత్రి, అదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని వారికి చెప్పారు.

# ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి : మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం సమీక్షించారు. హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణ హోటల్‌లో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మాత్యులు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షతన ఉమ్మడి కరీంనగర్ జిల్లా మంత్రులు, ఎంఎల్‌ఎల సమక్షంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మంత్రులు ఆడ్లూరి లక్ష్మణ్ కుమార్, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, జిల్లా కాంగ్రెస్ ఎంఎల్‌ఎలతో పాటు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు. సమావేశంలో జిల్లా అభివృద్ధి, మౌలిక వసతులు – రహదారులు, సాగునీటి ప్రాజెక్టులు, విద్య, వైద్య, ఉపాధి రంగాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై చర్చించారు. సంక్షేమ పథకాలైనటువంటి డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఆర్థికం గా బలహీన వర్గాల కోసం ఆర్థిక సహాయం, రైతు రుణ మాఫీ, పంటల నష్టపరిహారం, విద్యార్థులకు స్కాలర్‌షిప్స్, మైనారిటీ & మహిళల అభివృద్ధి పథకాల అమలుపై సమీక్ష నిర్వహించారు. యువత ఉపాధి అవకాశాలు, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రోత్సాహం, రైతు బజార్ల విస్తరణ, ఆరోగ్య రంగంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల ఏర్పాటుపై కూడా చర్చించారు.

# మహిళా పోలీసు శక్తికి అండగా తెలంగాణ ప్రభుత్వం

**మహిళా పోలీసుల తొలి సదస్సులో మంత్రి సీతక్క**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహిళా పోలీసుల అవసరాలను గుర్తించి ప్రత్యేక వేసులుబాటు కల్పిస్తాం అని..మహిళా పోలీసు శక్తికి తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. రాజేంద్రనగర్‌లోని రాజ్ బహదూర్ వెంకట్రామిరెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీలో తెలంగాణ మహిళా పోలీస్ రాష్ట్రస్థాయి తొలి సదస్సు బుధవారం ప్రారంభమైంది. మూడు రోజులపాటు జరిగే ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క మహిళా పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, ఐపిఎస్ అధికారులు చారు సిన్హా, శికా గోయల్, స్వాతి లక్రా తో పాటు కానిస్టేబుల్ నుండి ఎస్‌పి స్థాయి వరకు సుమారు 400 మంది మహిళా పోలీస్ అధికారులు ఈ సదస్సులో పాల్గొన్నారు. సదస్సులో మహిళా పోలీసులు విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న సవాళ్లు, అనుభవాలు, మౌలిక వసతుల మెరుగుదల వంటి అంశాలపై చర్చ జరగనుంది. ఈ సందర్భంగా సీతక్క ప్రసంగిస్తూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హోంమంత్రిగా మహిళా శక్తిని ప్రోత్సహిస్తున్నారని, ఈ సదస్సులో మహిళా పోలీసులు ఇచ్చే సలహాలు, సూచనల ఆధారంగా సంక్షేమానికి సంబంధించిన సానుకూల నిర్ణయాలు తప్పకుండా తీసుకుంటారని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 1973లో కేరళలో కోజికోడ్లో దేశంలోని తొలి మహిళా పోలీస్ స్టేషన్ను ప్రారంభించిన విషయాన్ని వృత్తి ధర్మానికి మానవీయతను జోడిస్తే మంచి ఫలితాలు వస్తాయని, కమిట్మెంట్కు, కాన్ఫిడెన్స్కు చిరునామాగా తెలంగాణ మహిళా పోలీసులు నిలుస్తున్నారని మంత్రి సీతక్క అభిప్రాయపడ్డారు.



వృత్తి ధర్మం, మాతృత్వం మధ్య మహిళా పోలీసులు ఎదుర్కొనే సంఘర్షణల దృష్ట్యా మెటర్నిటీ సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని మంత్రి సూచించారు. బొగ్గుబాయిల నుంచి అంతరిక్షం వరకు మహిళలు రాణిస్తున్న ఈ రోజుల్లో మహిళా పోలీసుల ప్రత్యేక అవసరాలను దృష్టిలో పెట్టుకొని పోలీస్ శాఖ అండగా నిలవాలని, సమాజంలో మహిళల పట్ల ఉన్న చిన్నచూపును అరికట్టే బాధ్యత కూడా పోలీసులపైనే ఉందని ఆమె పేర్కొన్నారు. డెడికేషన్, క్రమశిక్షణ, డిగ్నిటీతో మహిళా పోలీసులు పనిచేస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని, పోలీస్ స్టేషన్లకు వచ్చే బాధితులకు భరోసాగా నిలవాలని ఆమె సూచించారు. మహిళా పోలీసుల అవసరాలను అధ్యయనం చేసి నివేదిక సమర్పిస్తే, వాటి ఆధారంగా చట్టాలు చేయడానికి ప్రభుత్వం ముందుకు వస్తుందని ఆమె స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న ఉత్తమ పద్ధతులను అధ్యయనం చేసి వాటిని తెలంగాణలో అమలు పరచేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 80 వేల మంది పోలీసుల్లో మహిళా పోలీసులు కేవలం 7 వేల మంది మాత్రమే ఉన్నారని, వారి సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందని సీతక్క గుర్తుచేశారు. మహిళా పోలీసులు ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లను అధిగమించడానికి ఈ సదస్సు దోహదపడుతుందన్న నమ్మకాన్ని మంత్రి సీతక్క వ్యక్తం చేశారు.

# అంగన్‌వాడీలో త్వరలో అల్పాహార పథకం

**మహిళా శిశు సంక్షేమ శాఖపై సమీక్షలో మంత్రి సీతక్క**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అంగన్‌వాడీలో చిన్నారులకు త్వరలో బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ ప్రారంభమౌతుందని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు. ఎర్ర మంజిల్‌లోని మిషన్ భగీరథ కార్యాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యకలాపాలపై మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, జాయింట్ డైరెక్టర్లు, రీజినల్ జాయింట్ డైరెక్టర్లు, అన్ని విభాగాల హెచ్‌ఒడిలు హాజరయ్యారు. సమావేశంలో నూతన అంగన్‌వాడీ భవనాల నిర్మాణం, అంగన్‌వాడి కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన, సాక్షం అంగన్‌వాడీ, ఆరోగ్య లక్ష్మి, మిషన్ వాత్సల్య, మిషన్ శక్తి, చిన్నారులకు యూనిఫాం పంపిణీ, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు యూనిఫాం చీరల పంపిణీ, వర్కింగ్ ఉమెన్ హాస్టల్స్ బలోపేతం, చిన్నారులకు విజయ పాల సరఫరా, బ్రేక్‌ఫాస్ట్ ప్రోగ్రాం, పాలనా కేంద్రాలు, పోషణ్ అభియాన్ తదితర అంశాల్లో సాధించిన ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల తరహాలోనే అంగన్‌వాడి కేంద్రాలకు ఉచితంగా ఇసుక సరఫరా చేస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్లు ఈ విషయం లో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మంజూరై న 1025 అంగన్‌వాడి భవనాలలో ఇప్పటివర కు 625 ప్రాంతాల్లోనే స్థలాలు గుర్తించారని.. మిగిలిన ప్రాంతాల్లో స్థలగుర్తింపు తక్షణం పూర్తిచేయాలని సూచించారు. ఒక్కో భవనం నిర్మాణానికి రూ.12లక్షలు కేటాయించినట్లు గుర్తుచేశారు. పనుల జాతరలో భాగంగా నూతన భవనాల శంకుస్థాపనలు జరగాలని, ఇప్పటికే పూర్తి చేసిన 22 అంగన్‌వాడీ భవనాలను స్థానిక ఎమ్మెల్యేల చేత ప్రారంభించాలన్నారు. అంగన్‌వాడి టీచర్లు, హెల్పర్ల యూనిఫాం చీరల తయారీ పూర్తై జిల్లా కేంద్రాలకు చేరాయని, వాటిని తక్షణమే పంపిణీ ప్రారంభించాలని తెలిపారు. చిన్నారుల కోసం త్వరలో బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్‌ను ప్రారంభిస్తున్నామని, ఇప్పటికే హైదరాబాద్‌లోని 139 అంగన్‌వాడి కేంద్రాల్లో ప్రయోగాత్మకంగా అమలుచేసిన ఈ స్కీమ్ కారణంగా పిల్లల హాజరు 30 శాతం పెరిగిందని పేర్కొన్నారు. పిల్లల పోషకాహారాన్ని మెరుగుపరచడంకోసం ప్రతి చిన్నారికి ఉదయం100 మి.లీ. పాలు అందించే ప్రతిపాదనను పరిశీలిస్తున్నామని, ప్రతి వారం ఒక రోజు ఎగ్ బిర్యానీ, ఒక రోజు వెజిటబుల్ కిచిడి వడ్డించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అంగన్‌వాడి కేంద్రాల్లో గర్భిణీలు, బాలింతలు కూర్చునేలా లబ్ధిదారుల అభిప్రాయాల మేరకు మార్పులు చేయాలని ఆదేశించారు. అంగన్‌వాడి సేవలను అందించడంలో ఎక్కడా రాజీ పడొద్దు అని అధికారులను ఆదేశించారు. ఫేస్ రికగ్నిషన్ సిస్టం ద్వారా పోషకాహారం అందిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ మొదటి స్థానంలో నిలవడం పట్ల మంత్రి సీతక్క సిబ్బందిని అభినందించారు.


**హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ అర్బన్ ఫారెస్ట్రీ**
హెచ్‌జిసిఎల్ ఆఫీస్ బిల్డింగ్, నానక్‌రాంగూడ, హైదరాబాద్ - 500032

**Rc. No.09/UF/HMDA/2010** టెండర్ నోటిఫికేషన్ **తేదీ: 19.08.2025**

ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంలో ఇలాంటి పనులను అమలు చేయడంలో గతంలో అనుభవం ఉన్న ఏదైనా రాష్ట్ర లేదా కేంద్ర ప్రభుత్వ విభాగాలు / సంస్థలలోని రిజిస్టర్డ్ కాంట్రాక్టర్ల నుండి అర్బన్ ఫారెస్ట్రీ, హెచ్ఎండిఎకి సీజనల్ ఫ్లవర్ ప్లాంట్స్ సరఫరా కోసం హెచ్ఎండిఎ టెండర్లను ఆహ్వానిస్తోంది. టెండర్ దాఖలు చేయడానికి చివరి తేదీ: 26.08.2025. మరిన్ని వివరాల కోసం దయచేసి ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ http://tender.telangana.gov.in ని సందర్శించండి.

సం/- డైరెక్టర్, అర్బన్ ఫారెస్ట్రీ, హెచ్ఎండిఎ.

DIPR R.O. No. : 6801-PP/CL/ADVT/1/2025-26, Date: 20-08-2025

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**

EE-Div.15, Sec-bad Zone/GHMC

'E' Procurement NIT No. 24/EE/Div-15/SBZ/GHMC/2025-26 తేదీ: 20.08.2025

**పని పేరు:** జిహెచ్ఎంసి-ఎస్‌బిజెడ్-సికింద్రాబాద్ జోన్, జిహెచ్ఎంసిలోని వివిధ సర్కిళ్లలో **రాబోయే గణేష్ పండుగ-2025 కోసం** 120 మైక్రాన్ల మందంతో 35''(W)x45''(L) సైజు గల నల్ల రంగు LLDPE (లీనియర్ తక్కువ సాంద్రత) పాలిథిన్ చెత్త సంచుల సరఫరా మరియు డెలివరీ. **(రూ. 14.90 లక్షలు)**, **బిడ్ యొక్క చివరి తేదీ & సమయం:** 23.08.2025 సాయంత్రం 04:00 గంటలకు. శ్రీ ఎస్.శ్రీనివాసులు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-15, సర్కిల్-15, ముషీరాబాద్, సికింద్రాబాద్ జోన్, జిహెచ్ఎంసి. సెల్: 7995007374. **సంబంధిత చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-15, ఎస్‌బిజెడ్, జిహెచ్ఎంసి అబిడ్స్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్. మరిన్ని వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ WWW.tender.telangana.gov.in లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ / జోనల్ సిటిఓ డివిజన్-15, ఎస్‌బిజెడ్, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 6797-PP/CL/ADVT/1/2025-26, Date: 20-08-2025

**రోడ్లు మరియు భవనాల విభాగం**

(R&B) డివిజన్, నల్లగొండ.
ఫోన్: 9440819242, ఇమెయిల్: eerbngd@yahoo.in

**NIT నం.53 నుండి 56/PA వరకు EE/R&B/NLG/2025-26, తేదీ: 14.08.2025**

ఈ క్రింద పేర్కొన్న పనుల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం ద్వారా టెండర్లు ఆహ్వానించడమైనది. 2025-26 సంవత్సరానికి నల్లగొండ జిల్లాలోని ఎంఎం నుండి నల్లగొండ (R&B) డివిజన్ రోడ్ల వరకు. ఇతర వివరాలను https://tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B) డివిజన్, నల్గొండ

DIPR R.O. No. : 6770-PP/CL/ADVT/1/2025-26, Date: 20-08-2025



# జనరల్
STATE & REGIONAL NEWS

## స్టే తొలగించండి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సాదాబైనామాల క్రమబద్ధీకరణ నిమిత్తం 2020లో ఇచ్చిన జిఒ అమలును నిలిపివేస్తూ ఇచ్చిన స్టేను ఎత్తివేయాలని కోరుతూ ప్రభుత్వం హైకోర్టులో అనుబంధ పిటిషన్ దాఖలు చేసింది. సాదా బైనామాల క్రమబద్ధీకరణ నిమిత్తం గత బిఆర్ఎస్ ప్రభుత్వం 2020 అక్టోబరులో జారీ చేసిన జిఒ112ను సవాలు చేస్తూ నిర్మల్ జిల్లాకు చెందిన షిండే దేవిదాస్ పిల్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన హైకోర్టు జీవోపై స్టే ఇస్తూ 2020 నవంబరు 11న మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ స్టేను ఎత్తివేసి క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించాలని ప్రభుత్వ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌తో కూడిన బెంచ్ మంగళవారం విచారణ చేపట్టింది. అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ గత ప్రభుత్వం జిఒ జారీ చేసిన సందర్భంగా చట్టంలో నిబంధనలు లేవని, ప్రస్తుతం కొత్త చట్టం తీసుకువచ్చామన్నారు.ప్రభుత్వం విధించిన గడువు ప్రకారం సుమారు 9.24 లక్షల దరఖాస్తులు అందాయన్నారు. వాటి క్రమబద్ధీకరణకు స్టే తొలగించాలని కోరారు. విచారణ 26కు వాయిదా పడింది.

## ప్రాణాలకు బాధ్యత ఉండాలి కదా?

కరెంటు స్తంభాలకున్న కేబుల్స్ పునరుద్ధరణపై హైకోర్టు వ్యాఖ్య



**ప్రజాపక్షం/హైదరాబాద్:** విద్యుత్తు స్తంభాలకు కేబుల్ వైర్లు ఉండటం వల జరిగే ప్రమాదాల్లో ప్రజల ప్రాణాలు పోతే ఎవరు బాధ్యత వహిస్తారని, ఏ ప్రభుత్వ శాఖకు ఆ శాఖ వాళ్లు తాము కాదంటే తాముకాదంటే ఎలాగని హైకోర్టు ప్రశ్నించింది. ఇటీవల రామంతపూర్‌లో విద్యుత్ఘాతం వల్ల ఆరుగురు మరణించిన దారుణ ఘటన తర్వాత ప్రభుత్వం ఆదేశించడంతో కేబుళ్లను నోటీసు ఇవ్వకుండా అధికారులు తొలగించారని పేర్కొంటూ భారతి ఎయిర్ టెల్ బుధవారం లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. దీనిని జస్టిస్ నగేష్ భీమపాక బుధవారం విచారణ జరిపారు. కేబుళ్ల వల్ల జనం ప్రాణాలు పోతే ఎవరు బాధ్యత తీసుకుంటారని ప్రశ్నించారు. కేబుళ్ల పునరుద్ధరణకు అనుమతించాలన్న సర్వీసు ప్రొవైడర్ అభ్యర్థనపై స్పందిస్తూ మనుషుల ప్రాణాలపట్ల సామాజిక బాధ్యత లేదా ని ప్రశ్నించారు. ఒకే ఘటనలో ఆరుగురు చనిపోయారని, ఇందుకు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు సర్వీసు ప్రొవైడర్లు, జీహెచ్ఎంసీ కార్పొరేషన్ అందరూ బాధ్యులేనని అభిప్రాయపడ్డారు. విద్యుత్తు స్తంభాలకు ఉన్న వైర్ల తొలగింపుపై వివరణ ఇవ్వాలని టీజీఎస్పీడీసీఎల్, రాష్ట్ర ప్రభుత్వం, జీహెచ్ఎంసీలను ఆదేశించారు. విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు. తదుపరి విచారణ వరకు అప్పటివరకు కేబుళ్లను తొలగించవద్దని ఆదేశించారు. తొలగించిన కేబుళ్లను పునరుద్ధరణకు ఉత్తర్వులు జారీకి నిరాకరించారు. ఒక్కో కరెంటు స్తంభానికి రూ.1100 చొప్పున రూ.21 కోట్లు చెల్లించామని పిటిషనర్ లాయర్ వివరించారు. నోటీసు ఇవ్వకుండా తొలగింపు చెల్లదన్నారు. టీజీఎస్పీడీసీఎల్ కౌన్సిల్ స్పందిస్తూ. ఒక స్తంభానికి పరిమితికి మించి కేబుళ్లు ఉంటున్నాయని చెప్పారు. జనం ప్రాణాలు పోతున్నాయని, జనమే లేనప్పుడు కేబుళ్లు ఉండి ఉపయోగం ఏమిటని ప్రశ్నించారు. వాదనలపై న్యాయమూర్తి స్పందిస్తూ కేబుళ్ల పునరుద్ధరణకు ఉత్తర్వులు జారీ చేయాలన్న పిటిషనర్ల అభ్యర్థనను తోసిపుచ్చారు. ప్రజల ప్రాణాలకు బాధ్యతవరు తీసుకుంటారని అడిగారు. మనుషులే లేకపోతే కేబుళ్లు, ఇంటర్నెట్ ఎందుకని అన్నారు. ప్రజల ప్రాణాలపట్ల కనికరం చూపాలని హితవు చెప్పారు రాతపూర్వక వాదనలు సమర్పించిన తరువాత తగిన ఉత్తర్వులు ఇస్తామన్నారు. విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు.

## లైఫ్ సైన్సెస్ రంగంలో రూ.54 వేల కోట్ల పెట్టుబడులు,2లక్షల ఉద్యోగాలు

ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో లైఫ్ సైన్సెస్ రంగం అద్భుత ప్రగతి సాధించిందని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. డిసెంబరు 2023 నుంచి ఇప్పటి దాకా ఈ రంగంలో రూ.54 వేల కోట్ల పెట్టుబడులు సాధించి గ్లోబర్ లీడర్ గా ఎదిగిందని ఆయన తెలిపారు. హైదరాబాద్ లో బుధవారం జరిగిన తెలంగాణా లైఫ్ సైన్సెస్ ఫౌండేషన్ ఆరో బోర్డు సమావేశంలో ఛైర్మన్ హోదాలో ఆయన అధ్యక్షత వహించారు.బోర్డు సభ్యులు డా.రెడ్డీస్ ల్యాబ్స్ ఛైర్మన్ సతీష్ రెడ్డి, లారస్ ల్యాబ్స్ ఇడి, సిఇఓ డా. సత్యనారాయణ చావ, స్పెషల్ సిఎస్ సంజయ్ కుమార్, శక్తి నాగప్పన్ లు పాల్గొన్నారు.లైఫ్ సైన్సెస్‌లో భాగమైన ఔషధ తయారీ, మెడికల్ టెక్నాలజీ, టీకాల ఉత్పత్తి రంగాల్లో కొత్తగా 2 లక్షల పైచిలుకు ఉద్యోగాలు సృష్టించగలిగామని శ్రీధర్ బాబు వివరించారు. ప్రపంచంలోని అతి పెద్ద 7 లైఫ్ సైన్సెస్ క్లస్టర్లలో హైదరాబాద్ఒకటిగా నిలబడింది. దేశంలో ఈ ఘనత సాధించిన ఒకే ఒక్క నగరం హైదరాబాద్ అని అన్నారు. లిల్లీ, యామ్ జెన్, ఎంఎస్ డి, జోయెటిస్, ఎవర్ నార్త్, ఒలింపస్ లాంటి దిగ్గజ సంస్థలు హైదరాబాద్ ను ఎంపిక చేసుకున్నాయన్నారు. త్వరలో తెలంగాణా నెక్స్ట్ జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీని ప్రకటిస్తాం.పరిశ్రమలను పెద్ద ఎత్తున ఆకర్షించే అత్యుత్తమ విధానంగా ఉంటుందని తెలిపారు.2030 నాటికి రాష్ట్ర లైఫ్ సైన్సెస్ ఆర్థిక వ్యవస్థను 250 బిలియన్ డాలర్లకు తీసుకువెళ్లాలని లక్ష్యం నిర్దేశించుకుందని, దీనితో ఏసియా లైఫ్ సెన్సెస్ రాజధానిగా తెలంగాణా శిఖరాగ్రానికి చేరుకుంటుందన్నారు. తెలంగాణా స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ ఏర్పాటు కోసం సాధ్యాసాధ్యాల నివేదిక రూపొందించాలని కోరారు.

## ఏజెన్సీ ప్రాంతాల్లో రిజర్వేషన్‌పై పిటిషన్ కొట్టివేత

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఏజన్సీ ప్రాంతాల్లోని పంచాయతీ ఎన్నికల్లో 100 శాతం రిజర్వేషన్‌ల కల్పనలో జోక్యం చేసుకోలేమని హైకోర్టు బుధవారం తేల్చి చెప్పింది. ప్రస్తుతం ఉన్న చట్టం ప్రకారం రిజర్వేషన్‌లను కల్పిస్తున్నారని, చట్టాలను తీసుకురావాలంటూ ప్రభుత్వాలకు తాము ఆదేశాలు జారీ చేయలేమంటూ పిటిషన్‌ను కొట్టివేసింది. షెడ్యూల్ ప్రాంతాల్లోని పంచాయతీల్లో ముఖ్యంగా సర్పంచి పోస్టులకు 100 శాతం రిజర్వేషన్‌లు కల్పించడాన్ని సవాలు చేస్తూ నాన్‌ట్రైబల్ వెల్ఫేర్ సొసైటీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో బెంచ్ బుధవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపు న్యాయవాది ఎస్.రమణారెడ్డి వాదనలు వినిపిస్తూ కొన్ని గ్రామాల్లో గిరిజనులు కేవలం 20 శాతం మాత్రమే ఉన్నప్పటికీ 100 శాతం రిజర్వేషన్‌లు కల్పించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. కొన్ని పంచాయతీల్లో సర్పంచ్ అభ్యర్థులు లేక ఎన్నికలు జరగడంలేదన్నారు. గతంలో కూడా ఇలాంటి పిటిషన్‌లు దాఖలైనా ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేదని ప్రభుత్వ న్యాయవాది హైకోర్టు దష్టికి తీసుకువచ్చారు. వాదనలను విన్న ధర్మాసనం గత తీర్పులతోపాటు ప్రస్తుతం ఎన్నికలకు సంబంధించి ఎలాంటి నోటిఫికేషన్ జారీ చేయలేదని, అందువల్ల ఈ పిటిషన్‌లో ఉత్తర్వులు జారీ చేయడానికి ఎలాంటి కారణం లేదంటూ కొట్టివేసింది.

### ఏజన్సీ ప్రాంతాల విలీనంపై పిటిషన్

కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌లో షెడ్యూలు ప్రాంతాలను విలీనం చేయడంపై హైకోర్టులో పిల్ దాఖలైంది. 5వ షెడ్యూలులోని ఏజన్సీ ప్రాంతాలను మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేసే అధికారం ప్రభుత్వానికి లేదంటూ న్యాయవాది జె.శివరాం ప్రసాద్ పిల్ దాఖలు చేశారు. దీనిపై రిజిస్ట్రీ అభ్యంతరం లేవనెత్తడంతో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. రిజిస్ట్రీ అభ్యంతరాలను తోసిపుచ్చి పిటిషన్‌కు నెంబరు కేటాయించాలని ఆదేశించింది.

## మేజర్ యువతి నిర్బంధం సరికాదు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బాలికగా ఉన్నపుడు సంరక్షణకు తీసుకున్న బాలిక మేజర్ అయిన తరువాత ఆ యువతి ఇష్టానికి విరుద్ధంగా స్టేట్ హోంలో నిర్బంధంలో ఉంచడానికి వీల్లేదంటే మహిళా శిశు సంక్షేమశాఖకు ఆదేశాలు జారీ చేసింది. యువతి ఇష్ట ప్రకారం తన అత్తతో వెళ్లడానికి అనుమతించాలని ఆదేశించింది. యాదాద్రి భువనగిరి జిల్లాలో వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో ఏడేళ్ల కిందట బాలికను ప్రజ్వల స్వచ్ఛంద సంస్థతో పాటు మధురానగర్‌లోని మహిళా శిశు సంక్షేమ గహం సంరక్షణలో ఉంచారు. ఈ యువతిని అప్పగించాలని కోరుతూ అత్త హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన జస్టిస్ మౌసమీ భట్టాచార్య, జస్టిస్ గాడి ప్రవీణ్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టి బాలికకు 18ఏళ్లు నిండినందున నిర్బంధంలో ఉంచుకోవడం చెల్లదని పేర్కొంది. పిటిషనర్‌తో వెళ్లడానికి యువతి అంగీకరించినందున ఆమెను అప్పగించాలని ఆదేశించింది. అయితే నెలకోసారి యువతి బాగోగుల గురించి ఆరా తీయాలని శిశు సంక్షేమ శాఖకు ఆదేశించింది. అంతేగాకుండా ఏదైనా సాయం అవసరమైతే ప్రభుత్వం, లేదంటే స్వచ్ఛంద సంస్థను ఆశ్రయించవచ్చంటూ యువతికి సూచిస్తూ పిటిషన్‌పై విచారణను మూసివేసింది.

## తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తుంది

క్రీడా శాఖ మంత్రి వాకిటీ శ్రీహరి



**ప్రజాపక్షం/ సరూర్‌నగర్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నేడు విద్యార్థులకు మంచి అవకాశాలు కల్పిస్తూ క్రీడా యూనివర్సిటీతో పాటు క్రీడాకారులను ప్రోత్సహిస్తుందని, క్రీడాకారులు పట్టుదల, కసితో క్రీడలపై దృష్టి పెట్టి పతకాలు సాధించాలని కీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకోని ఆల్ ఇండియా రాజీవ్ గాంధీ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో కొత్తపేట ఓమ్ని చౌరస్తాలో నుండి సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం వరకు నిర్వహించిన రాజీవ్ గాంధీ ఖేల్ ఉత్సవ్ 3కె రన్ ను మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్యఅతిథిగా హాజరై టీపిసిసి క్యాంపెయిన్ కమిటీ ఛైర్మన్, మాజీ ఎం.పి మధుయాష్కీగౌడ్, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్త, స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడి, టీపిసిసి సభ్యులు దేప భాస్కర్‌రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన క్రీడా పాలసీతో ఎంతో మంది విద్యార్థులకు, క్రీడాకారులకు మేలు చేకూరుతుందన్నారు. అందులో భాగంగా మధుయాష్కీ సూచన మేరకు సరూర్‌నగర్ స్టేడియంలో జిమ్ ఏర్పాటు కోసం రూ. 2.50కోట్లను కేటాయిస్తున్నట్లు ప్రకటించినట్లు వెల్లడించారు. తాను కూడా క్రికెట్ క్రిడాకారుడునని, తన చిన్నప్పుడు ప్రోత్సహించేవారు లేదని, ఆడుకోవడానికి ఆట స్థలాలుకూడా లేవని పేర్కొన్నారు. కానీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నేడు విద్యార్థుల కు మంచి అవకాశాలు కల్పిస్తూ క్రీడా యూనివర్సిటీతో పాటు క్రీడాకారులను ప్రోత్సహిస్తుందని అన్నారు. అనంతరం మధుయాష్కీగౌడ్ మాట్లాడు తూ గత పదేళ్ల కాలంలో తెలంగాణలో క్రీడలను తీ వ్రంగా నిర్లక్ష్యం చేసిందని పేర్కొన్నారు. యువత డ్రగ్స్ బారిన పడకుండా క్రీడల వైపు మళ్లించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ కార్యదర్శి వెంకటేశ్వర్ రావు, ఏసిపి కృష్ణ య్య, కార్పోరేటర్ వెంకటేశ్వర్ రావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌హెచ్ఎ డైరెక్టర్ దుర్గాప్రసాద్ అరెస్టు

లంచం తీసుకుంటూ సిబిఐకి పట్టుబడిన వైనం




**ప్రజాపక్షం /హైదరాబాద్:** నేషనల్ హైవే అథారిటీ(ఎన్‌హెచ్ఎ) డైరెక్టర్ దుర్గాప్రసాద్ అరెస్ట్ అయ్యారు. రూ.60 వేలు లంచం తీసుకుంటూ మంగళవారం రాత్రి సిబిఐ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. వివరాల్లోకి వెళితే.. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ టోల్ ప్లాజా పక్కన ఉన్న ఓ వ్యక్తి రెస్టారెంట్ నిర్వహిస్తున్నారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా హైవే పక్కన రెస్టారెంట్ నిర్వహిస్తున్నారని మూయించేస్తామని బెదిరింపులకు దిగారు. దీంతో భయాందోళన గురైన యజమాని లంచం ఇవ్వడానికి రెడీ అయ్యాడు. బుధవారం మధ్యాహ్నం హోటల్ యజమాని నుంచి దుర్గాప్రసాద్ రూ.60 వేలు లంచం తీసుకుంటుండగా సిబిఐ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం కేసు నమోదు చేశారు. దుర్గాప్రసాద్ ఇళ్లు, కార్యాలయాల్లో తనిఖీలు చేపట్టారు.

## మాటల్లో కాదు చేతల్లో చూపిస్తున్నాం


వివిధ నిర్మాణ దశల్లో 2 లక్షలకు పైగా ఇందిరమ్మ ఇండ్లు : పొంగులేటి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పేదలకు ఇళ్ల నిర్మించడంలో గత పదేళ్ల కాలంలో ఆనాటి పాలకులు మాటలకే పరి మితమైతే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం చేతలతో చేసి చూపిస్తున్నదని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే 2 లక్షల ఇందిరమ్మ ఇండ్ల పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. హైదరాబాద్‌లోని హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో నూతనంగా నిర్మించిన కాన్ఫరెన్స్ హాల్‌ను, ఆధునీకరించిన కార్యాలయ ఛాంబర్లను బుధవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని విజయవంతం చేయడంలో ప్రభుత్వ ఉద్యోగులందరూ సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. పేదవాడి ఆలోచనలకు అనుగుణంగానే రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు అవుతున్నదన్నారు. గతంలో హౌసింగ్ కార్పొరేషన్ ను దాదాపు మూసి వేసే స్థాయికి తీసుకెళ్లితే, ప్రజా ప్రభుత్వం దానికి పునర్జీవం కల్పిస్తున్నదని అన్నారు. అందుకనే ఆ కార్పొరేషన్‌లో పనిచేసే సిబ్బందికి కూడా మంచి వసతులను కల్పిస్తూ ఇంకా పటిష్టం చేస్తామన్నారు. కార్పొరేషన్ సిబ్బంది ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా పనిచేసి లక్ష్యసాధనకు తోడ్పాటును అందించాలని కోరారు. గ్రామాల్లో అర్హులైన పేదలందరికీ విడతల వారీగా ఇళ్లు వస్తాయన్న భరోసా కల్పించగలిగామని, ఇది చేతల ప్రభుత్వమని, ఇప్పటికే గ్రామాల్లో కొనసాగుతున్న పనులే నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ వి.పి గౌతం ప్రసంగిస్తూ కార్పొరేషన్ ను పూర్తి స్థాయిలో పునరుద్ధరించే చర్యల్లో భాగంగా, జిల్లాల్లో ఎఇ ల నియామకంతో పాటు, అవసరమైన మేరకు ఇతర విభాగాల అధికారుల సేవలను వినియోగించుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ వేముల వీరేశం తోపాటు హౌసింగ్ కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## గిరిజనుల అభివృద్ధికి రూ.700 కోట్లు

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం: మంత్రి అడ్లూరి లక్ష్మణ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో అన్ని గిరిజన తాండాలు, గుడాలు లో రోడ్లు, ఇతర మౌళిక సదుపాయాలు అభివృద్ధికై రాష్ట్ర గిరిజన శాఖ ఎస్‌టి సబ్ ప్లాన్ ద్వారా 700 కోట్ల రూపాయాలను ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి అందజేయండం జరిగిందని రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ తెలిపారు.సచివాలయంలో బుధవారం విలేఖరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, గిరిజన తాండాలను, గుడాలను అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేసేందుకు ఎస్‌టి సబ్ ప్లాన్ అమలు చేస్తుందని తెలిపారు. ఎస్‌సి, ఎస్టి శాఖల అభివృద్ధికై కేంద్రం నుండి రాష్ట్రానికి రావాల్సిన నిధులపై కూడా ప్రత్యేక దృష్టి సారించి రాబట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే తాను కేంద్ర గిరిజన శాఖ మంత్రి ఢిల్లీలో పలుమార్లు కలసి ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులను విడుదల చేయాలని కోరడమైనదని ఆయన తెలిపారు. రాష్ట్రంలో అన్ని ఎస్‌సి,ఎస్‌టి గురుకుల పాఠశాలలో నాణ్యమైన బోజన సదుపాయాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. గతంలో హాస్టల్ లలో అల్యూమినియం వంట పాత్రలు వాడకం వలన పలు సమస్యలు వచ్చేవని, వీటి స్థానంలో స్టెయిన్లెస్ స్టీల్ పాత్రలు సరఫరా చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో అన్ని వసతి గృహాలలో కామన్ డైట్ ను అమలు చేస్తున్నట్లు, అందుకు అవసరమైన కూరగాయలు, గుడ్లు, చికెన్ ఇత ర వస్తువుల కోనుగోలు జిల్లా స్థాయిలో టెండర్ల ద్వారా పారదర్శకంగా కోనుగో లు చేసెందుకు ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ది వ్యాంగులకు అందేచేస్తున్న నెలకు రూ.300 పించన్‌ను 3000 రూపాయాలకు పెంచాలని కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించడం జరిగిందని మంత్రి వెల్లడించా రు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ, గురుకుల సంస్థ కార్యదర్శి అలుగు వర్షిని పాల్గొన్నారు.

## సాహస పర్యాటక రంగంలో భద్రత, సుస్థిరత, సహకారంపై దృష్టి

కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సమాజానికి సాధికారత కల్పించే సాహస పర్యాటక రం గాన్ని నిర్మించడం కేంద్ర ప్రభుత్వం లక్ష్యం అని ఇండియా టూరిజం రీజినల్ డైరెక్టర్ డి.వెంకటేశన్ అన్నారు. కేంద్ర ప ర్యాటక మంత్రిత్వ శాఖ, అడ్వెంచర్ టూర్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎటిఒఎఐ) సహకారంతో 'సాహస పర్యాటక సదస్సు సురక్షితమైన, బలమైన భవిష్యత్తు వైపు' అనే అంశంపై హైదరాబాద్‌లో బుధవారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సాహస పర్యాటక నిర్వాహకులు, సర్వీస్ ప్రొవైడర్లు, ట్రావెల్ ఏజెన్సీలు, ట్రావెల్ బ్లాగర్లు, సాహస క్రీడా నిపుణులు, టూర్ గైడ్‌లు, విద్యా సంస్థలు, ప్రభుత్వ అధికారులతో సహా సుమారు 90 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సదస్సులో వెంకటేశన్ మాట్లాడుతూ.. సాహస పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వల్లూరు క్రాంతి మాట్లాడుతూ.. తెలంగాణలో అభివృద్ధి చెందుతున్న సాహస పర్యాటక సామర్థ్యాన్ని గురించి వివరించారు. సురక్షితమైన, సుస్థిరమైన సాహస అనుభవాలను అభివృద్ధి చేయడానికి రాష్ట్రం తీసుకుంటున్న చర్యలను ఆమె ప్రస్తావించారు.ఎటిఒఎఐ కోశాధికారి నిరత్ భట్ మాట్లాడుతూ సురక్షితమైన సాహసాలకు భద్రతా ప్రమాణాలు, మార్గదర్శకాలు, శిక్షణ అవసరం ఎంతైన ఉందని చెప్పారు. ఇఇఎంఎ వైస్‌ప్రెసిడెంట్ సాగర్ పింగళి, ఎన్ఐటిహెచ్ఎం ప్రొఫెసర్ వెంకట రమణ, ఎటిఒఎఐ సభ్యులు శేఖర్ బాబు, అజిత మాదన్ ప్యానెల్ చర్చలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సాహస నిర్వాహకులు, ఎటిఒఎఐ సభ్యులు, పర్యాటక అధికారులు మైదాన స్థాయి సమస్యలను పరిష్కరించడానికి, సహకార మార్గాలను అన్వేషించడానికి ఓపెన్ డైలాగ్ సెషన్‌లో పాల్గొన్నారు.ఇండియా టూరిజం హైదరాబాద్ అసిస్టెంట్ డైరెక్టర్ కృపాకర్ రవిపాటి ముగింపు ఉపన్యాసం ఇస్తూ ఈ ప్రాంతంలో సాహస పర్యాటక అభివృద్ధికి కేంద్ర మంత్రిత్వ శాఖ అందిస్తున్న మద్దతు ఉంటుందని తెలిపారు.. ఈ సదస్సు ఎటిఒఎఐ సేఫ్టీ గైడ్‌లైన్స్ బుక్ విడుదల చేశారు.

## జుబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక కోసం ప్రత్యేక సమ్మరీ రివిజన్

సెప్టెంబర్ 2 నుండి 17 వరకు దరఖాస్తులకు అవకాశం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ జుబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజ కవర్గ ఉప ఎన్నికల కోసం భారత ఎన్నికల కమిషన్ (ఈసిఐ) ప్రత్యేక సమ్మరీ రివిజన్ కార్యక్రమాన్ని ప్రకటించింది. దీని షెడ్యూల్‌ను హైద రాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ బుధవారం వెల్లడించారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ వివరాలను తెలియజేశారు. జుబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో జూలై 1, 2025 నాటికి 18 సంవత్సరాలు నిండిన అర్హులందరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

### షెడ్యూల్ వివరాలు..

**సెప్టెంబర్ 2 నుండి 17 వరకు :** కొత్త ఓటరు నమోదు, పేర్ల మార్పు, చేర్పులు, తొలగింపుల కోసం అభ్యంతరాలు, క్లెయిమ్‌లను స్వీకరిస్తారు.
**సెప్టెంబర్ 25 వరకు :** వచ్చిన క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిశీలన, పరిష్కారం జరుగుతుంది.
**సెప్టెంబర్ 30 :** ఓటరు జాబితా ఫైనల్ పబ్లికేషన్ చేస్తారు.

ఈ ప్రక్రియ విజయవంతం కావడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని, ఓటరు జాబితా తయారీలో తమ సూచనలు, సందేహాలను తెలియజేయాలని కమిషనర్ కోరారు. ఈ ప్రత్యేక సమ్మరీ రివిజన్ ద్వారా ఓటరు జాబితాను పారదర్శకంగా, సమగ్రంగా తయారు చేయడానికి ఎన్నికల సంఘం కృషి చేస్తోందని ఆర్.వి. కర్ణన్ చెప్పారు. ఈ సమావేశంలో జాతీయ, రాష్ట్ర స్థాయి గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. బిజెపి ప్రతినిధులు మర్రి శశిధర్ రెడ్డి, కొల్లూరి ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా 'బతుకమ్మ' నిర్వహించాలి

స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బతుకమ్మ పండుగను రాష్ట్రంలో ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో పర్యాటక శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టనున్నదని రాష్ట్ర టూరిజం, సాంస్కృతిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేశ్ రంజన్ అన్నారు. రాబోయే బతుకమ్మ పండుగ2025 నిర్వహణ ఏర్పాట్లపై జయేష్ రంజన్ ఆధ్వర్యంలో బుధవారం బేగంపేట్ హరిత ప్లాజా హోటల్‌లో వివిధ శాఖల ఉన్నతాధికారుల అభిప్రాయాలు సూచనలు, సలహాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకమ్మ పండుగ ప్రకృతిని ఆరాధించే పెద్ద పండుగ అని అన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు లోబడి తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు అద్దం పట్టేలా బతుకమ్మ పండుగ నిర్వహణ ఘనంగా చేపట్టేందుకు అన్ని శాఖల అభిప్రాయాలు సలహాలు సూచనలు తీసుకోవడం జరుగుతుందని అలాగే హైదరాబాద్ మహానగరంతో పాటు, వరంగల్ మరికొన్ని జిల్లాల్లో బతుకమ్మ పండుగ సంబురాలు చేపట్టడం జరుగుతుందన్నారు. బతుకమ్మ పండుగ వాల్ పోస్టర్లు, పండుగ యొక్క సాంప్రదా యం, వేడుకల నిర్వహణ విధివిధానాలు, స్వయం సహాయక సంఘాల పా త్ర, కులవృత్తుల వారు తయారుచేసిన వస్తువుల విక్రయాలు, కళా ప్రదర్శనలు తదితర అంశాలపై శాఖల వారీగా అభిప్రాయాలను స్వీకరించారు. సమావేశంలో స్పోర్ట్స్ అథారిటీ ఎండి సోనిబాలా దేవి, సెర్ప్ సిఇఓ దివ్య దేవరాజన్, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, టూరిజం కార్పొరేషన్ ఎండి క్రాంతి వల్లూ రి, అదనపు సిపి (ట్రాఫిక్) జోయెల్ డేవిస్ తదితరులు హాజరయ్యారు.



## ప్రమాదస్థాయికి ప్రాజెక్టులు

● భద్రాచలం వద్ద 2వ ప్రమాద హెచ్చరిక జారీ ● నాగార్జునసాగర్ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక



**హైదరాబాద్ :** రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో పాటు ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో కృష్ణ, గోదావరీ పరీవాహక ప్రాజెక్టులు ప్రమాదస్థాయిలో ప్రవహిస్తున్నాయి. ప్రాజెక్టుల్లో నీటి మట్టం అంతకంతకూ పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదనీటితో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం ఉధృతంగా పెరుగుతోంది. బుధవారం సాయంత్రం ఏడు గంటలకు గోదావరి నీటిమట్టం 48 అడుగులు దాటి ప్రవహిస్తోంది. ఉదయం గోదావరి నీటిమట్టం 43 అడుగులకు చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసిన అధికారులు రాత్రి 48 అడుగులు దాటడంతో రెండవ ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. భూపాలపల్లిలో కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద వరద పెరుగుతోంది. ప్రస్తుతం 12.41 మీటర్ల మేర వరద ప్రవహిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాల వల్ల ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో త్రివేణి సంగమం వద్ద వరద పోటెత్తింది. జ్ఞాన సరస్వతి, సాధారణ పుష్కర ఘాట్ల మెట్ల పైనుంచి వరద ప్రవాహం చేరింది. త్రివేణి సంగమం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయిలో వరద ప్రవహిస్తుంది. కామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్ జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. దీంతో 16 గేట్లను పైకి ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నట్లు నీటిపారుదల శాఖ ఇసి సాలోమన్ తెలిపారు. బుధవారం సాయంత్రానికి ఎగువ ప్రాంతాల నుంచి సాగర్‌లోకి 71,200 క్యూసెక్కుల వరద వచ్చి చేరడంతో 12, 16, 20 గేట్లు, 7, 8, 1 గేట్లను ఎత్తి 1,00600 క్యూసెక్కుల నీటిని మంజీరా నదిలోకి వదులుతున్నట్లు చెప్పారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు (17.802 టిఎంసిలు) కాగా.. ప్రస్తుతం 1403 అడుగులు (15.612 టిఎంసిలు)గా నమోదు అయినట్లు అధికారులు తెలిపారు. భారీ వర్షాలతో శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ నుంచి వరద ఉద్ధృతంగా కొనసాగుతోంది. జలాశయంలో మంగళవారం ఉదయం 2.75 లక్షల క్యూసెక్కుల వరద చేరగా.. 39 గేట్లు ఎత్తి 4.03 లక్షల క్యూసెక్కులను దిగువకు వదిలారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,091 అడుగులు(80.5 టిఎంసిలు) కాగా మంగళవారం సాయంత్రం వరకు 1,089 అడుగుల(72.99 టిఎంసిలు) మేర ఉంది. మెదక్ జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గా భవానీ ఆలయం వారం రోజులుగా జలదిగ్బంధంలోనే ఉంది. సింగూర్ నుంచి నీటిని దిగువకు విడుదల చేయడంతో పాటు నక్క వాగు ప్రవాహంతో వనదుర్గ ఆనకట్టకు భారీగా వరద పోటెత్తుతోంది. వనదుర్గ ఆనకట్ట మీదుగా 50,985 వేల క్యూసెక్కుల వరద నీరు విడుదల చేస్తున్నారు. మరోవైపు కృష్ణా పరీవాహక ప్రాజెక్టు అయిన శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం మరింత పెరిగింది. జూరాల, సుంకేసుల ప్రాజెక్టుల నుంచి 4,69,482 క్యూసెక్కులు చేరుతోంది. దీంతో శ్రీశైలం నుంచి 4,41,237 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ నుంచి 30,000 క్యూసెక్కులు, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కులు, కుడిగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 30,192 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. పది స్పిల్ వే గేట్లను 14 అడుగులు ఎత్తి 3,45,730 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 882.10 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.80 టిఎంసిలు కాగా ప్రస్తుతం 199.73 టిఎంసిలుగా కొనసాగుతోంది. ఎగువ ప్రాజెక్టులనుంచి శ్రీశైలం కు భారీగా ఇన్ ఫ్లో వస్తున్న నేపథ్యంలో వచ్చిన ఇన్ ఫ్లో వచ్చినట్టే నాగార్జునసాగర్ వైపు విడుదల చేస్తుఉండటంతో సాగర్ ప్రాజెక్టు కు గంట గంటకు వరద పెరిగి పోటెత్తుతుంది మొత్తం 26 గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. వరద పోటెత్తుతూ ఉండటం బుధవారం సాయంత్రానికి ఈ వరద ఉధృతి 6 లక్షల క్యూసెక్కుల వరకు పెరగవచ్చని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. దీనితో కృష్ణా నది పరివాహక ప్రాంతాలు అప్రమత్తంగా ఉండాలని ప్రాజెక్టు అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ప్రస్తుత రిజర్వాయర్ నీటిమట్టం 590 అడుగులకు 583.70 అడుగులుగా ఉన్నది.

# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## గౌహతి హైకోర్టుకు ఇద్దరు శాశ్వత జడ్జీలు

'సుప్రీం' కొలీజియం ఆమోదం

**న్యూఢిల్లీ :** గౌహతి హైకోర్టులో ఇద్దరు అదనపు న్యాయమూర్తులను శాశ్వత జడ్జీలుగా నియమించాలనే ప్రతిపాదనను బుధవారం సుప్రీంకోర్టు కొలీజియం ఆమోదించింది. భారత ప్రధాన న్యాయమూర్తి బిఆర్.గవాయ్ నేతృత్వంలోని కొలీజియం ఆగస్టు 19న సమావేశమై ఈ నిర్ణయం తీసుకుంది. 'గౌహతి హైకోర్టుకు చెందిన అదనపు న్యాయమూర్తులు జస్టిస్ బుడి హబంగ్, జస్టిస్ ఎన్.ఉన్నిక్రిష్ణణ్ నాయర్ (ఎస్ఐసి)ను శాశ్వత న్యాయమూర్తులుగా నియమించాలనే ప్రతిపాదనను 2025 ఆగస్టు 19న సుప్రీంకోర్టు కొలీజియం నిర్వహించిన సమావేశం ఆమోదించింది' అని సంబంధిత కమ్యూనికేషన్ వెల్లడించింది. నవంబర్ 10నుంచి తాజాగా మరో సంవత్సరం కొత్త పదవీకాలానికి అదనపు జడ్జి జస్టిస్ కౌషిక్ గోస్వామిని గౌహతి హైకోర్టు అదనపు జడ్జిగా నియమించాలని కూడా కొలీజియం సిఫారసు చేసింది.

# 11 ఏళ్లుగా విపక్షాలపై బిజెపి సర్కార్ దాడి

ప్రతిపక్షాల వాకౌట్ మధ్య బిల్లులు ఆమోదించుకున్నారు

కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే విమర్శ

ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి సుదర్శన్‌రెడ్డిని కూటమి పార్టీలకు పరిచయం చేసిన ఖర్గే



**న్యూఢిల్లీ :** రాజ్యాంగ సూత్రాలకు అంకితభావంతో ఉన్న వ్యక్తిని ఉపరాష్ట్రపతి పదవికి పోటీలో నిలబెట్టాలని ప్రతిపక్షాలు నిర్ణయించుకున్నాయని, సుదర్శన్‌రెడ్డి లాంటి వ్యక్తి అలాంటి వారేనని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే చెప్పారు. సంవిధాన్ సదన్ (పాత పార్లమెంట్) సెంట్రల్ హాలులో బుధవారం తన అభ్యర్థిత్వాన్ని సమర్థిస్తున్న వివిధ పార్టీల నాయకులకు ఉమ్మడి ప్రతిపక్ష ఉపరాష్ట్రపతి అభ్యర్థి బి.సుదర్శన్‌రెడ్డిని పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ గత 11 సంవత్సరాలలో బిజెపి ప్రభుత్వం ప్రతిపక్షాలపై వివక్ష చూపిందని విమర్శించారు. ప్రభుత్వం పార్లమెంటులో బిల్లులను త్వరితగతితో పాటు ప్రతిపక్ష పార్టీల వాకౌట్‌ల మధ్య కూడా ఆమోదిస్తోందని ఆరోపించారు. మోదీ ప్రభుత్వం బిల్లులను తొందరగా ఆమోదిస్తోందని, ఎంపిలను మాట్లాడనివ్వకుండా చేస్తుందని, ఇందులో స్పీకర్ కూడా పాత్ర పోషించారని ఖర్గే మండిపడ్డారు.

కాగా, సుదర్శన్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని స్వాగతిస్తూ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ మాట్లాడుతూ రాజ్యాంగంపై దాడి చేస్తున్న వారికి, దానిని సమర్థిస్తున్న వారికి మధ్య పోరాటం జరుగుతోందని అన్నారు. హర్యానా, మహారాష్ట్ర ఎన్నికలను దొంగిలించిన తర్వాత బిజెపి బిహార్ ఎన్నికలను దొంగిలించగలదని పేర్కొన్నారు, కానీ ప్రజలు ఇప్పుడు అర్థం చేసుకున్నారని, అది జరగనివ్వరని ఉద్ఘాటించారు. భారతీయ న్యాయశాస్త్రంలో సుదర్శన్ రెడ్డిని ' అత్యున్నత వ్యక్తి'గా అభివర్ణించిన ఖర్గే, న్యాయం పట్ల ఆయనకున్న అచెంచలమైన నిబద్ధతకు ఆయన ప్రసిద్ధి చెందారని, సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం కోసం నిర్భయమైన పోరాట యోధుడిగా, భారత ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసిన మైలురాయి తీర్పులను అందించారని అన్నారు. 'ఈ ఉపరాష్ట్రపతి ఎన్నిక కేవలం పదవి కోసం జరిగే పోటీ కాదు.. ఇది మన దేశ ఆత్మ కోసం జరిగే సైద్ధాంతిక యుద్ధం. పాలక పార్టీ ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాన్ని ఎంచుకున్నప్పటికీ, రాజ్యాంగం, దాని విలువలను మనకు మార్గదర్శక కాంతిగా మేము సమర్థిస్తాము. భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమానికి ఆజ్యం పోసిన, మన రాజ్యాంగానికి పునాదిగా నిలిచిన న్యాయం, సమానత్వం, సమ్మిళితత్వ కాలాతీత విలువలను సుదర్శన్‌రెడ్డి మూర్తీభవించారు' అని కాంగ్రెస్ చీఫ్ అన్నారు. మన ప్రజాస్వామ్య సంస్థల సమగ్రత అపూర్వమైన సవాళ్లను ఎదుర్కొంటున్న సమయం లో, ఆయన నామినేషన్ నిరంతరం క్షీణిస్తున్న రాజ్యసభ పనితీరుకు న్యాయంగా, నిష్పాక్షికంగా, గౌరవాన్ని పునరుద్ధరించడానికి దృఢమైన నిబద్ధతగా నిలుస్తుందని ఖర్గే అన్నారు. భారతదేశ ప్రజాస్వామ్య రాజకీయాల విశ్వసనీయత పార్లమెంటు బలమైన వేదికగా పనిచేయడంపై ఆధారపడి ఉంటుందని, ఇక్కడ సభ్యులు తాము ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజల మనోవేదనలను, ఆకాంక్షలను స్వేచ్ఛగా, న్యాయంగా వ్యక్తీకరిస్తారని ఆయన పేర్కొన్నారు.

ప్రతిపక్ష పార్టీలు సుదర్శన్‌రెడ్డికి మద్దతు ఇవ్వడంలో ఐక్యంగా ఉన్నాయని, ఆయన జ్ఞానం, సమగ్రత, అంకితభావం మన దేశాన్ని న్యాయం, ఐక్యతలో పాతుకుపోయిన భవిష్యత్తు వైపు ప్రేరేపిస్తాయని, నడిపిస్తాయని తాము విశ్వసిస్తున్నామన్నారు. సెప్టెంబర్ 9న జరిగే ఉపరాష్ట్రపతి ఎన్నికల సమయంలో తమ ఎంపిలు ఎలా ఓటు వేయాలో తెలుసుకోవడానికి సెప్టెంబర్ 8న మాక్ పోల్ నిర్వహిస్తామని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, సంస్థ, కెసి.వేణుగోపాల్ తెలిపారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, ఎన్‌సిపిఎస్‌పి నాయకుడు శరద్ పవార్, ఎస్‌పికి చెందిన రామ్ గోపాల్ యాదవ్, డిఎంకెకు చెందిన తిరుచ్చిశివ, ఎస్ఎస్‌యుబిటి నాయకుడు సంజయ్‌రౌత్, టిఎంసికి చెందిన శతాబ్ది రాయ్ వంటి అనేక మంది ప్రతిపక్ష నాయకులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. అంతేకాకుండా, ఉపరాష్ట్రపతి అభ్యర్థిని స్వాగతిస్తున్నప్పుడు ఇతర ప్రతిపక్ష ఎంపిలు కూడా సెంట్రల్ హాల్‌లో ఉన్నారు.

ఎన్‌డిఎ ఉపరాష్ట్రపతి అభ్యర్థి

# రాధాకృష్ణన్ నామినేషన్



**న్యూఢిల్లీ :** ఉపరాష్ట్రపతి ఎన్నికకు ఎన్‌డిఎ అభ్యర్థి సిపి.రాధాకృష్ణన్ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ఆయనవెంట ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, హోంమంత్రి అమిత్‌షా, ఇతర సీనియర్ నాయకులు ఉన్నారు. రాధాకృష్ణన్, సీనియర్ ఎన్‌డిఎ నాయకులు కలిసి మోదీ, ఉపరాష్ట్రపతి ఎన్నికలకు రిటర్నింగ్ అధికారిగా ఉన్న రాజ్యసభ సెక్రటరీ జనరల్ పిసికి మోదీ నాలుగుసెట్ల నామినేషన్ పత్రాలను అందజేశారు. నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలలో మోదీ, సింగ్, షా, జెడి(యు) నాయకుడు రాజీవ్ రంజన్ సింగ్ ప్రధాన ప్రతిపాదకులుగా ఉన్నారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థి కనీసం 20 మంది ఓటర్లు ప్రతిపాదకులుగా, కనీసం మరో 20 మంది ఓటర్లు ద్వితీయులుగా తన నామినేషన్ పత్రాలకు సభ్యత్వాన్ని పొందాలి. దాఖలైన నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలలో ఎన్‌డిఎ తన నియోజకవర్గాలన్నింటికీ ప్రతిపాదకులు, ద్వితీయులుగా ప్రాతినిధ్యం వహించేలా జాగ్రత్తలు తీసుకున్నారు. రిటర్నింగ్ అధికారి నామినేషన్ పత్రాలను పరిశీలించిన తర్వాత రాధాకృష్ణన్ రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఆతర్వాత రిటర్నింగ్ అధికారి నామినేషన్ పత్రాల రసీదు స్లిప్‌ను ప్రధానమంత్రికి అందజేశారు. మోడీ, షా, సీనియర్ మంత్రులు ప్రహ్లాద్‌జోషి, ధర్మేంద్రప్రధాన్, ఇతర ఎన్‌డిఎ నాయకులు, టిడిపి నాయకుడు, కేంద్రమంత్రి కె.రామ్‌మోహన్ నాయుడు, శివసేన నాయకుడు శ్రీకాంత్ షిండే, ఎల్‌జెఎస్‌పి (ఆర్‌వి) నాయకుడు చిరాగ్ పాస్వాన్ రాధాకృష్ణన్‌ను పార్లమెంటులోని రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి తీసుకెళ్లారు. ముందుగా, రాధాకృష్ణన్ పార్లమెంటు కాంప్లెక్స్‌లోని ప్రముఖ వ్యక్తుల విగ్రహాలు ఉన్న ప్రేరణ స్థల్ వద్ద మహాత్మా గాంధీ, ఇతర జాతీయ నాయకులకు నివాళులర్పించారు.

# రాజీవ్‌గాంధీకి ఘన నివాళి



**న్యూఢిల్లీ :** మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 81వ జయంతి సందర్భంగా బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహా కాంగ్రెస్ నాయకులు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. తన తండ్రికి నివాళులర్పిస్తూ, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఎక్స్‌లో పోస్టు చేస్తూ 'ప్రతిపౌరుడు గౌరవించబడే, సద్భావన ఉన్న, ప్రజాస్వామ్యం, రాజ్యాంగంతో బలంగా నిలబడే భారతదేశం ఇది. నాన్న, మీఈ కలను నెరవేర్చడమే నాజీవిత లక్ష్యం' అన్నారు. వీర్ భూమిలోని రాజీవ్ గాంధీ స్మారక చిహ్నానికి తన కుటుంబంతో పాటు హాజరైన ప్రియాంకగాంధీ ఎక్స్ పోస్టులో 'మేము కరుణ, ప్రేమ, దేశభక్తి అనే మతాన్ని మీనుండి వారసత్వంగా పొందాం. మేమిద్దరం ఈ మతాన్ని ఎప్పటికీ అనుసరిస్తాము. ఎవరూ మమ్మల్ని విచ్ఛిన్నం చేయలేరు. ఎవరూ మమ్మల్ని ఆపలేరు. మా అడుగులు ఎప్పటికీ తడబడవు' అని పేర్కొన్నారు. రాజీవ్ జయంతిని పురస్కరించుకుని అఖిల భారత కాంగ్రెస్ కమిటీ వీర్ భూమిలో ఒక స్మారక కార్యక్రమాన్ని నిర్వహించింది. పార్టీ సీనియర్ నాయకులు మల్లికార్జున్‌ఖర్గే, కెసి.వేణుగోపాల్, ప్రియాంకగాంధీ వాద్ర పాల్గొన్నారు. ఆతరువాత, సంవిధాన్ సదన్(పాత పార్లమెంట్‌హౌస్) సెంట్రల్ హాలులో కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాజీవ్ గాంధీకి పుష్పాంజలి ఘటించారు. స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్, కాంగ్రెస్ చీఫ్ ఖర్గే, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ తదితరులు నివాళులర్పించారు. 'ఈరోజు రాజీవ్ జయంతి సందర్భంగా, మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీజీకి నా నివాళులు' అని ప్రధాని మోదీ ఎక్స్‌లో పేర్కొన్నారు. సద్భావన దివస్‌ను జరుపుకుంటున్నందున, లక్షలాది మందిలో ఆశను ప్రేరేపించిన, భారతదేశాన్ని 21వ శతాబ్దంలోకి నడిపించిన గొప్ప నాయకుడు రాజీవ్‌గాంధీని మనం గుర్తుచేసుకుంటున్నామని ఖర్గే అన్నారు. దేశంలో పరివర్తనాత్మక మార్పులను తీసుకువచ్చాయన్నారు. రాజీవ్ జయంతి సందర్భం గా ఆయనకు ప్రగాఢ నివాళులర్పిస్తున్నామని ఖర్గే ఒక పోస్ట్‌లో తెలిపారు. ఈసందర్భంగా ఖర్గే మరోపోస్టులో రాజీవ్‌గాంధీ హయాంలో సాధించిన విజయాలను గుర్తుచేశారు. ఓటింగ్ వయస్సును 18సంవత్సరాలకు తగ్గించడం, పంచాయతీరాజ్‌ను బలోపేతం చేయడం, టెలికాం, ఐటి విప్లవం, కంప్యూటరీకరణ కార్యక్రమాలు, శాంతి ఒప్పందాలను కొనసాగించడం, మహిళా సాధికారత, సార్వత్రిక టీకాకార్యక్రమం, సమ్మిళిత విద్యపై ప్రాధాన్యతనిస్తూ కొత్త విద్యా విధానం వంటి అపూర్వమైన కార్యక్రమాలు దేశంలో పరివర్తన మార్పులను తీసుకువచ్చాయని పేర్కొన్నారు.

# ఢిల్లీ సిఎంపై దాడి

హత్య కుట్రలో భాగమేనని ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడి



**న్యూఢిల్లీ :** ఢిల్లీలోని సివిల్ లైన్స్‌లో ఉన్న తన క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఉదయం జరిగిన 'జాన్ సన్‌వై' కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేఖాగుప్తాపై దాడి జరిగింది. హత్య కుట్రలో భాగమే ఈ దాడి అని ముఖ్యమంత్రి కార్యాలయం తెలిపింది. ఘటనలో రాజ్‌కోట్ (గుజరాత్) నివాసి అయిన 41ఏళ్ల నిందితుడు సక్రియా రాజేష్‌భాయ్ ఖిమ్జీభాయ్‌ను అదుపులోకి తీసుకున్నామని, ఐబి, ఢిల్లీ పోలీసుల స్పెషల్‌సెల్ సంయుక్తంగా విచారిస్తున్నాయని సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. ఈ దాడి ఉదయం 8.15 గంటల ప్రాంతంలో జరిగిందని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి చేతి, భుజం, తలపై గాయాలు అయ్యాయని పిడబ్ల్యుడి మంత్రి పర్వేష్ వర్మ తెలిపారు. ఈ దాడి తీవ్రమైన దాడి అని, ఇది ప్రాణాలకు ముప్పు కలిగించేది కావచ్చునని దర్యాప్తు గురించి తెలిసిన సీనియర్ పోలీసుఅధికారి ఒకరు తెలిపారు. తాము ఐబి, స్పెషల్ సెల్, నిఘా సంస్థలతో కలిసి విచారణ చేస్తున్నామని, నిందితుడిపై ఐదు క్రిమినల్ కేసులు ఉన్నాయన్నారు. వాటిలో కత్తి దాడికి సంబంధించిన రెండు దాడి కేసులు, ఎక్సైజ్‌చట్టం కింద మూడు ఉన్నాయని ఓఅధికారి పిటిఐకి తెలిపారు. కఠినమైన తనిఖీలు ఉంటాయని నిందితుడికి తెలుసు కాబట్టి అతను ఎటువంటి ఆయుధాన్ని తీసుకెళ్లలేదని, కేవలం బట్టలు, కొన్ని కాగితాలతో కూడిన బ్యాగు ను తీసుకెళ్లాడన్నారు. కాగా, దాడికి సంబంధించి హత్యాయత్నం అభియోగాల కింద పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. బిఎన్ఎస్ సెక్షన్ 109(1) కింద సివిల్ లైన్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (నార్త్) రాజాబందియా ఒక ప్రకటనలో తెలిపా రు. ఖిమ్జీభాయ్ రెండు రోజుల క్రితం ఢిల్లీకి వచ్చి ఉత్తర ఢిల్లీలోని సివిల్ లైన్స్‌లో బస చేసినట్లు తెలిపాయి. మంత్రి కపిల్‌మిశ్రా మాట్లాడుతూ దాడి చేసిన వ్యక్తి ముఖ్యమంత్రిని నేలపైకి తోసి కొట్టడానికి ప్రయత్నించాడన్నారు. ఇలాంటి దాడి ఢిల్లీ లో ఎప్పుడూ జరగలేదని మిశ్రా విలేకరులతో అన్నారు. ముఖ్యమంత్రికి వైద్యులు చికిత్స అందిస్తున్నారన్నారు. షాలిమార్ బాగ్‌లోని సిఎం నివాసం నుండి వచ్చిన సిసిటివి ఫుటేజ్‌లను ఉటంకిస్తూ సిఎం గుప్తాపై దాడి హత్య కుట్రలో భాగమేనని అధికారికవర్గాలు తెలిపాయి. దుండగుడు కనీసం 24గంటల ముందుగానే దాడికి సన్నాహాలు ప్రారంభించాడని ఫుటేజ్ స్పష్టంగా చూపిస్తుందని వారు చెప్పారు. ఇదిలా ఉండగా నిందితుడి తల్లి భానుబెన్ సకారియా రాజ్‌కోట్‌లో మాట్లాడుతూ తన కొడుకు ఏ రాజకీయ పార్టీకి చెందినవాడు కాదని, వీధికుక్కలపై సుప్రీంకోర్టు ఆదేశానికి వ్యతిరేకంగా నిరసనలో పాల్గొనడానికి దేశ రాజధానికి వెళ్లాడని పేర్కొంది. ఆమె తన కొడుకు 'శునక ప్రేమికుడు' అని పేర్కొంది. 'అతను కుక్కలు, ఆవులు, పక్షులను ప్రేమిస్తాడు. ఢిల్లీలోని వీధి కుక్కలన్నింటినీ పట్టుకోవాలని సుప్రీంకోర్టు చెప్పిన తర్వాత అతను కలత చెందాడు' అని చెప్పింది, కొన్నిరోజుల క్రితం సుప్రీంకోర్టు ఆదేశానికి వ్యతిరేకంగా నిరసనలలో పాల్గొనడానికి ఢిల్లీకి వెళ్తానని ఫోన్‌లో చెప్పాడని పేర్కొంది.

జిఎస్‌టి పన్ను రేట్ల తగ్గింపుతో సంవత్సరానికి దాదాపు

# రూ.85,000 కోట్ల ఆదాయ నష్టం



పన్ను సంస్కరణల ఆవశ్యకతను విపులీకరించిన ఆర్థిక మంత్రి

జిఎస్‌టి మంత్రుల బృందంతో నిర్మలా సీతారామన్ సమావేశం

21న జిఎస్‌టి రేటు హేతుబద్ధీకరణపై మళ్లీ సమావేశం

**న్యూఢిల్లీ :** గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ (జిఎస్‌టి) పాలనలో పన్ను రేట్లను తగ్గించడం, వ్యాపారాలపై సమ్మతి భారాన్ని సడలించడం వంటి సమగ్ర సంస్కరణల కోసం తన ప్రభుత్వ ప్రణాళికలను ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బుధవారం రాష్ట్రాల గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ (జిఓఎం'స్)కు సమర్పించారు. రేటు హేతుబద్ధీకరణ, బీమా పన్ను, పరిహార సెస్సుపై రెండు రోజుల పాటు జిఓఎం'స్ కేంద్రం సంబంధిత తదుపరి జిఎస్‌టి సంస్కరణలపై చర్చించనున్నాయి. దీని కింద 5, 18 శాతం రేటు పన్నుతో పన్ను విధించబడుతుంది. ప్రత్యేకించి 5 నుంచి 7 వస్తువులపై 40శాతం రేటును ప్రతిపాదించారు. ఇందులో 'సిన్ గూడ్స్' కూడా ఉన్నాయి. ప్రస్తుతం జిఎస్‌టి 5, 12, 18, 28శాతంగా ఉన్నది. అదేసమయంలో ఆహార, అవసర వస్తువులపై సున్నా లేదా 5శాతం రేటులో ఉన్నాయి. విలాస, డీమెరిట్ గూడ్స్ 28శాతం స్లాబులో ఉన్నాయి. దానిపై సెస్సు ఉంటుంది. మంత్రుల బృందాలను ఉద్దేశించి ప్రసంగించిన ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన ప్రసంగం కొద్ది నిమిషాల పాటే కొనసాగిందని, కేంద్రం ప్రతిపాదనను ఆమె వివరించారని ఒక అధికార వర్గం వెల్లడించింది. రాష్ట్రాలకు జిఎస్‌టి సంస్కరణల ఆవశ్యకతను ఆమె వివరించారని కూడా తెలిపారు. రేటు హేతుబద్ధీకరణపై స్లాబ్‌లు, రేట్లను సూచిండం, కొన్ని ఎదుర్కొంటున్న సుంకాల విలోమాన్ని తొలగించడం తప్పనిసరి చేయబడింది. జిఎస్‌టి రేటు హేతుబద్ధీకరణపై మంత్రుల బృందం ఈ నెల 21న మళ్లీ సమావేశం కానుంది. ఎస్‌బిఐ రీసెర్చ్ నివేదిక ప్రకారం, ఈ ప్రతిపాదన ప్రభావం వల్ల సంవత్సరానికి దాదాపు రూ.85,000 కోట్ల ఆదాయ నష్టం సంభవించవచ్చు. అక్టోబరు 1నుండి పన్నురేట్లు అమలుచేయబడితే, ఆర్థిక సంవత్సరం చివరి నాటికి ఆదాయ నష్టం రూ.45,000 కోట్ల మేరకు ఉంటుందని ఎస్‌బిఐ రీసెర్చ్ నివేదిక వెల్లడించింది.

ప్రైవేట్ ఉన్నత విద్యా సంస్థల్లో రిజర్వేషన్లు అనుమతిస్తూ...

# పార్లమెంట్‌లో ఒక కొత్త చట్టం తీసుకురావాలి

కేంద్రానికి కాంగ్రెస్ డిమాండ్



**న్యూఢిల్లీ :** ప్రైవేట్ ఉన్నత విద్యాసంస్థల్లో షెడ్యూల్డ్ కులాల(ఎస్‌సిల)కు 15శాతం, షెడ్యూల్డ్ ట్రైబ్స్ (ఎస్‌టిల)కు 7.5శాతం, ఇతర వెనకబడిన తరగతుల(ఓబిసిల)కు 27శాతం రిజర్వేషన్లు కల్పించడానికి ప్రభుత్వం పార్లమెంట్‌లో కొత్త చట్టాన్ని తీసుకురావాలని బుధవారం కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. విద్యపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఈ రిజర్వేషన్ల అమలు విషయమై తన సిఫారసులతో పార్లమెంట్‌లో ఒక నివేదిక ప్రవేశపెట్టిన తర్వాత కాంగ్రెస్ పార్టీ ఈ డిమాండ్ చేసింది. కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరామ్ రమేష్ ఇక్కడ విడుదల చేసిన ఒక ప్రకటనలో ఇప్పుడు బంతి ప్రభుత్వ కోర్టులో ఉన్నదన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఎస్‌సిలు, ఎస్‌టిలు, ఓబిసిల కోసం ఈ డిమాండ్‌ను ఇకపై ఎంతోకాలం విస్మరించడం సాధ్యం కాదని ఆయన స్పష్టం చేశారు. 'దిగ్విజయ్ సింగ్ నేతృత్వంలోని విద్యపై ద్వైపాక్షిక పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ బుధవారం పార్లమెంట్‌కు తన రిపోర్ట్‌ను సమర్పించింది. ఇది ప్రైవేట్ ఉన్నత విద్యా సంస్థల్లో ఎస్‌సి, ఎస్‌టి, ఓబిసిల కోసం రిజర్వేషన్లను వాదిస్తోంది' అని జైరామ్‌రమేష్ చెప్పారు. ఆనివేదికలోని కీలక అంశాలను ఆయన హైలెటింగ్ చేస్తూ మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం 2006లో 93వ సవరణ ద్వారా ప్రైవేట్ ఉన్నత విద్యా సంస్థల్లో ఎస్‌సి, ఎస్‌టి, ఓబిసిల కోసం ప్రభుత్వం విధిగారిజర్వేషన్లు కల్పించాలని నొక్కిచెప్పిందన్నారు. 2014 మేలో ప్రమతి ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ ట్రస్ట్ వర్సెస్ భారత ప్రభుత్వం కేసులో సుప్రీంకోర్టు ఆర్టికల్ 15(5) చెల్లుబాటును సమర్థిస్తూ ప్రైవేట్ ఉన్నత విద్యా సంస్థల్లో కూడా రిజర్వేషన్లు అనుమతించబడతాయని స్పష్టంచేసింది. అయితే ప్రస్తుతం దీనిపై పార్లమెంట్ ఎలాంటి చట్టాన్ని ఆమెదించలేదు. ఆర్టికల్ 15(5) ప్రైవేట్ ఉన్నత విద్యా సంస్థల్లో ఎస్‌సి, ఎస్‌టి,ఓబిసి విద్యార్థులకు విధిగా రిజర్వేషన్లు ఉండాలని ఆదేశిస్తోంది.'ప్రైవేట్ విద్యా సంస్థల్లో ప్రస్తుతం ఎస్‌సి, ఎస్‌టి, ఓబిసి విద్యార్థుల ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉంది. కేంద్ర ప్రభుత్వం గుర్తించిన మూడు ప్రైవేట్ సంస్థల అద్భుతమైన కూర్పును కమిటీ పరిశీలించింది. 0.89శాతం ఎస్‌సి విద్యార్థులు, 0.53శాతం ఎస్‌టి విద్యార్థులు, 11.6శాతం ఓబిసి విద్యార్థులు ఉన్నారు' అని జైరామ్ రమేష్ పేర్కొన్నారు. ఎస్‌సి వర్గాలకు 15శాతం రిజర్వేషన్ అమలు, ఎస్‌టి వర్గాలకు 7.5శాతం ఓబిసిలకు 27శాతం రిజర్వేషన్ అమలు చేసే ఒక చట్టాన్ని ఆమోదించాలని విద్యపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఏకగ్రీవంగా సిఫారసు చేసిందని కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కొన్ని డిమాండ్లలో ఇది కూడా ఒక కీలకమైన డిమాండ్. ప్రైవేట్ ఉన్నత విద్యాసంస్థల్లో రిజర్వేషన్ల పెంపునకు సంబంధించి ఒక చట్టాన్ని తీసుకురావాలని కాంగ్రెస్ పార్టీ మరోసారి డిమాండ్ చేస్తోంది. కులగణన తర్వాత ఓబిసి కోటాను పెంచాలని రాహుల్‌గాంధీ కూడా డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే.

వివాహం ముగిశాక...

# ఇప్పుడైనా..మీ అహంకారం 'నశించాలి'

ఓ జంట వివాహాన్ని రద్దు చేసిన 'సుప్రీం' కీలకవ్యాఖ్యలు

మైనర్ కూతురును జాగ్రత్తగా చూసుకోవాలని విడిపోయిన జంటకు హితవు



**న్యూఢిల్లీ :** సుప్రీంకోర్టు బుధవారం ఒక జంట వివాహాన్ని రద్దు చేస్తూ కీలక వ్యాఖ్యలు చేసింది. వారి మైనర్ బిడ్డను జాగ్రత్తగా చూసుకోవాలని ఆదేశించింది. వివాహం ముగిసిన తర్వాత ఇక ఇప్పుడైనా మీ అహంకారం తప్పకుండా 'నశించాలి' అని వ్యాఖ్యానించింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బివి.నాగరత్న, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన డివిజన్ బెంచ్ విచారణ సందర్భంగా తీవ్రంగా స్పందించింది. 'వివాహం రద్దు చేయడం మాకు నచ్చలేదు' అని ధర్మాసనం స్పష్టం చేసింది. పరస్పర అంగీకారంతో తమ వివాహాన్ని రద్దు చేసుకోవాలని, పార్టీలు ఉమ్మడి పిటిషన్‌ను దాఖలు చేసిన తర్వాత బెంచ్ ఈ ఉత్తర్వును జారీచేసింది. 'ఇప్పుడు ఇక అహం ఉండకూడదు. ఎందుకంటే ఇక వివాహం లేదు. వివాహంలో అహం ఉన్నా ఇక వివాహం అనేది లేనప్పుడు అహం నశించాలి. ఇక ఇప్పుడు మీరు బిడ్డను జాగ్రత్తగా చూసుకోండి' అని ధర్మాసనం విడిపోయిన ఆ జంటకు హితవు చెప్పింది.ఈ కేసులో బాంబే హైకోర్టు జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ ఓ మహిళ దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం విచారించిన సందర్భంగా ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. అప్పీల్ పెండింగ్‌లో ఉన్న సమయంలో అనేకసార్లు చర్చలు జరిపిన తర్వాత, పరస్పర అంగీకారంతో నిబంధనలు మరియు షరతులతో వివాహ డిక్రీ ద్వారా వివాహాన్ని రద్దు చేయాలని నిర్ణయించుకున్నట్లు ఇరుపక్షాల తరపు న్యాయవాదులు తెలిపారు. వారి బిడ్డ సంరక్షణ, సందర్శన హక్కుల అంశాన్ని ధర్మాసనం గుర్తించింది. వారి బిడ్డ సంరక్షణ తల్లితోనే ఉంటుందని బెంచ్ స్పష్ట ంచేసింది. ఉమ్మడి దరఖాస్తుకు అనుగుణంగా సందర్శన హక్కులు తండ్రికి ఉంటాయని తెలియజేసింది. ఆ వ్యక్తి తన మైనర్ కూతురుకు ప్రతీ నెలా రూ.50,000 చెల్లిస్తాడని రికార్డులో వచ్చింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద దాఖలు చేసిన ఉమ్మడి దరఖాస్తు పరిష్కారానికి సంబంధించిన నిబంధనలు, షరతులు హిందూ వివాహ చట్టం 1955లోని సెక్షన్ 13బితో రాజ్యాంగం ప్రస్తావించింది. ఏదైనా కేసులో లేదా పెండింగ్‌లో ఉన్న కేసులో పూర్తి న్యాయం చేయడానికి అవసరమైన ఉత్తర్వును జారీ చేయడానికి ఆర్టికల్ 142 సుప్రీంకోర్టుకు అధికారాన్ని ఇస్తుండగా, హిందూ వివాహ చట్టంలోని సెక్షన్ 13బి పరస్పర అంగీకారం ద్వారా విడాకులను పరిష్కరిస్తుంది. 'ఈ కోర్టు ముందు పార్టీలు హాజరవుతున్నాయి. ఈ కోర్టు ప్రశ్నించినప్పుడు పార్టీలు తమ అన్ని వివాదాల పరిష్కారానికి నిజంగా చేరుకున్నాయని, పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకోవాలని కోరుతూ విడిపోవాలని నిర్ణయించుకున్నామని తెలియజేశారు' అని జస్టిస్ బివి.నాగరత్న, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం పేర్కొంది.

# నేషనల్ హైవే కార్యాలయం ఆస్తుల జప్తుకు కోర్టు ఆదేశాలు

**ప్రజాపక్షం /హనుమకొండ టౌన్ :** నేషనల్ హైవే 163 రోడ్డు విస్తరణలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లింపులో జాప్యం చేస్తున్నందుకు గాను, నేషనల్ హైవే అథారిటీ కార్యాలయ ఆస్తులను జప్తు చేయాలని హనుమకొండ జిల్లా కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు కోర్టు సిబ్బంది, బాధితుల తరపు న్యాయవాదులు, భూ నిర్వాసితులు బుధవారం హనుమకొండలోని హంటర్ రోడ్డులో ఉన్న నేషనల్ హైవే కార్యాలయానికి చేరుకున్నారు. అయితే కోర్టు ఆదేశాల ప్రకారం, కార్యాలయ ఫర్నీచర్, కంప్యూటర్లు, ఇతర సామాగ్రిని జప్తు చేయడానికి కోర్టు సిబ్బంది ప్రయత్నించగా, మేనేజర్ ఇతర ఎన్‌హెచ్‌ఎఐ ఉద్యోగులు వారిని అడ్డుకున్నట్లు భూ నిర్వాసితుల తరపు న్యాయవాదులు దయ్యాల సుధాకర్, గునిగంటి శ్రీనివాస్ గౌడ్, మరియు నరేందర్ యాదవ్ తెలిపారు. కోర్టు విధులకు ఆటంకం కలిగించి, సామాగ్రిని జప్తు చేయకుండా నిరోధించినట్లు వారు చెప్పారు. కోర్టు సిబ్బంది తమ విధులకు ఆటంకం కలిగించవద్దని కోరినప్పటికీ, నేషనల్ హైవే సిబ్బంది వారిపై దురుసుగా ప్రవర్తించి, "మీరు ఏం చేసుకుంటారో చేసుకోండి" అంటూ పరుష పదజాలం ఉపయోగించినట్లుగా న్యాయవాదులు పేర్కొన్నారు. సుమారు 13 గ్రామాల ప్రజలు 2013లో నేషనల్ హైవే కోసం తమ భూములను కోల్పోయారు. ఆ సమయంలో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా నామమాత్రపు పరిహారాన్ని చెల్లించి, రోడ్డు నిర్మాణం చేపట్టిందని ఆరోపించారు. దీనిపై పైడిపల్లి గ్రామానికి చెందిన భూ నిర్వాసితులు జిల్లా కలెక్టర్, ఆర్బిట్రేటర్ వద్ద అప్పీల్ దాఖలు చేశారు. అప్పీల్‌లో భాగంగా, 2015లో అప్పటి జిల్లా కలెక్టర్, ఆర్బిట్రేటర్ స్క్వేర్ మీటర్‌కు రూ.400 పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఈ పెంచిన పరిహారాన్ని నిర్వాసితులకు చెల్లించడంలో నేషనల్ హైవే అథారిటీ జాప్యం చేయడంతో, జిల్లా న్యాయమూర్తి ఆస్తుల జప్తుకు ఆదేశాలు ఇచ్చారు. అయితే, ఈ ఆదేశాలను కూడా నేషనల్ హైవే కార్యాలయ సిబ్బంది అమలు చేయకుండా అడ్డుకున్నారని భూ నిర్వాసితుల తరపు న్యాయవాదులు దయ్యాల సుధాకర్, గునిగంటి శ్రీనివాస్ గౌడ్, నరేందర్ యాదవ్ తెలిపారు. ఈ పరిణామం న్యాయ వ్యవస్థ పట్ల నేషనల్ హైవే అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిదర్శనంగా నిలిచిందని న్యాయవాదులు అన్నారు.



ప్రజాపక్షం
గురువారం, 21 ఆగస్టు

# ‘గో బ్యాక్’ వాదం తగదు

అభివృద్ధిలో దూసుకుపోతున్న తెలంగాణలో తాజాగా ‘మార్వాడీ గో బ్యాక్’ ఉద్యమం తలెత్తడం అవాంఛనీయం. వ్యాపార వైరం దీనికి మూలం. కొద్ది మంది వ్యక్తులు లేదా సమూహాల ఆందోళన రాష్ట్ర శాంతిభద్రతలను, సమైక్యతను ప్రమాదంలోకి నెడుతుంది. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ తదితర ప్రాంతాల్లో ‘మార్వాడీ వ్యతిరేక నిరసనలు, బంద్‌లు జరగడం ఆందోళనకరం. దేశంలోని వాణిజ్య రంగంలో దశాబ్దాలుగా మార్వాడీలు ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఇది కాదనలేని నిజం. అయితే, వారు చిన్న చిన్న వ్యాపారాల నుంచి పెద్దపెద్ద హోల్‌సేల్ దుకాణాల వరకు అన్ని రకాల లావాదేవీలు నిర్వహించడం వల్ల స్థానికులకు ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయన్నది నేడు తెరపైకి వచ్చిన ఆరోపణ. నాణ్యత లేని, నకిలీ ఉత్పత్తులను అమ్ముతున్నారని కొందరి ఆరోపణ. స్థానిక వ్యాపారులను ప్రోత్సహించాలన్న ప్రచారంతో కొనసాగుతున్న ఆందోళనలకు కొన్ని పార్టీలు రాజకీయ లబ్ధి కోసం వంతపాడడం విచిత్రం. సమాజాన్ని సముదాయాలు, ప్రాంతాల వారీగా చీల్చాలను కోవడం అనైతికం. నిజానికి, ఒక భారత పౌరుడికి దేశంలో ఎక్కడైనా నివసించే, ఉద్యోగ, వ్యాపారాలు చేసుకునే హక్కు రాజ్యాంగం కల్పించింది. ఎక్కడైనా, ఎవరైనా కల్తీ లేదా నాణ్యతలేని వస్తువులను అమ్ముతున్నా లేదా పరిసరాల పరిశుభ్రత పాటించకపోతున్నా సదరు వ్యక్తి లేదా వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చు. పోలీస్, న్యాయ వ్యవస్థలను ఆశ్రయించవచ్చు. అంతేగానీ, ఏకంగా ఒక సముదాయాన్ని దోషిగా నిలబెట్టడం, ‘గో బ్యాక్’ అంటూ ఆందోళనలు చేయడం ఎంతమాత్రం సమర్థనీయం కాదు. ఆమనగల్‌లో చిన్నగా మొదలైన ఘర్షణ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కొన్ని ప్రాంతాల్లో బంద్‌లకు దారి తీశాయి. కొంత మంది సోషల్‌మీడియా మాధ్యమంగా మార్వాడీలను లక్ష్యంగా చేసుకొని, వారి పట్ల వ్యతిరేకతను పెంచుతున్నారు. ద్వేషాన్ని నింపుతున్నారు. మార్వాడీ వ్యాపారం.. స్థానిక వ్యాపారాలపై ఆర్థిక ప్రభావం.. వంటి అంశాలను ప్రముఖంగా ప్రస్తావిస్తూ, ‘గో బ్యాక్ మార్వాడీ’ నిరసనలను ఉధృతంగా మార్చే ప్రయత్నం చేస్తున్నారు. ఒక రాష్ట్రం వారు మరో రాష్ట్రంలో వృత్తి, వ్యాపారాలు చేపట్టడం సర్వసాధారణం. ఉత్తరాదికి చెందిన ఎన్నో రాష్ట్రాల నుంచి ఎన్నో సముదాయాలకు చెందిన వారికి రాష్ట్రంలో వ్యాపారాలు ఉన్నాయి. వీరందరినీ మార్వాడీలుగా పేర్కొనడం సర్వసామాన్యమైంది. రాజస్థాన్‌లోని మార్వార్ ప్రాంతం నుంచి వచ్చిన వారు మాత్రమే మార్వాడీలు. ఆ రాష్ట్రానికి చెందిన అందరూ కాదు. రాష్ట్రంలో ఉన్న బంజారాలు కూడా ప్రస్తుత రాజస్థాన్ ప్రాంతం నుంచి ఏ విధంగా వచ్చి స్థిరపడిన వారే. వారిని మార్వాడీలు అని ఎందుకు అనడం లేదు? ఏదిఏమైనా మార్వాడీలు అని వీరిని అంటారనే విషయం కూడా తెలియకుండానే చాలా మంది ‘మార్వాడీ గో బ్యాక్’ నినాదాలు చేయడం, బంద్‌కు పిలుపునివ్వడం హాస్యాస్పదమేకాదు.. రాజ్యాంగ విరుద్ధం కూడా. స్థానిక, బహుళజాతి వ్యాపార సంస్కృతి మధ్య సహజంగా జరిగే పోటీకి రాజకీయ రంగు పులమడంతో, ఒక చిన్న సంఘటన క్రమంగా సామాజిక సంఘర్షణ రూపాన్ని సంతరించుకుంటున్నది. స్థానిక వ్యాపారులు వ్యాపారంలో పోటీపడలేకపోతే, ద్వేషాన్ని పెంచుకోకూడదు. అదే సమయంలో, ఎవరైనా ‘గో బ్యాక్’ అనడం సమంజసమా అన్న ప్రశ్నకు సమాధానం వెతుక్కోవాలి. సమాజంలో ఎవరినీ లేదా ఏ సమూహాన్నీ వెనక్కి వెళ్లమనడం రాజ్యాంగ విరుద్ధం. నైతిక పతనం. అన్ని సముదాయాలకు, మతాలకు, భాషలకు రాజ్యాంగం సమాన హక్కులు ఇచ్చింది. విద్వేష చూపటం, లేదా వెనక్కి వెళ్లిపోవాలనడం నేరం. వాణిజ్యం, వ్యాపార రంగంలో పోటీతత్వం ఉంటూనే వైషమ్యాలకు సమాజ పురోగమనానికి మంచిది కాదు.

మన దేశం అన్ని రకాల దురహంకార, వేర్పాటువాద, ప్రాంతీయ, భాషా వ్యతిరేక ఉద్యమాలను చూసింది. మూల్యం చెల్లించుకుంది. అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుంది. కులోన్మాద, మతోన్మాద ఆందోళనలూ చూసింది. తులనాత్మక అభివృద్ధి సాధనలో పాలకుల విఫలమైనందున ‘స్థానికులకే అన్నీ’, ‘ధరిత్రీ పుత్రులు’ వంటి ఉద్యమాలు చెలరేగాయి. ఇప్పటికీ ఇవి అప్పుడప్పుడు తొలుస్తూనే ఉంటాయి. రాజకీయ అసంతృప్తి జీవులు ఆజ్యం పోస్తుంటారు. దశాబ్దాల పోరాటాలు, త్యాగాల తర్వాత తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నాం. వేగవంతమైన అభివృద్ధికి శాంతి భద్రతలు, ప్రశాంత వాతావరణం అవసరం. దీనికి భంగం కలిగించడం మన కాళ్లను మనం నరుక్కోవడమే. దీనిని ప్రభుత్వం తాత్సారం చేయరాదు. ఈ ఉద్యమ బాధ్యులను పిలిచి, వారికేమైనా న్యాయమైన సాధకబాధకాలుంటే తెలుసుకొని పరిష్కరించాలి. అనవసరంగా ద్వేషాలు రెచ్చగొడుతున్న అల్లరిచిల్లర వ్యక్తులను అణచివేయాలి. రాష్ట్రం, ప్రాంతంతో నిమిత్తం లేకుండా రాష్ట్రంలో నివసిస్తున్న అందరికీ భరోసా ఇవ్వాలి.

# జిఎస్‌టి సంస్కరణ సమస్యలకు పరిష్కారం చూపేనా?

ఆర్.సూర్యమూర్తి

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట నుంచి జాతిని ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగిస్తూ వస్తు, సేవల పన్ను (జిఎస్‌టి) సంస్కరణను ‘దీపావళి కానుక’గా అందిస్తామని వాగ్దానం చేయడంతో, దానిని నెరవేర్చడానికి చాలా ఉన్నత స్థాయిలో గడువును, ప్రమాణాన్ని నిర్దేశించారు. ఈ వాగ్దానం కుటుంబాలకు ఉత్సాహాన్ని, చిన్న వ్యాపారాలకు ఉపశమనాన్ని కలిగించడంతో పాటు, ఆర్థిక వ్యవస్థపై ప్రభుత్వానికి పూర్తి నియంత్రణ ఉందనే భరోసాను కలిగించేలా రూపొందించబడింది. కానీ, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల వెనుక పండుగ వాతావరణం అంతగా లేని వాస్తవం దాగి ఉంది. జూలై నెల జిఎస్‌టి గణాంకాలు ఏ వాగ్దానాల మాటలతోనూ దాచిపెట్టలేని లోపాలను బైటపెడుతున్నాయి. దిగుమతులు పన్ను వ్యవస్థను నిలబెడుతున్నాయి, దేశీయ వినియోగం పడిపోతోంది, తిరిగి చెల్లింపులు భారీగా పెరుగుతున్నాయి, ఇంకా రాష్ట్రాల వారీగా జిఎస్‌టి పనితీరులో ఉన్న అసమానతలు ‘సరళీకరణ’చర్యను ఆర్థిక ఇబ్బందుల పంపిణీగా మార్చవచ్చు. క్లుప్తంగా చెప్పాలంటే, ఒక కానుకగా చెప్పబడుతున్న అంశం భవిష్యత్తులో ఆర్థిక సమస్యలకు దారి తీయవచ్చు. జిఎస్‌టి కౌన్సిల్ గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ వద్ద ఉన్న మోదీ సంస్కరణల ప్రణాళిక మూడు ప్రధాన అంశాలపై ఆధారపడి ఉంది: నిర్మాణాత్మక మార్పు, రేట్ల హేతుబద్ధీకరణ, ‘సులభ జీవనం’.ఇది వినియోగదారులకు అనుకూలమైన చర్యల జాబితా: అత్యధికంగా వినియోగించే వస్తువులపై రేట్లను తగ్గించడం, ఇన్వర్టెడ్ డ్యూటీ స్ట్రక్చర్లను సరిచేయడం, ఇంకా వ్యాపారాలకు నిబంధనలను సులభతరం చేయడం.

ప్రభుత్వం ఎఫ్‌ఎంసిజి సాచెట్లు, సిమెంట్ నుంచి ట్రాక్టర్లు, డ్రోన్లు, ఆటిజం కేంద్రాలు, ఇ వి బ్యాటరీ భాగాలు, చివరకు ఎయిర్ కండీషనర్ల వరకు వివిధ వస్తువులపై రేట్లను తగ్గించే ఆలోచనలో ఉంది. పెట్రోలియం మంత్రి హర్‌దీప్ పురి ఖనిజ వాయువును జిఎస్‌టి పరిధిలోకి తీసుకురావాలని మళ్లీ నొక్కి చెప్పారు. అయితే, అధికారులు ప్రస్తుతం ఉన్న ఐదు శ్లాబ్‌లను కొన్ని మినహాయింపులతో రెండంచెల వ్యవస్థగా మార్చాలని పరిశీలిస్తున్నారు. పైకి చూస్తే, ఇది ఒక ఆర్థిక ‘స్వీట్ బాక్స్’ లాగా కనిపిస్తుంది. ప్రతి వర్గానికి ఒక రుచి ఉంటుంది. కానీ సమస్య ఏమిటంటే, ఈ స్వీట్ బాక్స్ లోపల ఖాళీగా ఉండవచ్చు. 2025 జూలైలో జిఎస్‌టి వసూళ్లు ఏడాదివారీగా 7.5% పెరిగి రూ.1,95,735 కోట్లకు చేరుకున్నాయి. సాధారణంగా చూస్తే, ఇది జిఎస్‌టి విధానానికి ఒక రుజువుగా అనిపించవచ్చు. కానీ, లోపల ఉన్న వాస్తవాలను పరిశీలిస్తే, పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. దిగుమతుల ఆధారిత జిఎస్‌టి ఆదాయం 9.7% పెరగగా, దేశీయ జిఎస్‌టి కేవలం 6.7% మాత్రమే పెరిగింది. మరింత ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే: రిఫండ్లను సర్దుబాటు చేసిన తర్వాత, నికర దేశీయ జిఎస్‌టి, కోవిడ్ మహమ్మారి తర్వాత మొదటిసారిగా ఏడాదివారీగా క్షీణించింది. అంటే, భారతదేశం ఆత్మనిర్భర్ ఆర్థిక వ్యవస్థ జిఎస్‌టి వసూళ్లు ఆరోగ్యంగా కనిపించడానికి దిగుమతి చేసుకున్న వస్తువులపై ఎక్కువగా ఆధారపడుతోంది. విదేశీ సరుకుల దిగుమతి బిల్లులు చెల్లిస్తుంటే, స్వదేశీ డిమాండ్ తక్కువ స్థాయిలో ఉన్నపుడు ‘ఆత్మనిర్భర్ భారత్’ నినాదం నిస్సారంగా వినిపిస్తోంది. జులై నెలలో జిఎస్‌టి రిఫండ్లు 66.8% పెరిగాయి. గత ఏడాదితో పోలిస్తే కేవలం దేశీయ రిఫండ్లు మాత్రమే 117.6% పెరిగాయి. ప్రభుత్వం ఇది వ్యాపారాలకు ఆర్థిక లభ్యతను పెంచుతుందని చెబుతుంది. కానీ నిజం ఏమిటంటే, ఇది పన్ను నిర్మాణంలో ఉన్న తీవ్రమైన అసమర్థతలను బయటపెడుతుంది.

దీనికి ప్రధాన కారణం ఇన్వర్టెడ్ డ్యూటీ స్ట్రక్చర్స్, అంటే, తుది ఉత్పత్తిపై పన్ను కంటే దాని తయారీకి ఉపయోగించే ముడిసరుకులపై పన్ను ఎక్కువగా ఉండటం. లిథియం అయాన్




బ్యాటరీలు దీనికి ఒక ఉదాహరణ: విడి భాగాలపై 28% పన్ను, బ్యాటరీలపై 18% పన్ను. తయారీదారులు రిఫండ్ కోసం ఎదురుచూస్తూ చాలా నెలలు నిధులు నిలిచిపోయే పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఇది కేవలం అకౌంటింగ్ సమస్య మాత్రమే కాదు ఇది పారిశ్రామిక పోటీతత్వ సమస్య. రిఫండ్ల కోసం నిరీక్షించే సంస్థలు ఉత్పత్తిలో తిరిగి పెట్టుబడి పెట్టలేవు, కొత్త ఉద్యోగులను నియమించలేవు లేదా వేగంగా నవీకరణలు చేయలేవు. దీని ఫలితంగా: ఉత్పత్తి మందగించడం, ఖర్చులు పెరగడం, ఇంకా అంతర్జాతీయ , దేశీయ మార్కెట్లలో పోటీతత్వం క్షీణించడం జరుగుతుంది.

రాష్ట్రాల వారీగా చూస్తే, ఇది ఆర్థిక అసమానతల చిత్రపటంలో ఉంది. ఆర్థికంగా బలమైన రాష్ట్రాలైన ఢిల్లీ (2%), గుజరాత్ (3%), రాజస్థాన్ (4%), మహారాష్ట్ర (6%), కర్ణాటక (7%), తమిళనాడు (8%)లో వృద్ధి నెమ్మదిగా ఉంది. చిన్న లేదా మధ్య స్థాయి రాష్ట్రాలు వృద్ధి చెందుతున్నాయి: మధ్యప్రదేశ్ (18%), ఆంధ్రప్రదేశ్(14%), పశ్చిమ బెంగాల్ (12%), పంజాబ్, హర్యానా (12%). మరోవైపు, మణిపూర్ 36%, మిజోరం 21% క్షీణించగా, జార్ఖండ్, ఛత్తీస్‌ఘఢ్, జమ్మూకశ్మీర్ కూడా నష్టాల్లో ఉన్నాయి. సంస్కరణలకు ఇది ఎందుకు ముఖ్యమైనది? ఎందుకంటే జిఎస్‌టి రేట్ల హేతుబద్ధీకరణ అన్ని రాష్ట్రాలను ఒకే విధంగా ప్రభావితం చేయదు. సంపన్న, పట్టణీకరణ చెందిన రాష్ట్రాలు మధ్య, అధిక రేటు తరగతులలో ఎక్కువ వినియోగం ఉన్నవి అసమానంగా లబ్ధి పొందుతాయి. పేద, తక్కువ వినియోగం ఉన్న రాష్ట్రాలు తమ ఆర్థిక బలాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది. ఇది అన్యాయం మాత్రమే కాదు, చాలా అవసరమైన రాష్ట్రాల్లో సంక్షేమ కార్యక్రమాలను, మౌలిక సదుపాయాల ప్రణాళికలను దెబ్బతీస్తుంది.

నేషనల్ ఇన్స్‌టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీకి చెందిన ప్రొఫెసర్ సచ్చిదానంద ముఖర్జీ కొత్త వర్కింగ్ పేపర్ ఒక గంభీరమైన వాస్తవాన్ని చూపిస్తుంది. కేంద్రం లేదా రాష్ట్రాలు దేని వద్ద కూడా ప్రతిపాదిత రేట్ల మార్పుల ఆర్థిక ప్రభావాన్ని అంచనా వేయడానికి అవసరమైన, రేటు వారీగా జిఎస్‌టి సమాచారం లేదు. ఆర్థిక మంత్రిత్వశాఖ స్వయంగా 2024లో జిఎస్‌టి రిటర్న్స్‌లో ఆ వివరాలు లేనందున శ్లాబ్ వారీగా వసూళ్లను విడగొట్టడం ‘ప్రస్తుతం సాధ్యం కాద’ని అంగీకరించింది. అటువంటి సమాచారం లేకుండా, సంస్కరణ కేవలం ఆర్థిక జూదం. ఇది ఒక ప్రమాదకరమైన సమయంలో వస్తుంది. రాష్ట్రాలకు జిఎస్‌టి పరిహారం హామీ 2022లో ముగిసినందున, సంస్కరణలు ఆదాయాలకు హాని చేస్తే ఎటువంటి ప్రత్యామ్నా యం లేదు. ఇది రాజకీయ పోరాటాలకు, ఆర్థిక అస్థిరతకు దారి తీస్తుంది. జిఎస్‌టి రేట్లను ఒకేలా చేయడం కాగితంపై సులభంగా అనిపిస్తుంది. కానీ పరిహార యంత్రాంగాలు లేకుండా, ఇది అసమానతలను పెంచే విధంగా పన్ను భారాన్ని మార్చే ప్రమాదం ఉంది. ముఖర్జీ పరిశోధన ప్రకారం, గోవా వంటి సంపన్న రాష్ట్రాలు, అధిక పన్ను రేటు తరగతి వస్తువులపై చాలా ఎక్కువ ఖర్చు చేస్తాయి. పేద రాష్ట్రాల వినియోగ విధానాలు తక్కువ పన్ను ఉన్న నిత్యావసరాల వైపు మొగ్గు చూపుతాయి. రక్షణలు లేకుండా హేతుబద్ధీకరణ జరిగితే, సంపన్న రాష్ట్రాలు మరింత ఆదాయాన్ని సంపాదించవచ్చు, పేద రాష్ట్రాలు తమ బడ్జెట్లను తగ్గించుకోవాల్సి రావచ్చు. పర్యావరణ లేదా ఆరోగ్యపరంగా నష్టాలు కలిగించే వస్తువులపై ‘2026 తర్వాత అదనపు జిఎస్‌టి’ని ప్రభుత్వం పరిశీలిస్తోంది, కానీ ఇది ఇప్పటికే సెస్‌లు, సర్‌ఛార్జీలతో నిండిన వ్యవస్థకు మరో అదనపు పొర అవుతుంది. సరళీకరించడానికి ఉద్దేశించిన సంస్కరణలో సంక్లిష్టత మళ్లీ చోటు చేసుకుంటుంది. ప్రధాని ఈ దీపావళి వాగ్దానాన్ని ఒక గొప్ప చర్యగా గుర్తుంచుకోవాలని భావిస్తే, నాలుగు చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలి. దేశీయ డిమాండ్‌ను తిరిగి పెంచడం–మధ్యతరగతి గృహాలు, ఎంఎస్‌ఎంఇలకు వినియోగాన్ని స్థిరంగా పెంచడానికి లక్షిత ఉద్దీపన పన్ను రాయితీలు, క్రెడిట్ హామీలు లేదా ప్రత్యక్ష బదిలీలు అవసరం. ఇన్వర్టెడ్ డ్యూటీ స్ట్రక్చర్లను సరిచేయడం, రిఫండ్ల భారాన్ని తగ్గించడం వల్ల వర్కింగ్ క్యాపిటల్ లభ్యత పెరుగుతుంది, ఉత్పత్తి చక్రాలు వేగవంతమవుతాయి, భారత పరిశ్రమ మరింత పోటీతత్వాన్ని పొందుతుంది.

ప్రాంతీయ అసమానతలను తొలగించడానికి, మోదీ ప్రభుత్వం తక్కువ పనితీరు చూపుతున్న రాష్ట్రాలకు ద్రవ్య నష్టాలను నివారించడానికి పనితీరు ఆధారిత బదిలీలు లేదా ప్రత్యేక ప్యాకేజీలను ప్రవేశపెట్టాలి. ఇంకా, గణాంక ఆధారిత విధాన రూపకల్పనకు మద్దతుగా, రేటువారీ జిఎస్‌టి డేటా సేకరణను పటిష్టం చేయాలి. డేటా లేకుండా సంస్కరణ ఒక ద్రవ్య అంధకారం లాంటిది. గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ సిఫార్సులను పరిశీలించడానికి ఎనిమిది నెలలుగా నిద్రాణంగా ఉన్న జిఎస్‌టి కౌన్సిల్, సమావేశం కానుంది. పండుగ సీజన్ కోసం ఒక సంచలనాత్మక సంస్కరణను ముందుకు తీసుకువెళ్లాలనే ఆశ ఉంటుంది.

కానీ, కౌన్సిల్ పెద్ద సవాలును ఎదుర్కొంటోంది. ఎనిమిది సంవత్సరాల అల్లకల్లోలాల ద్వారా జిఎస్‌టిని నిలబెట్టిన కేంద్రం–రాష్ట్రాల మధ్య ఉన్న సున్నితమైన ఏకాభిప్రాయాన్ని కాపాడటం. చాలా వేగంగా ముందుకు వెళ్తే, ఆ ఏకాభిప్రాయం విచ్ఛిన్నం కావచ్చు, ఆదాయ పంపిణీ, పరిహారంపై వివాదాలకు దారి తీయవచ్చు. జిఎస్‌టి హేతుబద్ధీకరణ మోదీ తదుపరి పెద్ద ఆర్థిక ముద్ర కావచ్చు లేదా ఆయన తదుపరి పెద్ద విధానపరమైన తలనొప్పి కావొచ్చు. దీనిని సరిగ్గా చేస్తే, నిబంధనలను సులభతరం చేస్తుంది, వినియోగదారు ధరలను తగ్గిస్తుంది, ఇంకా భారత పరిశ్రమను మరింత పటిష్టం చేస్తుంది. తప్పుగా చేస్తే, ఇది ఆదాయాలను తగ్గించవచ్చు, రాష్ట్ర అసమానతలను పెంచుతుంది, ఇంకా ఆర్థిక వ్యవస్థను నెమ్మది వృద్ధి చక్రంలో బంధించవచ్చు. దాని ప్రస్తుత రూపంలో, జూలై డేటా ఒక విషయాన్ని స్పష్టం చేస్తుంది. జిఎస్‌టి సంస్కరణ అనేది ‘సులభ జీవనం’ గురించి కంటే, భారతదేశం ఆర్థిక సమాఖ్య వ్యవస్థ స్థితిస్థాపకతను పరీక్షించడం గురించి ఎక్కువ ఉంటుంది. దీనిని తప్పుగా చేస్తే రాజకీయ ఇబ్బందులు మాత్రమే కాదు, అది కుంటుపడిన వృద్ధి, పెరిగిన అసమానతలకు, ఇంకా భారతదేశం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పరోక్ష పన్ను ప్రయోగాలలో ఒకటి విఫలమైందని చెప్పుకోబడుతుంది.

(ఐపిఎ సర్వీస్)

# సూటి ప్రశ్నలకు అసంపూర్ణ, అసంబద్ధ సమాధానాలు

## ఎన్నికల సంఘం విశ్వసనీయతపై తొలగని అనుమానాలు

భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) యొక్క నిష్పాక్షికత మరియు విశ్వసనీయతపై ఇటీవలి వివాదం దేశ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఎన్నికల సంఘంపై లేవనెత్తిన ఐదు ప్రశ్నలు, దానికి ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఇచ్చిన సమాధానాలు, ఈ సమాధానాలపై విపక్షాలు, మీడియా నుంచి వచ్చిన విమర్శలు ఈ సంస్థ యొక్క పారదర్శకతను ప్రశ్నార్థకం చేశాయి.

రాహుల్ గాంధీ ఆగస్టు 8, 2025న ఎక్స్ వేదికగా ఎన్నికల సంఘానికి ఐదు ప్రశ్నలు సంధించారు: 1) డిజిటల్ ఓటర్ జాబితాను ఎందుకు దాచిపెడుతున్నారు? 2) సీసీటీవీ ఫుటేజీని ఎందుకు తొలగిస్తున్నారు? 3) నకిలీ ఓటర్ల నమోదును ఎందుకు అడ్డుకోలేకపోతున్నారు? 4) విపక్ష నాయకులను ఎందుకు భయపెడుతున్నారు? 5) ఎన్నికల సంఘం బీజేపీ ఏజెంట్‌గా మారిందా? ఈ ప్రశ్నలు ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, నిష్పాక్షికతపై బలమైన అనుమానాలను లేవనెత్తాయి. రాహుల్ ఆరోపణలు 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఓట్ల చోరీ, బీజేపీకి అనుకూలంగా ఇసి వ్యవహరించిందన్న వాదనలపై ఆధారపడ్డాయి. బిహార్, హర్యానా, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో నకిలీ ఓటర్లు, అసాధారణ ఫలితాలను ఆయన ఉదాహరణలుగా పేర్కొన్నారు. ఈ ఆరోపణలకు స్పందిస్తూ, ఎన్నికల సంఘం చీఫ్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఆగస్టు 17, 2025న ఢిల్లీలో పత్రికా సమావేశం నిర్వహించారు. రాహుల్ గాంధీ ఆరోపణలను అసంబద్ధంగా తోసిపుచ్చిన ఆయన, ఓటర్ల జాబితాలో అవకతవకలపై అనవసర అనుమానాలు రేకెత్తిస్తున్నారని విమర్శించారు. సీసీటీవీ ఫుటేజీని బహిర్గతం చేయడం వ్యక్తుల ప్రైవసీకి భంగం కలిగిస్తుందని, అందుకే అది సాధ్యం కాదని ఆయన మొండిగా వాదించారు. సీసీ ఫుటేజీ పబ్లిక్ డాక్యుమెంట్ అందులో ఓటర్ల మొఖాలు కనపడతాయి. ఇందులో అసభ్యత, దాపరికం ఏముంది? ఓటర్ పోలింగ్ బూత్‌లో ఓటు వేశాడా? లేదా? అనే నిర్ధారణ మాత్రమే జరుగుతుంది. అది ఇవ్వటానికి అభ్యంతరం ఎందుకో అర్థం కాదు. అంతేకాక, రాహుల్ తన ఆరోపణలకు అఫిడవిట్ సమర్పించాలని, లేకపోతే క్షమాపణ చెప్పాలని జ్ఞానేశ్ కుమార్ డిమాండ్ చేశారు. ఏడు రోజుల్లో అఫిడవిట్ రాకపోతే ఆరోపణలను నిరాధారంగా పరిగణిస్తామని హెచ్చరించారు. జ్ఞానేశ్ కుమార్ సమాధానాలు విపక్ష నాయకుల నుండి, మీడియాలో తీవ్ర విమర్శలను రేకెత్తించాయి. విపక్ష నాయకులు ఇసి సమావేశాన్ని రాజకీయ ప్రసంగంగా, బీజేపీ అజెండాకు అనుగుణంగా జరిగినట్లుగా అభివర్ణించారు. రాహుల్ ప్రశ్నలకు సరైన సమాధానం సూటిగా ఇవ్వకుండా, ఇసి రక్షణాత్మక డొంకతిరుగుడు వైఖరిని అవలంభించిందని, తన దగ్గర సమాధానాలు లేవు అన్నట్లు, తనకు జవాబు చెప్పాల్సిన అవసరం లేనట్లు జ్ఞానేశ్ కుమార్ నిర్లక్ష్యంగా వ్యవహరించిన తీరు విస్మయం కలిగిస్తోందని వారు అన్నారు. రాహుల్ బహిరంగంగా సూటిగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎన్నికల సంఘంపై స్పష్టమైన ఆధారాల సహితంగా లోపాలు ఎత్తి చూపించారు. ఆ వీడియోను కోట్లాది మంది ప్రజలు చూశారు. విపక్షాలు ఇప్పటికే ఇసికి 18 వేల అఫిడవిట్లు కూడా ఇచ్చామని చెపుతున్నాయి. వాటిని ఎన్నికల సంఘం కనీసంగా నైనా పరిశీలించలేదు. తిరిగి రాహుల్ గాంధీ అఫిడవిట్ లిఖిత పూర్వ




కంగా ఇవ్వాలి అనడంలో అర్థం లేదు. అఫిడవిట్ ఇస్తేనే ... అప్పుడే ఆ ఆరోపణలపై విచారణ చేపడతాం అనడం ఇసి కమీషనర్ బాధ్యతా రాహిత్యంగా కనపడుతుంది. పైగా ఇసి కమీషనర్ జ్ఞానేశ్ కుమార్ ఫక్త్ బీజేపీ ప్రతినిధిలా వ్యవహరించటం ఎన్నికల సంఘం ప్రతిష్టకు కళంకమే..అని విమర్శలు వచ్చాయి. కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ, అసలు విపక్షాలు లేవనెత్తిన ఆరోపణలపై ఇసి దర్యాప్తు చేయకుండా రాహుల్‌పై తప్పుడు ఆరోపణలు చేయటం ఏమిటీ? రాహుల్‌ను, విపక్షాలను అకారణంగా నిందించడం అన్యాయమని విమర్శించారు. ఈ వివాదంలో రాహుల్ గాంధీ ఆరోపణలు సూటిగా ఆధార సహితంగా ఉన్నప్పటికీ, ఇసి స్పందనలోని లోపాలు కొట్టొచ్చినట్లు కనిపించాయి. డిజిటల్ ఓటర్ జాబితా, సీసీటీవీ ఫుటేజీ వంటి సాంకేతిక విషయాలపై స్పష్టమైన వివరణ ఇవ్వకుండా, అఫిడవిట్ డిమాండ్ చేయడం ఇసి యొక్క బాధ్యతా రాహిత్యాన్ని సూచిస్తుంది. ఓటర్ జాబితాలో అవకతవకలు, నకిలీ ఓటర్ల సమస్యలను ఇసి తీవ్రంగా పరిగణించకపోవడం ప్రజాస్వామ్య ప్రక్రియపై అనుమానాలను మరింత బలపరిచింది. బీజేపీతో ఇసి సన్నిహిత సంబంధాల ఆరోపణలు, జ్ఞానేశ్ కుమార్ యొక్క రాజకీయ ధోరణి సూచించే ప్రసంగం ఈ అనుమానాలను రెట్టింపు చేశాయి. ఇసి యొక్క విశ్వసనీయత దెబ్బతినడం భారత ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమైన సంకేతం. ఓటర్ల ఆమోదం, పారదర్శకత లేని ఎన్నికల ప్రక్రియ ప్రజాస్వామ్య విలువలను బలహీనపరుస్తుంది. రాహుల్ గాంధీ ఆరోపణలను పూర్తిగా తోసిపుచ్చకుండా, సమగ్ర దర్యాప్తు ద్వారా వాటిని పరిశీలించి, స్పష్టమైన నివేదికలను బహిర్గతం చేయడం ఇసి బాధ్యత. అయితే, జ్ఞానేశ్ కుమార్ యొక్క రక్షణాత్మక వైఖరి, విపక్ష నాయకులను బెదిరించే ధోరణి ఇసి స్వతంత్రతపై ప్రశ్నలను లేవనెత్తాయి. మీడియా విమర్శలు ఇసి స్పందనలోని లోపాలను మరింత స్పష్టం చేశాయి. ఇసి యొక్క పత్రికా సమావేశం అసంబద్ధం మరియు రాజకీయ ధోరణి కలిగినదిగా అభివర్ణించబడింది. ఇసి యొక్క స్వతంత్రతను పరిరక్షించడం కోసం, ఆరోపణలను తిరస్కరించడం కంటే, వాటిని సమగ్రంగా దర్యాప్తు చేసి, ఓటర్లలో విశ్వాసం పెంచే చర్యలు తీసుకోవాలి. రాహుల్ గాంధీ ఆరోపణలు రాజకీయ ఉద్దేశంతో చేసి ఉండవచ్చు, కానీ అవి లేవనెత్తిన ప్రశ్నలు ప్రజాస్వామ్య ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం యొక్క ప్రాముఖ్యతను గుర్తు చేస్తాయి. ఈ వివాదం భారత ఎన్నికల వ్యవస్థలో సమూల సంస్కరణల అవసరాన్ని ఎత్తి చూపుతుంది. ఓటర్ జాబితాల సమగ్రత, సీసీటీవీ ఫుటేజీ లభ్యత, ఎన్నికల అధికారుల నిష్పాక్షికత వంటి అంశాలపై స్పష్టమైన విధానాలు రూపొందించాలి. ఇసి యొక్క స్వతంత్రతను పరిరక్షించడం ద్వారా మాత్రమే ప్రజాస్వామ్యంపై ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టగలం.

చివరిగా... రాహుల్ గాంధీ ఆరోపణలు, జ్ఞానేశ్ కుమార్ సమాధానాలు, మరియు విపక్షాలు, మీడియా నుంచి వచ్చిన విమర్శలు ఎన్నికల సంఘం యొక్క విశ్వసనీయతలో సంక్షోభాన్ని సూచిస్తున్నాయి. ఇసి ఈ సవాళ్లను దర్యాప్తు ద్వారా పరిష్కరించి, పారదర్శకతను పెంచే చర్యలు తీసుకోవాలి. లేకపోతే, ప్రజాస్వామ్య ప్రక్రియపై ప్రజల విశ్వాసం మరింత దెబ్బతినే ప్రమాదం ఉంది.

– డాక్టర్.కోలాహలం రామ్‌కిశోర్
9849328496

# మానవత్వం: మనిషిలోని మహోన్నత గుణం

మానవత్వం అంటే కేవలం మనుషులుగా జీవించడం మాత్రమే కాదు, మనిషిగా జీవించేందుకు అవసరమైన ఉన్నతమైన గుణాలను పెంపొందించుకోవడం. ఇది ఒక వ్యక్తిలోని కరుణ, దయ, ప్రేమ, సహనం, సానుభూతి వంటి సద్గుణాల సమ్మేళనం. ఒక సమాజం లేదా దేశం అభివృద్ధి చెందడానికి ఆర్థిక వనరులు ఎంత ముఖ్యమో, మనుషులు మానవత్వంతో జీవించడం అంతే ముఖ్యం. మానవత్వం లేని సమాజం కేవలం స్వార్థంతో నిండి, చిన్నాభిన్నం అవుతుంది. మన భారతీయ సంస్కృతి ‘వసుధైక కుటుంబకం’ అనే గొప్ప సూత్రాన్ని బోధిస్తుంది, అంటే ఈ ప్రపంచం మొత్తం ఒకే కుటుంబం అని. ఈ సూత్రం మానవత్వం యొక్క సారానికి ఒక చక్కని ఉదాహరణ. మానవత్వం మనిషిని కేవలం ఒక జీవిగా కాకుండా, ఆలోచనలు, భావాలు కలిగిన ఒక మహోన్నత శక్తిగా మారుస్తుంది. ఇది మన సమాజ నిర్మాణానికి పునాదిగా పనిచేస్తుంది. మానవత్వం ఉన్న చోట ప్రజల మధ్య ప్రేమ, నమ్మకం, సహకారం పెరుగుతాయి. ఇది ఒకరి కొకరు సహాయం చేసుకునే సంస్కృతిని ప్రోత్సహిస్తుంది, తద్వారా బలమైన సురక్షితమైన సమాజం ఏర్పడుతుంది. మానవత్వం కేవలం సమాజాన్ని మాత్రమే కాదు, ఒక వ్యక్తి అంతర్గత ఎదుగుదలకు కూడా సహాయపడుతుంది. ఇది ఒక వ్యక్తిని స్వార్థం నుండి దూరం చేసి, ఇతరుల పట్ల ప్రేమను పెంచుతుంది. ఇతరులకు సహాయం చేసినప్పుడు కలిగే ఆనందం, ఆత్మసంతృప్తి అంతర్గత శాంతి అమూల్యమైనవి.

ఉదాహరణకు, మన చుట్టూ ఉన్న అనేక సంఘటనలను గమనించండి. ఒక రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు, వెంటనే స్పందించి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించే వ్యక్తిలో కనిపించేది మానవత్వమే. వరదలు, భూకంపాలు వంటి ప్రకృతి విపత్తుల సమయంలో తమ ప్రాణాలను పణంగా పెట్టి ఇతరులను కాపాడేవారు, నిరాశ్రయులకు ఆహారం, ఆశ్రయం కల్పించేవారు మానవత్వానికి నిలువుటద్దాలు. ఇటువంటి సంఘటనలు మనుషుల మధ్య నమ్మకాన్ని పెంచి, సమాజాన్ని మరింత దృఢంగా మారుస్తాయి. అంతేకాకుండా, ప్రపంచంలో శాంతిని నెలకొల్పడానికి మానవత్వం అత్యంత అవశ్యకం. మానవత్వం అహింస, క్షమ అనే సూత్రాలను బోధిస్తుంది. ఈ గుణాలు యుద్ధాలు, కలహాలు, విద్వేషాలను తగ్గించి, ప్రపంచ దేశాల మధ్య సఖ్యతను పెంపొందించగలవు. ప్రాచీన కాలం నుండి ఆధునిక కాలం వరకు, గొప్ప నాయకులు, తత్వవేత్తలు మానవత్వ గొప్పతనాన్ని చాటి చెప్పారు. మహాత్మాగాంధీ అహింసా సిద్ధాంతం, మదర్‌థెరిస్సా నిస్వార్థ సేవ, నెల్సన్ మండేలా క్షమాగుణం మానవత్వ శక్తికి నిదర్శనాలు.

### మానవత్వ ముఖ్య లక్షణాలు:

మానవత్వం అనే విస్తృతమైన భావనను మనం కొన్ని ప్రధాన లక్షణాల ద్వారా మరింత లోతుగా అర్థం చేసుకోవచ్చు. కరుణ, సానుభూతి అనేవి మానవత్వానికి మూలస్తంభాలు. కరుణ అంటే ఇతరుల బాధను అర్థం చేసుకొని, వారి స్థానంలో మనల్ని మనం ఊహించుకోవడం. ఒక పేదవాడి ఆకలిని, ఒక రోగి బాధను, లేదా ఒక నిస్సహాయుడి నిరాశను మనసుతో అనుభవించడమే కరుణ. ఈ కరుణ అనే భావనను ఆచరణలో పెట్టడమే సానుభూతి. కరుణ కలిగిన వ్యక్తి సహాయం చేయకుండా ఉండలేడు. ఇది కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదు. ఒకరికి మాట సాయం చేయడం, ధైర్యం చెప్పడం, లేదా ఒక చిన్న పనిలో తోడుగా ఉండటం కూడా సహాయమే. ఉదాహరణకు, బస్సులో ఒక వృద్ధుడికి సీటు ఇవ్వడం, బరువు మోస్తున్న వ్యక్తికి సహాయం చేయడం, లేదా దారి తప్పిన చిన్నారిని తల్లిదండ్రులకు చేర్చడం వంటి సంఘటనలు చిన్నవిగా అనిపించినా, వాటిలో మానవత్వం యొక్క గొప్పతనం దాగి ఉంటుంది. అలాగే, సహనం, గౌరవం మానవత్వంలో అంతర్భాగం. ప్రపంచం భిన్నత్వంతో కూడుకుని ఉంది. మనకు నచ్చని అభిప్రాయాలను కూడా గౌరవంగా స్వీకరించగలగడం గొప్ప మానవత్వ లక్షణం. భిన్నత్వంలో ఏకత్వాన్ని చూడగలిగే గుణం ఇది. ఇక, ఎవరైనా మనకు హాని చేసినప్పుడు వారిపై పగ సాధించడం కంటే, వారిని క్షమించడం గొప్ప మానవత్వం. క్షమ అనేది మనసును తేలికపరిచే ఒక శక్తి. ఇది మనకు మానసిక ప్రశాంతతను ఇస్తుంది. చివరగా, సమానత్వం అనేది మానవత్వంలో ఒక ముఖ్యమైన భాగం. మానవత్వం అందరినీ సమానంగా చూడాలని బోధిస్తుంది. కులం, మతం, రంగు, లింగం, ధనవంతుడుపేదవాడు వంటి భేదాలు లేకుండా ప్రతి ఒక్కరిని గౌరవించాలి. ప్రతి మనిషికి గౌరవంగా జీవించే హక్కు ఉంది.

### జీవితంలో మానవత్వాన్ని పెంపొందించుకోవడం

మానవత్వం అనేది కేవలం పెద్ద పెద్ద త్యాగాలు చేయడం ద్వారానే వ్యక్తమవుతుంది అనుకోవడం తప్పు. మన రోజువారీ జీవితంలో చిన్న చిన్న పనుల ద్వారా కూడా మానవత్వాన్ని ప్రదర్శించవచ్చు. ఉదాహరణకు, నిస్సహాయంగా ఉన్న జంతువులకు సహాయం చేయడం, పొరుగువారికి ఏదైనా చిన్న పనిలో తోడుగా ఉండటం, లేదా కష్టాల్లో ఉన్న స్నేహితుడిని పలకరించి ధైర్యం చెప్పడం వంటివి మనలో మానవత్వాన్ని పెంచుతాయి. రోడ్డుపై కూరగాయలు అమ్ముకునే వృద్ధురాలిని పలకరించి, ఆమెకు సహాయం చేయడం, లేదా వర్షంలో తడుస్తున్న వీధి కుక్కకు ఆశ్రయం కల్పించడం వంటివి చిన్న పనులే అయినా, వాటిలో గొప్ప మానవత్వం దాగి ఉంది. ఇతరులతో మాట్లాడేటప్పుడు మర్యాదగా, గౌరవంగా ప్రవర్తించడం, ఒక చిన్న చిరునవ్వు కూడా ఇతరుల మనసును సంతోషపెడుతుంది. ఇతరుల తప్పులను విమర్శించడం కంటే, వారిని అంగీకరించడం, ప్రోత్సహించడం మానవత్వమే. మానవత్వం ఒక వ్యక్తిలోని నైతిక బలాన్ని, ఉన్నతమైన గుణాలను సూచిస్తుంది. ఎందుకంటే, మనిషి మనిషిగా జీవించడానికి తోడ్పడేది మనలో ఉండే మానవత్వం మాత్రమే. మానవత్వం అనేది మనం నేర్చుకోవాల్సిన ఒక పాఠం కాదు, మన జీవితంలో భాగం చేసుకోవాల్సిన ఒక అలవాటు.

– జనక మోహన రావు దుంగ
8247045230

# వయోవృద్ధుల ముఖాల్లో చిరునవ్వులు చూడలేమా!

(నేడు జాతీయ సీనియర్ సిటిజన్స్ దినోత్సవం...)

భారతదేశంలో 60 ఏండ్లు లేదా ఆ పైన వయస్సు కలిగిన ప్రజలను సీనియర్ సిటిజెన్స్ లేదా వయోవృద్ధులుగా వర్గీకరిస్తాం. భారత్‌లో పన్నుల విభాగం నిర్వచనం ప్రకారం, 60 నుంచి 79 ఏండ్ల వయ స్సు ఉన్న వారిని సీనియర్ సిటిజన్స్ అని, 80 ఏండ్లు లేదా ఆపైన వయస్సు కలిగిన వీరిని సూపర్ సీనియర్ సిటిజెన్స్ అని పిలుస్తాం. నిన్నటి కాలంలో హీరోలు, పౌర సమాజానికి నాయకత్వం వహించిన వారు, అపార అనుభవాల పుట్టలు, వివేకవంతులు, నేటి యువతకు సరైన మార్గనిర్దేశకులు అయిన సీనియర్ సిటిజెన్స్ ప్రాధాన్యాన్ని గుర్తించిన అమెరికా పూర్వ అధ్యక్షులు రొనాల్ రీగన్ చొరవతో ప్రతి ఏటా ఆగస్టు 21న జాతీయ సీనియర్ సిటిజెన్స్ దినోత్సవం (నేషనల్ సీనియర్ సిటిజెన్స్ డే)ను పాటించడం 1988 నుంచి ఆనవాయితీగా మారింది. కుటుంబ సభ్యులు, స్నేహితులు, సంస్థలు, పౌర సమాజం వయో వృద్ధులను తగు రీతిలో గౌరవంగా చూసుకోవడంతో పాటు వారు నిర్వహించిన పాత్రను తగు రీతిలో గుర్తు చేసుకుంటూ, వారి అభిప్రాయాలకు విలువను ఇస్తూ, వారి శ్రేయస్సుకు ప్రాధాన్యం ఇస్తూ, వారికి కృతజ్ఞతలను వ్యక్తం చేస్తూ, వారి హక్కులను గౌరవిస్తూ పలు కార్యక్రమాలను నిర్వహించడం ఈ దినోత్సవ ప్రత్యేకతగా గమనించాలి. 1988లో అమెరికాలో ప్రారంభమైన జాతీయ సీనియర్ సిటిజెన్స్ దినం ప్రాధాన్యాన్ని గుర్తించిన ఐరాస కూడా ఈ దినోత్సవాన్ని జరుపుకోవాలని ప్రపంచ దేశాలకు విజ్ఞప్తులు చేయడం జరుగుతున్నది. వయో వృద్ధులు నేటి సమాజ పునాది రాళ్లు అని గమనించి వారిని సముచితంగా గౌరవించుకోవడం, వారి సేవలకు కృతజ్ఞతలు తెలియజేయడం, వారి సమ్మిళిత అభివృద్ధికి బాటలు వేయడం కొనసాగుతూనే ఉండాలని ఐరాస సూచిస్తున్నది. జాతీయ సీనియర్ సిటిజెన్స్ దినోత్సవం 2035 ఇతివృత్తంగా సమ్మిళిత భవిష్యత్తుకు వయోవృద్ధుల గళాలను బలోపేతం చేయడం అనే అంశాన్ని తీసుకొని అవగాహన కలిపించడం జరుగుతున్నది. పథక రచనలు, పౌర సమాజ సమస్యలు, కుటుంబ ఇబ్బందులకు పరిష్కారాలు ఇవ్వడంలో సీనియర్ సిటిజెన్స్ అభిప్రాయాలను ఆచరణలో పెట్టాలని నేటి తరం గుర్తుంచుకోవాలి. వయోవృద్ధులకు ప్రాధాన్యం ఇస్తూనే వారి విజయ గాథలను ప్రచారం చేయడం, వారి సూచనలు పాటించడం జరిగిన నాడు సమాజంలో శాంతి నెలకొంటుందని మరువరాదు. మనల్ని కంటికి రెప్పలా పెంచి మంచి స్థాయిని కల్పించి, తమ సంపాదనను మన ఎదుగుదలకు నీళ్ల వలె ఖర్చు చేసిన వయో వృద్ధులను గుండెలో పెట్టుకొని చూసుకోవడం మన కనీస కర్తవ్యం. వయో వృద్ధులు సజీవ గ్రంథాలయాలు, అపార వివేక నిఘంటువులు. నిన్నటి రోజుల్లో నేటి వయో వృద్ధులు చేసిన అద్వితీయ సేవలను గుర్తు చేసుకుంటూ, మన ఎదుగుదలకు వారి సలహాలను మెట్లు తీసుకుంటూ, వారితో కలిసి కుటుంబం సంతోషంగా సాగిపోవడమే మన ముందున్నా ఏకైక మార్గం అని మరువరాదు. నేటి యువత కూడా రేపటి వయో వృద్ధులని గుర్తుంచుకోవాలి. నేటి తరం యువత ఎగరడానికి వయోవృద్ధుల అనుభవాలను రెక్కలుగా మార్చుకోవాలి. వయోభేదం మరిచి సమ్మిళిత పౌర సమాజ స్థాపనకు కృషి జరగాలి.

– బిఎంఆర్
9949700037

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి : కలెక్టర్

**ప్రజాపక్షం/మోటకొండూరు :** ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు అందరూ ఇండ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మండలంలోని కాటేపల్లిలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చెసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులంతా తమ ఇంటి నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేసుకుని బిల్లులు పొందాలని సూచించారు. మండల ప్రత్యేక అధికారి, ఎంపీడీవో ఇందిర, పంచాయతీ కార్యదర్శి మల్లేష్, ఏఈ హౌసింగ్ రవిచంద్ర, ఫీల్డ్ అసిస్టెంట్ ఉపేంద్ర పాల్గొన్నారు.



## ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు

**ప్రజాపక్షం/దేవరకొండ :** సినిమా థియేటర్లలో ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తగా అన్ని ఏర్పాట్లు ఉండేలా యాజమాన్యం చూడాలని నిబంధనలు మేరకు ఫైర్ సేఫ్టీ ప్రమాదం జరిగే ముందు హెచ్చరిక సంబంధించిన సైరన్లు ఉండేలా ఎప్పటికప్పుడు యాజమాన్యం అలర్ట్ గా ఉండాలని దేవరకొండ ఏఎస్పి మౌనిక అన్నారు. బుధవారం పట్టణంలోని మనోజ్ థియేటర్, వెంకటేశ్వర థియేటర్‌లను ఆమె పరిశీలించారు. థియేటర్లలో వసతులు, ప్రేక్షకులకు కావాల్సిన సౌకర్యాలు, సేఫ్టికి సంబంధించిన వాటిని ఆమె పరిశీలించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ వెంకట్‌రెడ్డి, యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.






## ప్రజాపాటకు బహువచనం ప్రజానాట్యమండలి

### సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ

**ప్రజాపక్షం/ రామన్నపేట:** ప్రజాపాటకు బహువచనం ప్రజానాట్యమండలి అని సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ అన్నారు. బుధవారం ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో రామన్నపేట మండల కేంద్రంలో జానపద వీధి నాటకోత్సవాలకు గ్రామీణ వృత్తి కళాకారులు వందల సంఖ్యలో హాజరై స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రదర్శనకు ప్రజానాట్యమండలి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం స్థానిక పాత బస్టాండ్ ఆవరణలో జరిగిన వీధినాటక ఉత్సవాల సభలో మాట్లాడుతూ నాటి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం నుంచి నేటి ప్రజా పోరాటాల వరకు ప్రజానాట్యమండలిది వన్నె తగ్గని పాత్ర అని అన్నారు. రామన్నపేట మండల ప్రాంతంలో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు సుద్దాల హనుమంతు నడయాడారని వారి యాదిలో కళా ప్రదర్శన నిర్వహించడం ఆనందదాయకమన్నారు. ప్రజా పోరాటాలకు ఆయుధం ఇచ్చింది కళారూపాలేనని మాజీ ఎమ్మెల్సీ, ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షుడు చెరుపల్లి సీతారాములు అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి జిల్లా కోఆర్డినేటర్, ప్రజాగాయని వేముల పుష్ప, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కట్టా నరసింహా, మాజీ నాయకులు ఎండి.జహంగీర్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గంటెపాక శివకుమార్, ఈర్లపల్లి ముత్యాలు, దేశపాక రవి, ఆహ్వాన సంఘం అధ్యక్షుడు కూరెళ్ల నరసింహాచారి పాల్గొన్నారు.

## బుద్ధ వనాన్ని కొనియాడిన హ్యూస్టన్ బౌద్ధాచార్యులు

### కృష్ణాతీర బౌద్ధ వారసత్వాన్ని వివరించిన శివనాగిరెడ్డి




**ప్రజాపక్షం/నందికొండ:** నాగార్జునసాగర్ లోని బుద్ధ వనం ప్రాజెక్టు ఒక అద్భుత బౌద్ధ వారసత్వ పర్యాటక స్థావరం అని, అక్కడి కట్టడాలు, శిల్పాలు ఆచార్య నాగార్జున స్ఫూర్తిని ఈ తరానికి తెలియజేస్తున్నయని టెక్సాస్ రాష్ట్రం హ్యూస్టన్ నగరంలోని వియత్నాం బౌద్ధ విహార ప్రధానాచార్యులు థామ్ అన్నారు. బౌద్ధ పరిశోధకుడు, పురావస్తు శాస్త్రవేత్త, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి బుధవారం హ్యూస్టన్ లోని బుద్ధ విహారాన్ని, మూడంతస్తుల పగోడాను, 72 అడుగుల ఖ్యాన్ ఆమ్ బోధిసత్వ విగ్రహాన్ని సందర్శించి, ప్రధాన బౌద్ధ ఆచార్యులను కలిసి కృష్ణా తీర బౌద్ధ వారసత్వ స్థలాలు, బౌద్ధాచార్యులు, నాగార్జునసాగర్ లోని నాగార్జున కొండ,బుద్ధవనం గురించి వివరించి, బుద్ధ వనం కు సంబంధించిన వీడియోను ప్రదర్శించగా థామ్ ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారని తెలిపారు. తాను నాగార్జున కొండను సందర్శించాలని అనుకుంటున్నానని తెలిపారని శివనాగిరెడ్డి తెలిపారు. ఆచార్య నాగార్జునుడి రచనలను బుద్ధవనం ద్వారా ఈ తరానికి తెలియ రెండు తెలుగు రాష్ట్రాలలో ప్రముఖ బౌద్ధ క్షేత్రాలను గురించి, అమరావతి శిల్పకళ ప్రత్యేకత, కృష్ణా తీరం నుంచి శ్రీలంక ద్వారా బౌద్ధం దక్షిణాసియాదేశాలకు చేరిందని వియత్నాం బౌద్ధ ఆచార్యులు వివరించానని శివనాగిరెడ్డి తెలిపారు.

## సాగర్‌కు పెరుగుతున్న వరద ఉధృతి..


### ప్రాజెక్టు గేట్లు ఎత్తు పెంచిన అధికారులు

### మొదటి ప్రమాద హెచ్చరిక జారీ



**ప్రజాపక్షం/నందికొండ:** ఎగువ ప్రాజెక్టులనుంచి శ్రీశైలం కు భారీగా ఇన్ ఫ్లో వస్తున్న నేపథ్యంలో వచ్చిన ఇన్ ఫ్లో వచ్చినట్లే నాగార్జునసాగర్ వైపు విడుదల చేస్తుఉండటంతో సాగర్ ప్రాజెక్టు కు గంట గంటకు వరద పెరిగి పోటెత్తుతుంది దీనితో సాగర్ ప్రాజెక్టు అధికారులు అప్రమత్తమయి ప్రాజెక్టు గేట్ల ఎత్తును పెంచారు. వస్తున్నటువంటి ఇన్ ఫ్లో 5 లక్షల క్యూసెక్కులకు చేరడంతో 20 గేట్లను 13 అడుగులు 6 గేట్లను 10 అడుగుల మేర పైకి లేపి మొత్తం 26 గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. వరద పోటెత్తుతూ ఉండటం సాయంత్రానికి ఈ వరద ఉధృతి 6 లక్షల క్యూసెక్కుల వరకు పెరగవచ్చని ప్రాజెక్టు అధికారులు తెలిపారు దీనితో కృష్ణా నది పరివాహక ప్రాంతాలు అప్రమత్తంగా ఉండాలని ప్రాజెక్టు అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు.సాగర్ ప్రాజెక్టుకు మొత్తం ఇన్ ఫ్లో 485872 క్యూసెక్కులు ఉండగా 478384 క్యూసెక్కు ల నీటిని అవుట్ ఫ్లోగా విడుదల చేస్తున్నారు. ప్రస్తుత రిజర్వాయర్ నీటిమట్టం 590 అడుగులకు 583.70 అడుగులుగా ఉన్నది.

## కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** బీమారం సూర్యాపేట రహదారి నిర్మాణ పనుల్లో అలసత్వం వహిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని మొల్కపట్నం మాజీ ఎంపీటీసీ రెముడాల పరుశురాములు అన్నారు. బుధవారం ఆయన సబ్‌కలెక్టర్ నారాయణ్‌అమిత్‌కు ఫిర్యాదు చేసి మాట్లాడారు. బీమా రం సూర్యాపేట రోడ్డుకు నిధులు మంజూరై పది సంవత్సరాలు అయినా ఇంతవరకు రోడ్డు అసంపూర్తిగా ఉందని తక్షణమే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోని రోడ్డు పూర్తి చేసేలా చూడాలని కోరారు. నిరంతరం వాహనాలు తిరిగే మార్గాన్ని అధికారులు, గత పాలకులు పట్టించుకోలేదని, దీంతో రోడ్డు అసంపూర్తిగా ఉండి ప్రయాణీకులు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే రోడ్డు పనులు పూర్తి చేయాలన్నారు.

# యూరియా పంపిణీకి చర్యలు

### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** జిల్లాకు వచ్చిన 510 మెట్రిక్ టన్నుల యూరియాను అవసరం ఉన్న రైతులకే పంపిణీ చేయాలని, యూరియా పంపిణీలో ప్రభుత్వానికి ఎలాంటి చెడ్డ పేరు రాకుండా చూసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి వ్యవసాయాధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో యూరియాపై ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి మిర్యాలగూడ డివిజన్ పరిధిలోని వ్యవసాయాధికారుతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. మంగళవారం రాత్రి జిల్లాకు 510 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని, ఈ యూరియాను ఆయా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలక అవసరం ఉన్నంత మేరా కేటాయించడం జరిగిందన్నారు. యూరియా సక్రమ పంపిణికి రెవెన్యూ, పోలీస్, వ్యవసాయశాఖల అధికారుల సమన్వయంతో పంపిణి చేయాలని, యూరియా పంపిణిలో ఎలాంటి అక్రమాలు చోటు చేసుకోకూడదని, ప్రభుత్వానికి చెడ్డ పేరు రాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అవసరం లేని రైతులు యూరియాను నిల్వ ఉంచుకోవద్దన్నారు. యూరియా సక్రమ సరఫరాలో భాగంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, ముఖ్యంగా వాడపల్లి చెక్‌పోస్టు వద్ద యూరియా ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌ను ఆదేశించారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా ఎరువుల దుకాణాలను తనిఖీ చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్‌ను ఆదేశించారు. తహసీల్దార్లు సైతం ఎప్పటికప్పుడు ఎరువుల దుకాణాలను, గోదామ్‌లను తనిఖీ చేయాలన్నారు. మిర్యాలగూడ డివిజన్ పరిధిలో మొత్తం 19500 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా ఇప్పటివరకు సుమారు 14వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయడం జరిగిందని జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్ కలెక్టర్‌కు వివరించారు. అదేవిధంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో ఎరువులు ఉండేలా చూడాలని, ఎరువులు రిటైల్ షాపులకు వచ్చిన తరువాత సక్రమ పంపిణికి వ్యవసాయాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏడీఏ సైదానాయక్, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.



## ఎసిబి అధికారులకు చిక్కిన కోదాడ ఫారెస్ట్ ఆఫీసర్



**ప్రజాపక్షం/కోదాడ:** ఎసిబి అధికారుల వలలో ఓ అవినీతి తిమింగలం చిక్కింది. కోదాడ ఫారెస్ట్ బిట్ ఆఫీసర్ అనంతుల వెంకన్న నల్లగొండ రేంజ్ ఎసిబి అధికారులకు చిక్కాడు. ఎసిబి అధికారులు తెలిపిన వివరాల ప్రకారం కలప వ్యాపారికి వ్యాపారం చేసేందుకు 20వేలు డిమాండ్ చేయడంతో బాధితుడు ఎసిబి అధికారులను ఆశ్రయించడంతో, బుధవారం బాధితుడు నుండి 20వేలు తీసుకుని బైక్ ట్యాంక్ కవర్‌లో పెట్టుకొనుచుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు తెలిపారు. కాగా నిందితుడిని నాంపల్లి కోర్టుకు తరలించినట్లు తెలిపారు.

## అధికారుల నిర్లక్ష్యం..

### ఇందిరమ్మ ఇండ్ల బిల్లులురాక లబ్ధిదారులు ఇబ్బందులు

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద గృహాలు నిర్మించిన లబ్ధిదారులు బిల్లులు విడుదల చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే బేస్మెంట్ వరకు నిర్మాణం పూర్తి చేసి 20 రోజులు కావస్తున్న, సంబంధిత ధ్రువపత్రాలు సమర్పించిన అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిధులు అందడంలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం ఇల్లు నిర్మిస్తే బిల్లును తక్షణమే ఇస్తామని హామీ ఇచ్చింది కానీ నెలలు గడిచినా ఇప్పటికే చెల్లింపులు జరగలేదు. అప్పు చేసి ఇల్లు కట్టుకున్న ఇప్పుడు కాంట్రాక్టర్లు, మేస్త్రీలు అడుగుతున్నారు. బిల్లులు రాక మేము తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి లబ్ధిదారులకు బకాయిలు విడుదల చేయాలని కోరుతున్నారు.

**ఎఇ పవన్ కుమార్ వివరణ...** లబ్ధిదారుల వివరాలు కంప్యూటర్లో అప్లోడ్ చేయగా లాగిన్ అవ్వడం లేదని, టెక్నికల్ ప్రాబ్లం ఉందని ఏఈ పవన్ కుమార్‌ను ఫోన్లో సంప్రదించగా ఈ విధమైన సమాధానం ఇచ్చారు.

**ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుడు గడ్డం యాదయ్య..** ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో మా పేరు రావడంతో ఇల్లు నిర్మించుకునేందుకు అన్ని ఏర్పాటు చేసుకొని బేస్మెంటు వరకు నిర్మాణం పూర్తి చేశాం. బేస్మెంట్ పూర్తి చేసి కూడా 20 రోజులు అయినది. బేస్మెంట్ పూర్తయిన వారంలోపు ఒక లక్ష రూపాయల బిల్లు ఇస్తామని అధికారులు తెలిపారు. అయినా ఇంకా కూడా బిల్లు రాలేదనీ ఆవేదన వ్యక్తం చేశాడు.

**ఇందిరమ్మ లబ్ధిదారులకు బిల్లు వెంటనే మంజూరు చేయాలి...సిపిఐ**

ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం ఆదేశాల మేరకు అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలన చేసి వెంటనే బిల్లులు మంజూరు చేయాలని సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిచో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.



# తుంగతుర్తి గర్భిణి మృతి కేసులో ఏడుగురు అరెస్టు

### లింగనిర్ధారణకు ఉపయోగించిన పరికరాలు స్వాధీనం

### డిఎస్‌పి ప్రసన్నకుమార్ వెల్లడి




**ప్రజాపక్షం/సూర్యాపేట :** తుంగతుర్తి మండల కేంద్రంలో ఈనెల 16వ తేదీన అబార్షన్ వికటించి గర్భిణీ మృతి చెందిన కేసులో పోలీసులు 7గురు నింధితులను బుధవారం అరెస్టు చేశారు. లింగనిర్ధారణకు ఉపయోగించిన పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్న కుమార్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మద్దిరాల మండలం గోరంట్ల గ్రామానికి చెందిన బయగల శ్రీను భార్య విజితకు కడుపునొప్పి రావడంతో తుంగతుర్తి మండల కేంద్రంలోని శ్రీసాయిబాలాజీ హాస్పటల్‌కి తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు స్కానింగ్ కూడా నిర్వహించారు. అప్పటికే ఆమెకు ఇద్దరు ఆడపిల్లలు ఉండడంతో పుట్టబోయే శిశువు కూడా ఆడ అని తెలియడంతో అబార్షన్‌కు చేయించుకునేందుకు నిర్ణయించుకున్నారు. హాస్పటల్‌కు చెందిన ఆర్‌ఎంపి డాక్టర్ బండి శ్రీనివాస్‌తో రూ.25వేలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. మరో ఆర్‌ఎంపి డాక్టర్ పానుగంటి సతీష్‌తో కలిసి విజితకు అబార్షన్ చేస్తున్న క్రమంలో వైద్యం వికటించి తీవ్ర రక్తస్రావం జరిగింది. దీంతో ఆమెను ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి హుటాహుటిన తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందగా ఆమె మృతికి కారణంగా తుంగతుర్తి ఆర్‌ఎంపి వైద్యుడు బండి శ్రీనివాస్ కారణమంటూ మృతదేహంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ కేసును తుంగతుర్తి సిఐ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. విజితకు లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన ఖమ్మం జిల్లా కేంద్రంలోని కల్పన క్లినిక్‌లో పనిచేస్తున్న పోలెంపల్లి కల్పనను, తుమ్మచెర్ల గ్రామానికి చెందిన నర్సు అరుణని, స్కానింగ్ చేసిన అశోకుని, లింగ నిర్ధారణ పరీక్ష చేసే స్కానర్ ఏర్పాటు చేసిన నిర్వాహకుడు పులి వీరభద్రరావులను నిందితులుగా గుర్తించారు వీరితోపాటు అబార్షన్ చేసిన బండి శ్రీనివాస్, ఆర్‌ఎంపి, పానుగంటి సతీష్ ఆర్‌ఎంపి, మృతురాలి భర్త బయగల శ్రీను లను కూడా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి ప్రసన్న కుమార్ మాట్లాడుతూ వైద్య చట్టాల ప్రకారం ముందస్తు లింగనిర్ధారణ పరీక్ష నేరము, అర్హత లేకున్నా వైద్యం చేయడం నేరమన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇలాంటి వాటికి సహకరించిన, ప్రేరేపించిన అలాంటి వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి శిక్షలు పడేలా చేస్తామని అన్నారు. ఇలాంటి నేరాలకు ఎవరైనా పాల్పడితే పోలీసు వారికి సమాచారం ఇవ్వాలని డిఎస్‌పి కోరారు. ఈ సమావేశంలో తుంగతుర్తి సిఐ నరసింహారావు, ఎస్సై క్రాంతి కుమార్ పాల్గొన్నారు.



## సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు

### యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**ప్రజాపక్షం/యాదాద్రి :** భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లాలో మూడు రోజుల పాటు పారిశుద్ధ్యం పనులకు మరియు సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉండేందుకు చర్యలు చేపట్టాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జూమ్ మీటింగ్ ద్వారా డివిజనల్ పంచాయతీ అధికారులు, ఎంపీవోలు పంచాయతీ సెక్రటరీలు, వైద్య సిబ్బంది సమన్వయం చేసుకుంటూ ప్రజల ఆరోగ్యాలతో ముడిపడి ఉన్న శానిటేషన్ నిర్వహణలో నిర్లక్ష్యానికి తావు లేకుండా ప్రతి ఒక్కరూ పక్కాగా విధులు నిర్వహించాలన్నారు. మూడు రోజులపాటు అందుబాటులో ఉండి, గ్రామాలలో పారిశుద్ధ్యం పనులు, సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉండడానికి చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాలలో దోమలు వ్యాప్తి చెందకుండా ఉండడానికి ఇప్పటికే సిద్ధంగా ఉన్న ఆయిల్ బాల్స్‌ను వాటర్ నిలిచి ఉన్నచోట వేయాలన్నారు. ట్యాంకులలో వాటర్ నిల్వ ఉన్నచోట ఆ నీటి మొత్తాన్ని పారవేయాలి అన్నారు. ఓహెచ్‌యస్‌ఆర్ ట్యాంకులను నెలలో మూడు సార్లు క్లీన్ చేయాలన్నారు. ట్యాంకులను బ్లీచింగ్, క్లోరినేషన్‌తో క్లీన్ చేసి కొత్త నీటిని నింపాలన్నారు. గ్రామాలలో దోమలు వ్యాప్తి చెందకుండా ఉండేందుకు ప్రతి రోజు ఫాగింగ్ చేయించాలన్నారు. వైద్య సిబ్బంది మెడికల్ క్యాంపు నిర్వహించి గ్రామాల్లో డెంగ్యూ, మలేరియా, ఇతర సీజనల్ వ్యాధులు, విష జ్వరాలు ప్రబలకుండా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పంచాయతీరాజ్ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ జూమ్ మీటింగ్ లో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులను ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి

### జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** ఇంటరాక్టివ్ డిజిటల్ లెర్నింగ్‌కు దోహదపడేలా విద్యార్థులను ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. గణిత, భౌతిక శాస్త్రం, జీవశాస్త్ర కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్‌లకు టిఎస్ఎంఎస్ ఇమాంపేట నందు నిర్వహించబడిన కెపాసిటి బిల్డింగ్ ప్రోగ్రాం ఆన్ లెర్నింగ్ అవుట్ కమ్స్ మీద నిర్వహించబడిన శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా సందర్శించి మాట్లాడారు. మన జిలాల్లో గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెరిగాయని ఇదే స్పూర్తితో పని చేస్తూ విద్యార్థులందరూ కనీస సామర్థ్యాలు తప్పక సాధించేలా చూడాలన్నారు. ప్రతి విద్యార్థి 70 శాతం మార్కులపైన సాధించాలని అభ్యసన ఫలితాలను అందిపుచ్చుకొని భవిష్యత్తులో పోటీ పరీక్షలను సమర్థవంతంగా ఎదుర్కొని విజయవంతం కావాలని జిల్లా అధికారులకు, ఉపాధ్యాయులకు దిశా నిర్దేశం చేశారు. మోడల్ స్కూల్ విద్యార్థులతో సమావేశమై గత సంవత్సర ఎస్ఎస్‌సి, ఇంటర్ ఫలితాలలో విజయం సాధించి నగదు బహుమతి పొందిన విద్యార్థులను అభినందించారు. ఈ సంవత్సరం కూడా ఎస్ఎస్‌సి, ఇంటర్ విద్యార్థులు గత సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా ఉత్తమ ఫలితాలు సాధించాలని ఈ రీతిగా విద్యార్థులకు తగిన శిక్షణ ఇవ్వాలని ఉపాధ్యాయులకు తెలిపి మోడల్ స్కూల్‌ను జిల్లా రాష్ట్ర స్థాయిలో ఉన్నత స్థాయికి తీసుకెళ్లిన ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి కె అశోక్, క్వాలిటీ కోఆర్డినేటర్ డి జనార్ధన్, జిల్లా రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.



# అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు

### జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

### ఎమ్మెల్యే బాలునాయక్



**ప్రజాపక్షం/దేవరకొండ:** జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అర్హులైన జర్నలిస్టులందరికి ఇండ్ల స్థలాలను ప్రజా పాలనలో అందించడం జరుగుతుందని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. బుధవారం దేవరకొండలోని ఎంఎల్‌ఏ క్యాంపు కార్యాలయంలో దేవరకొండ మండల ప్రింట్ మీడియా సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఎల్‌ఏ బాలునాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమం కోసం అర్హులైన జనులకు అక్రిడేషన్ కార్డులు, హెల్త్ కార్డులు, ఇంటి స్థలాలు, జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ విద్యా సంస్థల్లో 50శాతం ఫీజులో రాయితీ ఇస్తూ వారి సంక్షేమం కోసం పనిచేస్తుందని అన్నారు. దేవరకొండ నియోజకవర్గంలోని అర్హులైన జర్నలిస్టులకు ప్రభుత్వం జర్నలిస్టులకు కల్పించిన అర్హతలు జీవో ప్రకారం ఇంటి స్థలాలను ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల్లో జర్నలిస్టులకు ప్రాధాన్యం కల్పిస్తామని అన్నారు. ప్రభుత్వాలకు, ప్రజలకు వారధిగా పని చేస్తున్న జర్నలిస్టులు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్ళేందుకు సహకరించాలని అన్నారు. ప్రజా సమస్యలను ఎలుగెత్తి చూపుతూ పరిష్కార వేదికలుగా పత్రికలు జర్నలిస్టులు ఉండాలని, సమాజంలో విలువలతో కూడిన జర్నలిజాన్ని విలేకరులు చేయాలని అన్నారు. నియోజకవర్గంలో గంజాయి, డ్రగ్స్, బ్లాక్మెయిల్ వంటి చర్యలకు ఎవరూ పాల్పడినా ఉపేక్షించేదిలేదని ఆదిశగా లా అండ్ ఆర్డర్ పని చేస్తుందని అన్నారు. ఈ సమావేశంలో ప్రింట్ మీడియా, దేవరకొండ ప్రెస్‌క్లబ్ గౌరవ అధ్యక్షులు గిరిధర్‌రావు, అధ్యక్షులు కరుణాకర్, ఉపాధ్యక్షులు రామదాసు, సహాయ కార్యదర్శి దర్శనం విష్ణు, ప్రచార కార్యదర్శి అంజన్, కార్యవర్గ సభ్యులు సైదులు, కృష్ణ, వెంకటేష్, ఇలియాస్, గిరిప్రసాద్, ఫయాజ్, మహేష్, లింగం తదితరులు పాల్గొన్నారు.

## వర్షాలు తగ్గే వరకూ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి

### ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** వాతావరణ శాఖ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరికల నేపథ్యంలో భారీ వర్షాలు కురుస్తున్నందున వర్షాలు తగ్గేవరకు నియోజకవర్గ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కోరుతూ విజ్ఞప్తి చేస్తూ భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి మంగళవారం వీడియో ద్వారా ఒక ప్రకటన విడుదల చేశారు. కుండపోత వర్షాల వల్ల కొంతమంది ప్రాణాలు కోల్పోయారని తనకు సమాచారం తెలిసిన వెంటనే ఆవేదన చెందానని ఎట్టి పరిస్థితుల్లో ప్రాణ నష్టం జరగకుండా అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించినట్లు తెలిపారు. ముఖ్యం గా యువకులు ఈతకు వెళ్లొద్దని వరదలు వచ్చినప్పుడు ద్విచక్ర వాహనదారులు దాటవద్దని సరదా కోసం పొంగి పొర్లుతున్నప్పుడు సెల్ఫీలు దిగువద్దని మత్స్యకారులు చెరువుల్లోకి చేపల వేటకు వెళ్లొద్దని వాహనదారులు వరదలు వాగులు వంకలు నదులు పొంగిపొర్లుతున్నప్పుడు ఎట్టి పరిస్థితుల్లో దాటకూడదని ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని సూచించారు. ఏదైనా అత్యవసర సమయాల్లో తనకు ఫోన్ ద్వారా తెలపాలని భువనగిరి నియోజకవర్గ ప్రజలందరికీ ఏ ఆపద వచ్చినా అందుబాటులో ఉంటానని అధికారుల హెచ్చరికలు సూచనలు తప్పకుండా పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/శ్రీరంగాపూర్ :** నేరాల అదుపులకు పటిష్టమైన చర్యలు చేపడుతూ గస్తీ పెట్రోలింగ్ నిర్వహిస్తూ ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పర్యవేక్షించాలని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. శ్రీరంగాపూర్ బుధవారం వనపర్తి జిల్లా పరిధిలోని శ్రీరంగాపూర్ పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీలలో వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ సందర్శించి తనిఖీ చేశారు. ముందుగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించి పోలీస్ స్టేష్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో రికార్డ్స్‌ను, పరిసరాలను తనిఖీ చేసి పోలీస్ స్టేషన్ రిసెప్షన్, లాకప్, మెన్ బ్యారెక్ , టెక్నికల్ రూం, పరిసరాలను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా ఎలాంటి నేరాలు జరుగుతున్నాయి. పెండింగ్‌లో ఉన్న కేసులు, దర్యాప్తు వివరాలను శ్రీరంగాపూర్ ఎస్ఐ రామకృష్ణను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో వార్డుకు పోలీసు అధికారిని కేటాయించి విపిఓ విధానాన్ని పక్కాగా అమలు చేయాలన్నారు. వనపర్తి డిఎస్పీ వెంకటేశ్వరరావు, కొత్తకోట ఇంచార్జి సిఐ నరేష్, శ్రీరంగాపూర్ ఎస్ఐ రామకృష్ణ, పెబ్బేరు ఎస్ఐ యుగంధర్ రెడ్డి, డిసిఆర్బీ ఎస్ఐ తిరుపతి రెడ్డి, పెబ్బేరు రెండవ ఎస్ఐ దివ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పురాతన బావుల సుందరీకరణకు కృషి



**ప్రజాపక్షం/మాగనూర్ :** తెలంగాణలోని పురాతన బావుల కోనేరులు సుందరీకరణ కోసం తాను కృషి చేస్తున్నట్లు హైదరాబాద్‌కు చెందిన ఆర్కిటెక్చర్ కల్పన తెలిపారు. బుధవారం స్థానిక లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం వద్ద ఉన్న కోనేరును సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మంత్రి వాకిటి శ్రీహరి సూచన మేరకు ఇక్కడికి వచ్చి పరిశీలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఆనంద్ గౌడ్, మక్తల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కట్టా సురేష్, రవికుమార్, ఆలయ కమిటీ అధ్యక్షుడు రమేష్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి తిమ్మప్ప, పెద్దలు దేవేంద్రప్ప, ఆలయ పూజారి ప్రభు, తదితరులు పాల్గొన్నారు.



## అలుగు పారుతుండడంతో ఇబ్బందులు

**ప్రజాపక్షం/జడ్చర్ల:** నిన్న మొన్న కురుస్తున్న భారీ వర్షాల వల్ల అలుగు పారుతుండడం వల్ల ఆలూరు గ్రామ ప్రజల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న గ్రామ ప్రజలు దృష్ట రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని కాంగ్రెస్ పార్టీ నాయకులు దృష్టికి తీసుకు వచ్చిన వెంటనే కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులందరూ అధికారులకు ఎమ్మార్వోకి ఆర్ అండ్ బి అధికారులకు సమస్యను తెలియజేసి అక్కడికి ఎమ్మార్వోని తీసుకెళ్లి అక్కడికి ఎమ్మార్వో ని తీసుకువేళ్లి పరిస్థితులను సమీక్షించి ఎమ్మెల్యే కి తెలియజేయడం జరిగింది. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఐదు కిలోమీటర్ల మేర రోడ్డుని వేయించి కొత్తగా అలుగును ఏర్పాటు చేస్తామని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధికారులు ఎమ్మార్వో, గ్రామప్రజలు, తిరుపతయ్య , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ నిత్యానందం , బుక్క వెంకటేశం, సర్పరాజు, మినహాజవుద్దీన్, అనిల్, వంశీకృష్ణ, నరసింహ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జిని పరిశీలించిన డా.జిల్లెల చిన్నారెడ్డి



**ప్రజాపక్షం/శ్రీరంగాపురం :** శ్రీరంగాపురం మండలం జానంపేట గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు వివిధ ప్రమాదాలలో గాయపడిన నాయకులను రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా.జిల్లెల చిన్నారెడ్డి పరామర్శిస్తూ సుడిగాలి పర్యటన చేశారు. గ్రామ రైతుల పిలుపు మేరకు జానంపేట బున్యదిపురం మధ్యలో ఉన్న వాగుపై నిర్మాణంలోనే అసంపూర్తిగా వదిలేసిన పనులను పరిశీలించారు. ప్రభుత్వ ఉన్నతాధికారులతో మాట్లాడి వెంటనే పనులను తిరిగి ప్రారంభిస్తామని రైతులకు హామీనివ్వడం జరిగింది. పంట పొలాలకు రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ పరిస్థితుల్లో ఈ బ్రిడ్జిని ప్రజలకు అందుబాటులోకి తేస్తామని హామీనివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్ , పెబ్బేరు మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాంపురం సహదేవుడు, ఈస్వరయ్య నాయుడు, జానంపేట మహేశ్వర్ రెడ్డి, కృపాకర్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు అక్షయ్ కుమార్, ఇర్ఫాన్, సోషల్ మీడియా పాతపల్లి చంద్రశేఖర్, రోహిత్, శ్రీనివాస్ గౌడ్, భీముడు, కురుమయ్య, ఆనంద్, లోకేష్, వెంకటేష్, సాగర్, ఇమ్రాన్, నర్సింహ యాదవ్, రాజు, కిరణ్ కుమార్, గ్రామ ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

## చివరి శ్వాస వరకు ప్రజాసేవలోనే..

### ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణిక రెడ్డి

**ప్రజాపక్షం/నారాయణపేట :** ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలని మా తాత స్వర్గీయ చిట్టెం నర్సిరెడ్డి, మా తండ్రి స్వర్గీయ చిట్టెం వెంకటేశ్వర్ రెడ్డిల ఆశయ సాధనలో మా వెంట నడిచిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతూ ఈ ప్రాంత అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం చివరి శ్వాస వరకు పనిచేస్తామని నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణిక రెడ్డి, మాజీ డిసిసి అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డిలు అన్నారు. బుధవారం నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్.చిట్టెం పర్ణిక రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని అభినందన్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు , కార్యకర్తలు, అభిమానుల, మధ్య జన్మదిన వేడుకలను ఎమ్మెల్యే ఘనంగా జరుపుకున్నారు. జిల్లా ప్రభుత్వ అధికారులు, వివిధ మండలాల నుండ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఎమ్మెల్యేకు శాలువా పూలమాలలతో సన్మానించే శుభాకాంక్షలు తెలిపారు. మరికల్ మండల నాయకులు సూర్య మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక గజమాలతో ఎమ్మెల్యేను సన్మానించారు. అదేవిధంగా జిల్లా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 30 మంది యువజన కాంగ్రెస్ నాయకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో పేట మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, పట్టణ అధ్యక్షులు ఎండి సలీం, మాజీ మార్కెట్ చైర్మన్ బండి వేణుగోపాల్ సరాఫ్, నాగరాజ్, సుధాకర్, సీనియర్ నాయకులు కోట్ల రవీందర్ రెడ్డి, గందే చంద్రకాంత్, హరి నారాయణ భట్టాడ్, బోయ శరణప్ప, వివిధ మండలాల అధ్యక్షులు కావాలి నరహరి ముదిరాజ్, వీరన్న, సూర్య మోహన్ రెడ్డి, రవీందర్, విద్యాసాగర్ గౌడ్, పిఏసిఎస్ చైర్మన్లు పుట్టి ఇదప్ప, కే.నరసింహారెడ్డి, వెంకట్రామారెడ్డి, ఫిషరీస్ చైర్మన్ కాంత్ కుమార్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుల మధుసూదన్ రెడ్డి, యూసఫ్ తాజ్, అంజి రెడ్డి పాల్గొన్నారు.

# రోగులకు ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన సేవలు

### కలెక్టర్ బదావత్ సంతోష్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** రోగులకు వైద్యసిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి, ఐసియులో రోగులకు అందించే చికిత్సను పరిశీలించారు. ఆస్పత్రి అన్ని విభాగాలను పరిశీలించి వైద్యులతో మాట్లాడారు. ఆస్పత్రిలో సమస్యలుంటే తనదృష్టికి తీసుకురావాలని వైద్యులకు సూచించారు. ఆస్పత్రిలో సిబ్బంది వివరాలు, వైద్యుల వివరాలు తెలుసుకున్నారు. వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, వైరల్ ఫీవర్‌వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, సీజనల్ వ్యాధులతో ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. కలుషితనీరు, ఆహారం, అపరిశుభ్రత, దోమలు, ఈగలు, కీటకాలు, పందులు తదితర జంతువుల ద్వారా సీజనల్ వ్యాధులపై రోగులకు అవగాహన కల్పించాలన్నారు. కలెక్టర్ వెంట జిల్లా ఆస్పత్రి ఆర్‌యంఓ డాక్టర్లు అజీమ్, రోహిత్, ప్రమోద్ ఉన్నారు.

**ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని తనిఖీచేసిన కలెక్టర్**

నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ బుధవారం ఆకస్మికంగా సందర్శించి, సేల్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. రైతులు భూమి ప్రకారమే ఎరువులువాడాలని, అధిక వాడకం వల్ల నేల సాంద్రత దెబ్బ తింటుందని సూచించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగ్రోస్ రైతు సేవ కేంద్రంలో ఏఏ ఎరువులు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. స్టాక్ రిజిస్టర్‌ను చెక్‌చేసి ఇంతవరకు ఎన్ని బస్తాలయూరియా విక్రయించారని చూశారు. రోజువారిగా ఎంతయూరియా విక్రయించారో రిజిస్టర్‌లో తప్పనిసరిగా రాయాలని దుకాణ యజమానికి సూచించారు. యూరియా అమ్మకాలు జరిపే సమయంలో రైతులకు ఉన్నభూమిని బట్టియూరియా అమ్మకాలు చేయాలని సూచించారు. యూరియా అమ్మిన వెంటనే ఈపాస్ మెషిన్‌లో అప్‌డేట్ చేయాలని, బిల్‌బుక్స్, స్టాక్ రిజిస్టర్స్ మెంటైన్ చేయాలని తెలిపారు. కలెక్టర్‌వెంట జిల్లా వ్యవసాయఅధికారి యశ్వంత్ రావు, డివిజన్ వ్యవసాయ అధికారి పూర్ణచందర్‌రెడ్డి ఉన్నారు.

**జనజీవనానికి ఇబ్బందులు రాకుండా చర్యలు**

నాగర్‌కర్నూల్ మండలపరిధిలోని చర్లతిరుమలాపూర్ రోడ్డుపై నిలిచిన వరద నీటిని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ అధికారులతో కలిసి పరిశీలించారు. భారీవర్షాల కారణంగా ఉయ్యాలవాడ నుండి చర్లతిరుమలాపూర్ వెళ్లే రోడ్డు మీదకు వరదనీరు చేరడంతో గ్రామానికిపూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయని పలువురు గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్రస్థాయి అధికారులదృష్టికి సమస్యను తీసుకువెళ్లినట్లు, సమస్య పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకునేందుకు జిల్లా యంత్రాంగం సంసిద్ధంగా ఉందని కలెక్టర్ తెలిపారు. వర్షాల కారణంగా రవాణావ్యవస్థకు ఇబ్బందులు కలగకుండా వెంటనే మరమ్మత్తు చర్యలు చేపడుతామని అన్నారు. వరదప్రభావం ఉన్న ప్రాంతాలను గుర్తించికావాల్సిన జాగ్రత్తలు స్థానిక యంత్రాంగం తీసుకోవాలని లైఫ్‌జాకెట్లు, ఇతర సదుపాయాలన్ని సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. కంట్రోల్‌రూమ్‌ద్వారా వచ్చిన ఫిర్యాదులకు సంబంధించివెంటనే స్పందించి సంబంధిత సిబ్బందికి సమాచారం అందజేసి పరిష్కారం చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి విజయ్, నాగర్‌కర్నూల్ ఆర్‌డిఓ సురేష్‌బాబు, ఇతరశాఖల అధికారులు, గ్రామప్రజలు ఉన్నారు.



# కలిసి పనిచేస్తే భరోసా లక్ష్యాలు విజయవంతం




**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** మహబూబ్‌నగర్ జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్ నందు భరోసా కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ అధికారి ఇందిర ముఖ్య అతిథిగా హాజరై, అందరితో సంభాషిస్తూ భరోసా సెంటర్ల ప్రాధాన్యత, మహిళా బాలల రక్షణలో సమన్వయం అవసరాన్ని వివరించారు. మొదటగా, సమావేశంలో పాల్గొన్న స్టేక్ హోల్డర్లు తమ తమ విధి విధానాలు, అనుభవాలు, సమస్యల పరిష్కార మార్గాలపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ అధికారి ఇందిర మాట్లాడుతూ భరోసా సెంటర్లు మహిళలు, చిన్నారులు, వృద్ధులు వంటి బలహీన వర్గాల రక్షణలో కీలకపాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. సమాజంలో జరిగే హింసాత్మక ఘటనల నివారణ, బాధితులకు న్యాయం అందించడంలో పోలీసు శాఖ, లీగల్ సర్వీసెస్ అథారిటీ, మహిళా, శిశు సంక్షేమ విభాగాలు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ సమావేశంలో భాగంగా అన్ని విభాగాలు కలిసి పనిచేస్తే భరోసా లక్ష్యాలు విజయవంతమవుతాయని, జిల్లా స్థాయిలో సమగ్ర రక్షణ వాతావరణం ఏర్పడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ జరీనా, డియం అండ్ హెచ్ఓ కృష్ణ, అదనపు ఎస్పీ బిఎన్.రత్నం, ఉమెన్ సేఫ్టీ వింగ్ డిఎస్పి రమణా రెడ్డి, సిడబ్ల్యుసి నయీముద్దీన్, డిసిపియు రాములు, పిసిఎస్ఓ కోర్టు పిపి జాన్, వుమెన్ సేఫ్టీ వింగ్ రేంజ్ మేనేజర్ జోసెఫ్, జిల్లా ఇన్స్‌పెక్టర్లు, సర్కిల్ ఇన్స్‌పెక్టర్లు, డబ్ల్యుఎస్ డబ్ల్యు, డబ్ల్యుఎస్ఐ సుధా మాధురి, సఖి సెంటర్ అడ్మిన్ సౌజన్య, చైల్డ్ లైన్ సెంటర్ శివకుమార్, భరోసా ఇంచార్జి ఉమెన్ ఎస్సై సుజాత, ఐటి కోర్ టీం ఇంచార్జి రాఘవేందర్, సహా భరోసా సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

# చెక్‌డ్యామ్ కొట్టుకుపోయినట్లు కెటిఆర్ నిరూపించాలి

### మాజీ మంత్రికి సవాల్ విసిరిన దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** రాచాల వద్ద చెక్ డ్యామ్ కొట్టుకుపోయినట్లు కేటీఆర్ వాస్తవాలు తెలుసుకోకుండా, ప్రభుత్వంపై బురదజల్లే ఉద్దేశంతో తప్పుడు సమాచారాన్ని, అవాస్తవాలను ప్రచారం చేస్తున్నాడని కేటీఆర్‌పై ఎమ్మెల్యే జియంఆర్ మండిపడ్డారు. దమ్ముంటే కేటీఆర్ చెక్ డ్యామ్ కొట్టుకుపోయినట్లు నిరూపించాలని లేనిపక్షంలో ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాచాల వద్ద చెక్ డ్యామ్ తెగిపోలేదని, గతంలో వరద నీటిని మునగల్ చెడ్ చెరువు నింపడానికి గతంలోని ప్రభుత్వం గైడ్‌వాల్‌ను నిర్మించిందని, భారీ వరద ఉధృతికి ఆ సైడ్ వాల్ తెగి పంట పొలాల్లోకి నీరు వెళ్లిందని తెలియజేశారు. సైడ్ వాల్ తెగి పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం తరపున ఆదుకుంటామని ఎమ్మెల్యే జిఎంఆర్ భరోసా ఇచ్చారు. చెక్ డ్యామ్ గురించి వాస్తవాలు పూర్తిగా తెలుసుకోకుండా ఎవడో అనామకుడు ఇచ్చిన సమాచారంతో హైదరాబాద్‌లో కూర్చొని ట్విట్టర్‌లో పెట్టేవాడిని దద్దమ్మ అంటారని కేటీఆర్‌ని ఉద్దేశించి తీవ్రంగా విరుచుకుపడ్డారు. నిన్ననే ఇరిగేషన్ శాఖ ఈఈ రాచాల వద్ద చెక్ డ్యాంను పరిశీలించి, వరద ఉధృతితో చెక్ డ్యామ్‌కు ఎలాంటి ముప్పు వాటిల్లలేదని, చెక్ డ్యామ్ చెక్కు చెదరకుండా ఉందని రిపోర్టు ఇచ్చారని, అధికారులు ఇచ్చిన నివేదికను పక్కన పెట్టి చెక్‌డ్యామ్ కూలినట్టు ట్విట్టర్‌లో తప్పుడు ప్రచారం చేస్తు కేటీఆర్ శునకానందం పొందుతున్నాడని మండిపడ్డారు.

**శాస్త్ర, సాంకేతిక రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చిన రాజీవ్‌గాంధీ**

దేశంలో కంప్యూటర్ యుగానికి నాంది పలికి శాస్త్ర, సాంకేతిక రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ అని డీసీసీ అధ్యక్షులు, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. జిల్లా



కేంద్రంలో బుధవారం రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే ఇతర నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నర్సింహారెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, డిసిసి ఉపాధ్యక్షులు చంద్రకుమార్ గౌడ్, మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వసంత, సిరాజ్ ఖాద్రీ, జహీర్ అఖ్తర్, సాయిబాబా, అజ్మత్‌అలీ, రాములు యాదవ్, గంజి ఆంజనేయులు, పీర్ సాధిక్, ఆవేజ్, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

**యువతకు స్ఫూర్తి ప్రదాత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ**

జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ తదితర నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్, మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి క్రీడలకు క్రీడాకారిణులు ఎంపిక

**ప్రజాపక్షం/మక్తల్ :** ఉట్కూరు మండలం బిజ్వార్ గ్రామంలో గత ఏప్రిల్ 25 నుండి 27 వరకు జరిగిన తెలంగాణ రాష్ట్ర స్థాయి 44వ సబ్ జూనియర్ షూటింగ్ బాల్ బాలబాలికల ఛాంపియన్ షిప్ పోటీలలో నారాయణపేట జిల్లా బాలికల జట్టులో ఆర్.కళ్యాణి, కె.హేమలత, జి.దివ్య, ఎం.ప్రవీణ, సి.జ్యోతి, ఎస్.నవ్య శ్రీ, 6 మంది క్రీడాకారిణులు పాల్గొని, అసమాన క్రీడా నైపుణ్యతను ప్రదర్శించి, 44వ జాతీయస్థాయి సబ్ జూనియర్ షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికై, తెలంగాణ షూటింగ్ బాల్ బాలికల జట్టులో స్థానం సంపాదించి, ఈనెల 22 నుండి 24 వరకు బీహార్ రాష్ట్రం బుద్ధగయ కాలచక్రం స్టేడియంలో జరుగు జాతీయ స్థాయి సబ్ జూనియర్ షూటింగ్ బాల్ పోటీలకు బుధవారం వరంగల్ రైల్వే స్టేషన్ నుండి బీహార్ కు తరలి వెళ్లినట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.గోపాలం తెలిపారు. జాతీయ స్థాయి సబ్ జూనియర్ షూటింగ్ బాల్ పోటీలలో పాల్గొను బాల బాలికలకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.ఐలయ్య, ఉపాధ్యక్షుడు బి.గోపాలం, పీడీలు శంకర్, పవన్ కుమార్ క్రీడా దుస్తులు అందజేసి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర షూటింగ్ బాల్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎం.శ్రీనివాసులు, సిహెచ్. కళ్ళు ఐలయ్య, ఉపాధ్యక్షుడు బి.గోపాలం, నారాయణపేట జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సత్యాంజనేయులు, రమేష్ కుమార్, కోశాధికారి విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## సామాజిక సేవలో అగ్రగామిగా లయన్స్ క్లబ్

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** సమాజంలో సామాజికసేవలు అందించడంలో లయన్స్‌క్లబ్ కల్వకుర్తి అగ్రగామిగా కొనసాగుతున్నదని లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ జూలూరు రమేష్‌బాబు అన్నారు. బుధవారం క్లబ్ ఆధ్వర్యంలో మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా ఆర్‌టిసి బస్టాండు ఆవరణలో ప్రయాణికులు 300మందికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే వందలకోట్ల రూపాయల సేవలు అందించడంలో లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ పాత్ర గొప్పదన్నారు. ఎంతోమందికి కంటిచికిత్సలు నిర్వహించి ప్రత్యేకమైన మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నారని తెలిపారు. లయన్స్ క్లబ్ కల్వకుర్తి ఆధ్వర్యంలో మరిన్ని సేవలందించాలని సూచించారు. జూలూరు రమేష్‌బాబు జన్మదినం సందర్భంగా పేదలకు భోజనం అందించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు క్లబ్ అధ్యక్షుడు చిగుళ్లపల్లి శ్రీధర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు బచ్చురామకృష్ణ, క్లబ్ కార్యదర్శి కల్మచర్లగోపాల్, మెంబర్‌షిఫ్ కమిటిచైర్మన్ గుబ్బకిషన్, పోలరాజేందర్, శ్రీనివాస్, సత్యం, ప్రకాష్, రవి గౌడ్, గణేష్, జగదీశ్వర్, గోవిందు, చంద్రయ్య, బాదంరాఘవేందర్, సాయిబాబు, నారాయణ, రాజు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తం

### జిల్లావైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.రవికుమార్

**ప్రజాపక్షం/అచ్చంపేట :** ప్రస్తుతం వర్షాకాలం కాబట్టి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లావైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.రవికుమార్ అన్నారు. పట్టణంలోని శిశు సంజీవని ఎస్ఎన్‌సియు కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. పుట్టిన వెంటనే శిశువు ఏ అనారోగ్య సమస్యతో శిశువును చేర్చుకుంటున్నారని రాసిపెట్టిన రికార్డులను పరిశీలించారు. నిల్వఉన్న మందులను తనిఖీ చేశారు. చిన్నారులకు వెంటనే టీకాలు చేయాలని చిన్న పిల్లల వైద్య నిపుణులకు సూచించారు. ఈ కేంద్రంలో తక్కువబరువు, అవయవ లోపంతో పుట్టిన చిన్నారులకు పసిరికర్లతోపాటు ఇతర అనారోగ్యచికిత్సలకు ఈ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నాయన్నారు. శిశుసంజీవని సేవలను వినియోగించుకోవాలని ఆయన తెలిపారు. అనంతరం సిద్దాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, నడింపల్లి, చందాపూర్ ఆయుష్మాన్ కేంద్రాలను సందర్శించారు. కార్యక్రమంలో శిశుసంజీవని డాక్టర్ ప్రశాంత్, సిద్దాపూర్ ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి డాక్టర్ శివకుమార్, మన్ననూర్ వైద్యాధికారి డాక్టర్ గౌతమ్ పాల్గొన్నారు.

## బ్యాంక్ ఏర్పాటుకు భవనాల పరిశీలన

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** మండల పరిధిలోని కల్వరాలలో బ్యాంక్ ఏర్పాటు కోసం చర్యలు ప్రారంభమయ్యాయి. గ్రామంలో బ్యాంకు శాఖ లేక రైతులు, ఉద్యోగస్తులు, విద్యార్థులు, మహిళా సంఘాల సభ్యులు, వ్యాపారులు లావాదేవీల కోసం దూర ప్రాంతాలకు వెళ్లి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకువెళ్లారు. గ్రామ ప్రజల అవసరాన్ని గుర్తించిన మంత్రి జూపల్లి ప్రత్యేక చొరవ తీసుకొని సంబంధిత బ్యాంక్ అధికారులను సంప్రదించారు. బుధవారం లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ శివకుమార్, అసిస్టెంట్ ఏడిఎం సాయికుమార్ గ్రామంలోని పలు ప్రభుత్వ భవనాలను పరిశీలించారు. గ్రామంలో త్వరలోనే బ్యాంక్ సేవలు అందుబాటులోకి రానున్నందుకు మంత్రి జూపల్లి కృష్ణారావుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు చక్ర వెంకటేష్ , వెంకటరాజయ్య, రమేష్ గౌడ్, రాముడు, రామచంద్రయ్య, మధుగని రాజు, కృష్ణయ్య, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఆన్‌లైన్ గేమింగ్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

### చట్టంగా మారితే నేరస్థులకు బెయిల్ లేదు

### మూడేళ్ళు జైలు, కోటి రూపాయలు జరిమానా

**న్యూఢిల్లీ:** నగదు ఆధారిత ఆన్‌లైన్ గేమింగ్‌ను అరికట్టే ఒక బిల్లును లోక్‌సభ బుధవారం ఆమోదించింది. ఆశపెట్టి సాంకేతిక పద్ధతులలో ప్రజల డబ్బు దోచుకునే ఆన్‌లైన్ గేమింగ్ పూర్తి నిషేధానికి ఈ చట్టం ఉపయోగపడుతుంది. ఎలక్ట్రానిక్స్, ఐటి మంత్రి అశ్వనీ వైష్ణవ్ ఈ బిల్లు ప్రవేశపెట్టారు. రాజ్యసభ కూడా ఆమోదం తెలియజేస్తే, ఆ తర్వాత ఆన్‌లైన్ గేమింగ్‌కు అవకాశం కల్పించడం పెద్ద నేరంగా మారుతుంది. ఇలాంటి కేసులకు బెయిలు ఉండదు. నేరానికిగాను మూడు సంవత్సరాలు జైలుశిక్ష లేదా ఒక కోటి రూపాయలు జరిమానా విధిస్తారు. దీని స్థానంలో ఇ–స్పోర్ట్స్, ఆన్‌లైన్ సోషల్ గేమింగ్‌లను ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది.

ఈ చట్టం ప్రకారం నగదు ఆధారిత ఆన్‌లైన్ గేమింగ్ ప్రోత్సహించేందుకు ఎలాంటి ప్రకటనలు జారీ చేయకూడదు. ఒకవేళ అలాంటి ప్రకటనలు జారీ చేస్తే రెండు సంవత్సరాలు జైలుశిక్ష, రూ.50 లక్షల వరకూ జరిమానా విధిస్తారు. ఒకవేళ శిక్ష అనుభవించాక కూడా పదే పదే తప్పులు చేస్తే, జరిమానా పెరుగుతుంది. జైలుశిక్ష మూడు నుండి ఐదు సంవత్సరాలకు పెరుగుతుంది. జరిమానా ఒక కోటి రూపాయల నుండి రెండు కోట్ల రూపాయలకు పెరుగుతుంది. ఈ బిల్లు లోక్‌సభ ఆమోదం పొందిన తర్వాత మంత్రి అశ్వనీ వైష్ణవ్ పిటిఐ వార్తాసంస్థ ప్రతినిధితో మాట్లాడుతూ, ఆన్‌లైన్ గేమింగ్ అతిపెద్ద సామాజిక సమస్యగా మారిందనీ, ప్రజారోగ్యానికి హాని చేస్తోందని, సమాజంపై తీవ్రస్థాయిలో ప్రతికూల ప్రభావం చూపిస్తోందని చెప్పారు. క్రీడలను, సామాజిక పరమైన ఆటలను ప్రోత్సహించడం, నగదుతో సంబంధంలేని ఆన్‌లైన్ సోషల్ గేమింగ్‌ను ఒక అతిపెద్ద రంగంగా అభివృద్ధి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామని, తద్వారా భారతదేశాన్ని ఒక పెద్ద సోషల్ గేమింగ్ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఇప్పటికే చాలా కృషి జరుగుతోందని చెప్పారు.

రోజు రోజుకూ దేశంలో పెరుగుతున్న ఆర్థిక మోసాలు, లెక్కల్లో చూపించకుండా ధనాన్ని అక్రమ మార్గాల్లో తరలింపు చర్యలను అడ్డుకునేందుకు ఒక బిల్లు తీసుకురావాలని కేంద్రమంత్రివర్గం నిర్ణయించిన మరునాడే లోక్‌సభలో దానికి ఆమోదం లభించింది. బీహార్‌లో అక్రమంగా చేపట్టిన ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణపై చర్చ జరపాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు నిరసనలు తెలియజేస్తుండగానే మరోవైపు ఎలాంటి చర్చా లేకుండా ఈ బిల్లును అధికారపక్షం ఆమోదించింది.

అత్యాశకు పోయి అనేకమంది ఆన్‌లైన్ గేమింగ్ వేదికల వెంటపడి భారీస్థాయిలో ధనం పోగొట్టుకుని దివాలా తీయడంతోపాటు, శారీరక, మానసిక అనారోగ్యాలతో మంచాన పడుతున్నారు. ఐతే చాలా రియల్ మనీ గేమింగ్ సంస్థలు మాత్రం దీనిని ''నైపుణ్యంతో కూడిన ఆటలు''గా చిత్రీకరించి డబ్బులు దోచుకుంటున్నాయి. దీనివల్ల మధ్యతరగతి కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయని,సైబర్‌నేరాలు దేశంలో పెచ్చుమీరుతున్నాయని అనేక మార్గాలలో అందిన సమాచారం మేరకు కేంద్రమంత్రివర్గం ఈ నిర్ణయం తీసుకుంది. ఆన్‌లైన్ గేమింగ్‌వల్ల భారీ ఎత్తున నగదును పోగొట్టుకోవడమే కాకుండా, ఈ ధనాన్ని ప్రభుత్వానికి లెక్కల్లో చూపించకుండా అక్రమ మార్గాలలో తరలించడం పెరిగింది. ఈ బిల్లు చట్టరూపంలోకి వస్తే ధనం అక్రమ తరలింపును కూడా అడ్డుకుని పిఎంఎల్‌ఎ చట్టం కింద కేసులు నమోదు చేయడం మరింత సులభం అవుతుంది. ప్రస్తుతం ఉన్న చట్టల ప్రకారం రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వాలే ఈ ఆన్‌లైన్ గేమింగ్‌ను కనిపెట్టి నియంత్రించాలి. తమిళనాడు ప్రభుత్వం ఇంతకుముందే ఈ గేమింగ్‌ను నిషేధించింది. తమిళనాడులో ఉన్న ప్లే గేమ్స్ 24X7, హెడ్ డిజిటల్ వర్క్స్, జంగిల్ గేమ్స్ వంటి అనేక ఇతర గేమింగ్ సంస్థలన్నీ మద్రాసు హైకోర్టును ఆశ్రయించాయి. తమిళనాడు ప్రభుత్వం విధించిన నిషేధాన్ని, డిజిటల్ వేదికలను నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వ హక్కులను సవాలు చేశాయి. ఈ గేమింగ్ సంస్థల వాదనలను న్యాయస్థానం తిరస్కరించింది. ప్రభుత్వ వాదనను సమర్థించింది. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు వీలుగా ఒక శాసనాన్ని ఆమోదించే హక్కు రాష్ట్రానికి ఉందని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఐతే రియల్ మనీ వేదికలు మాత్రం 2021 నాటి కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఐటి నిబంధనలను ప్రస్తావిస్తున్నాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం కూడా ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించి ఈ బిల్లు తెచ్చింది.

# భారత్‌కు ట్రంప్ నుండి సవాళ్ళు ఎదురైతే ఎదుర్కొంటాం

### రష్యా భరోసా

**న్యూఢిల్లీ:** రష్యా నుండి ముడి చమురు కొనుగోలు చేస్తున్న భారత్‌పై అమెరికా శిక్షాత్మక చర్యలకు దిగితే ఎదురయ్యే ఎలాంటి సవాళ్ళను ఎదుర్కోవడానికైనా రష్యా దగ్గర ప్రత్యేక యంత్రాంగం ఉందని ఆ దేశ దౌత్యవేత్త సహాయకుడు రోమన్ బబుష్కిన్ చెప్పారు. భారత్–రష్యా మధ్య ఇంధన భద్రత, ఇంధన సహకారం ఎలాంటి ఆటంకాలూ లేకుండా భవిష్యత్తులో వృద్ధి చెందుతుందని ఆయన భరోసా ఇచ్చారు. న్యూఢిల్లీలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, భారత్–రష్యా మధ్య అనేక కీలకమైన రంగాలలో సంబంధాలు శరవేగంగా వృద్ధి చెందుతున్న విషయాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. రష్యా నుండి చమురు దిగుమతుల పేరుతో ట్రంప్ చేస్తున్న విమర్శలవల్ల ఇటీవలికాలంలో భారత్–అమెరికా మధ్య సంబంధాలు క్షీణిస్తున్న పరిస్థితులమధ్య రోమన్ బబుష్కిన్ మాట్లాడుతూ, భారత్ సైనిక రంగానికి సంబంధించి వివిధ రకాల విడిభాగాలను సరఫరా చేసేందుకు, భారత్ అవసరాలను తీర్చేందుకు రష్యా ఒక ప్రధాన భాగస్వామ్యదేశంగా ఉందని అన్నారు. రష్యా నుండి ముడి చమురు భారీ ఎత్తున దిగుమతి చేసుకుంటున్న భారతదేశం ఈ చమురును శుద్ధిచేసి బహిరంగ మార్కెట్‌లో విక్రయించి భారీలాభాలను రష్యాకు సమకూరుస్తోందని, ఆ ధనంతోనే ఉక్రేన్‌లో పుతిన్ యుద్ధం కొనసాగిస్తున్నారనీ, ఈ యుద్ధం కొనసాగడానికి పరోక్షంగా భారత్ కారణమని ట్రంప్ ఆరోపించారు. రష్యా నుండి ముడి చమురు దిగుమతులు ఆపేయాలని కోరారు. ఈ చమురు దిగుమతి చేసుకుంటున్నందుకుగాను జరిమానాగా 25 శాతం సుంకాలు విధిస్తున్నట్లు కూడా ఆయన ప్రకటించారు. ఈ నేపథ్యంలో మొదటిసారి భారత్‌ను బలపరుస్తూ రష్యా నుండి పై విధమైన ప్రకటన వెలువడింది. ''రష్యా నుండి ముడి చమురు కొనుగోళ్ళు నిలిపివేయాలని భారత్‌పై ట్రంప్ ఎడతెగని ఒత్తిడి తీసుకువస్తున్నారు, ఇది ఎంతమాత్రం న్యాయసమ్మతం కాదు, ఈ విధమైన వైఖరి, ఆంక్షల తరహా విధానం ప్రపంచ ఆర్థిక స్థిరత్వానికీ, ఇంధన భద్రతకు తీవ్ర హాని కలిగిస్తుందని రోమన్ బబుష్కిన్ హెచ్చరించారు. ''ఇది భారత్‌కు ఒక సవాళ్ళతో కూడిన పరిస్థితి, భారత్‌కూ మాకు మధ్య గొప్ప విశ్వాసం ఉంది, ఈ రెండు దేశాలమధ్యా ఇంధన రంగంలో భద్రతకు ముప్పు వాటిల్లితే సవాళ్ళను ఎదుర్కోవడానికి రష్యా కట్టుబడి ఉంది'' అని బబుష్కిన్ భరోసా ఇచ్చారు. ఐతే ఈనెలారంభంలో ట్రంప్ భారత్‌పై 25 శాతం జరిమానా సుంకాలు విధించినప్పటికీ వాటిని ఇప్పటికీ ఇంకా అమలు చేయలేదు. పైగా ఈ సుంకాలను అమలు చేసే అవకాశం లేదనే సంకేతాలు కూడా ఆయన పంపుతున్నారు. భారతదేశం మాత్రం రష్యా నుండి చమురు కొనుగోలును సమర్థించుకున్నది.

# క్రీడ



## అయ్యర్‌కు దక్కని చోటు..
### అభిషేక్ నాయర్ అసంతృప్తి



వచ్చే నెలలో యూఏఈ వేదికగా జరుగనున్న ఆసియా కప్ కోసం బిసిసిఐ జట్టును ప్రకటించింది. అద్భుతమైన ఫామ్‌లో ఉన్న స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్‌ను జట్టులో చోటు కల్పించకపోవడంపై అందరినీ ఆశ్చర్యపరిచింది. ఛాంపియన్స్ ట్రోఫీలో సత్తా చాటిన, ఐపిఎల్ 2025లో పంజాబ్ కింగ్స్‌ను ఫైనల్ వరకు నడిపించిన అయ్యర్‌కు 15 మంది సభ్యుల జట్టులోనే కాకుండా, ఐదుగురు స్టాండ్‌బై ఆటగాళ్ల జాబితాలో కూడా చోటు దక్కలేదు. దాంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే బిసిసిఐ నిర్ణయంపై టీమిండియా మాజీ అసిస్టెంట్ కోచ్ అభిషేక్ నాయర్ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశాడు. 'శ్రేయస్ అయ్యర్ లాంటి స్టార్ ఆటగాడు కనీసం రిజర్వ్ ఆటగాళ్ల జాబితాలో కూడా ఎలా లేడో నాకు అర్థం కావడం లేదు. అతడిని 20 మందితో కూడిన జట్టులో ఎందుకు తీసుకోలేదో తెలియడం లేదు. ఈ నిర్ణయం అతనికి జట్టులో ప్రాధాన్యత ఇవ్వడం లేదు అనే స్పష్టమైన సంకేతం ఇస్తుంది' అని పేర్కొన్నాడు. సెలక్షన్ అనేది కేవలం ఆటగాడి ప్రతిభను మాత్రమే కాకుండా, కొంతమంది వ్యక్తుల ఇష్టాలకు ఆధారపడి ఉండవచ్చని నాయర్ వ్యాఖ్యానించాడు.
అయితే, జట్టులో చోటు కల్పించకపోవడంపై బిసిసిఐ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ స్పందించారు. 'శ్రేయస్ తప్పేమీ లేదు. తాము కేవలం 15 మందిని మాత్రమే ఎంపిక చేయగలం. ప్రస్తుతానికి అతను తన అవకాశం కోసం ఎదురు చూడాల్సిందే' అని కామెంట్ చేశాడు.

## ఐసిసి వన్డే ర్యాంకింగ్స్..
## రో-కో స్థానాలు అదృశ్యం!

ఐసిసి తాజాగా బుధవారం ప్రకటించిన వన్డే ర్యాంకింగ్స్‌లో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల స్థానాలు గల్లంతయ్యాయి! వీరిద్దరూ ఇప్పటికే టీ20, టెస్ట్ క్రికెట్‌కు తమ రిటైర్మెంట్ ప్రకటించారు. అయితే గతవారం (ఆగస్టు 13) ప్రకటించిన ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో 756 పాయింట్లతో రోహిత్ శర్మ రెండో స్థానం, 736 పాయింట్లతో విరాట్ కోహ్లీ నాలుగోస్థానంలో నిలిచారు. శుభ్‌మన్ గిల్ ఇప్పటికీ మొదటి స్థానంలో (784 పాయింట్లు) కొనసాగుతున్నారు. తాజాగా ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో పాకిస్థాన్ బ్యాటర్ బాబర్ అజామ్ 739 పాయింట్లతో రెండోస్థానంలో నిలిచాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీకి ఈ ర్యాంకింగ్స్‌లో అసలు స్థానం దక్కలేదు. కారణాలేంటో స్పష్టంగా తెలియకపోయినా.. ఏదైనా సాంకేతిక లోపంతో ఇలా జరిగి ఉండవచ్చని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.
రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఇద్దరూ చివరగా తమ వన్డే మ్యాచ్‌ను యూఏఈ వేదికగా జరిగిన ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ సందర్భంగా ఆడారు. తాజాగా ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో టాప్ 10లో టీమ్‌ఇండియా నుంచి శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్ మాత్రమే స్థానం దక్కించుకున్నారు.

**ఐసిసి వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్ (ఆగస్టు 20)**
శుభ్‌మన్ గిల్ – భారత్ – 784 పాయింట్లు
బాబర్ అజామ్ – పాకిస్థాన్ – 739 పాయింట్లు
డారిల్ మిచెల్ – న్యూజిలాండ్ – 720 పాయింట్లు
చరిత్ అసలంక – శ్రీలంక – 719 పాయింట్లు
హ్యారీ టెక్టర్ – ఐర్లాండ్ – 708 పాయింట్లు
శ్రేయస్ అయ్యర్ – భారత్ – 704 పాయింట్లు
షాయ్ హోప్ – వెస్టిండీస్ – 699 పాయింట్లు
ఇబ్రహీం జద్రాన్ అఫ్ఘనిస్థాన్ 676 పాయింట్లు
కుశాల్ మెండిస్ – శ్రీలంక – 669 పాయింట్లు
ట్రావిస్ హెడ్ – ఆస్ట్రేలియా – 648 పాయింట్లు

**ఐసిసి వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్.. (ఆగస్టు 13)**
శుభ్‌మన్ గిల్ – భారత్ – 784 పాయింట్లు
రోహిత్ శర్మ – భారత్ – 756 పాయింట్లు
బాబర్ అజామ్ – పాకిస్థాన్ – 751 పాయింట్లు
విరాట్ కోహ్లీ – భారత్ – 736 పాయింట్లు
డారిల్ మిచెల్ – న్యూజిలాండ్ – 720 పాయింట్లు
చరిత్ అసలంక – శ్రీలంక – 719 పాయింట్లు
హ్యారీ టెక్టర్ – ఐర్లాండ్ – 708 పాయింట్లు
శ్రేయస్ అయ్యర్ – భారత్ – 704 పాయింట్లు
ఇబ్రహీం జద్రాన్ – అఫ్ఘనిస్థాన్ – 676 పాయింట్లు
కుశాల్ మెండిస్ – శ్రీలంక – 669 పాయింట్లు

## చిక్కుల్లో పాక్ మాజీ కెప్టెన్
### వసిం అక్రమ్‌పై సైబర్ క్రైమ్ ఏజెన్సీకి ఫిర్యాదు..



పాకిస్తాన్ మాజీ కెప్టెన్ వసిం అక్రమ్ చిక్కుల్లో పడ్డాడు. గ్యాంబ్లింగ్, బెట్టింగ్ ప్లాట్‌ఫామ్‌కు ప్రచారం చేస్తున్న మాజీ బౌలర్‌పై సైబర్ క్రైమ్ ఏజెన్సీకి ఫిర్యాదు చేశారు. జూదం, బెట్టింగ్ యాప్స్‌ను ప్రోత్సహిస్తున్న అక్రమ్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ముహమ్మద్ ఫైజ్ లాహోర్‌లోని నేషన్ సైబర్ క్రైమ్ ఏజెన్సీకి ఫిర్యాదు చేశాడు. విదేశీ బెట్టింగ్ యాప్ 'బాజీ'తో అక్రమ్‌కు సంబంధం ఉందని ఫైజ్ ఆరోపించారు. పాకిస్తాన్ మాజీ ఫాస్ట్ బౌలర్ ఈ బెట్టింగ్ యాప్ బ్రాండ్‌ను ప్రమోట్ చేస్తున్నాడన్నారు. సోషల్ మీడియాలో పోస్ట్ అయిన పోస్టర్, వీడియో క్లిప్‌లో వసీం అక్రమ్ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌కు మద్దతు తెలుస్తోందని.. ఇది యాప్‌పై సాధారణ ప్రజల్లో ఆసక్తిని పెంచిందని పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్ క్రైమ్స్ యాక్ట్ 2016 కింద అక్రమ్‌పై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫైజ్ సైబర్ క్రైమ్ ఏజెన్సీకి విజ్ఞప్తి చేశాడు.

# ఫోకస్ చరిత్ర



## వేల సంవత్సరాల క్రితమే డ్రైనేజీ వ్యవస్థ



ఈ చిత్రంలో కనిపిస్తున్నది ఆధునిక పైప్‌లైన్, ప్లంబింగ్ వ్యవస్థలో ఒక భాగం అనుకుంటే పొరపాటే. నమ్మినా, నమ్మకపోయినా ఇది క్రీస్తుపూర్వం సుమారు 2500 నాటిది. మన దేశంలో, పురాతన కాలానికి చెందిన సింధు లోయ నాగరికత అవశేషాలుగా బాక్ట్రియా మార్జియానా ఆర్కియాలజికల్ కాంప్లెక్స్ (బిఎంఎసి) ప్రాంత పరిశోధకులు తేల్చిచెప్తున్నారు. భారత ఉపఖండంలోని వాయువ్య ప్రాంతంలో గ్రేటర్ బాక్ట్రియా ప్రాంతంలో వెలుగు చూసిన శిథిల నగరంలో అనేక అద్భుతాలు అందిరినీ ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి. అక్కడ ప్రతి ప్రతి ఇంటినీ అనుసంధానించే డ్రేనేజీ వ్యవస్థ ఉండడం నమ్మలేని నిజం. లోథాల్ నగరంలో చాలా సంక్లిష్టమైన డ్రైనేజీ వ్యవస్థ ఉండేదని, ఇది నగరంలోని ప్రతి ప్రైవేట్ ఇంటి నుండి వ్యర్థాలను సేకరించి నగరం వెలుపల ఉన్న కేంద్ర సంప్‌కు చేరవేసేదని పరిశోధకులు చెప్తున్నారు. అదే విధంగా వాయువ్యంలోని గోనూర్‌లో నీటిని సరఫరా చేయడానికి ఈ పైపులు ఉన్నాయి. ఆ రోజుల్లోనే, ఇప్పటి కాలానికి పోటీపడే రీతిలో మంచినీరు, మురుగునీటి పారుదల వ్యవస్థలు ఉండేవని అక్కడి తవ్వకాల్లో బయటపడిన శిథిల నిర్మాణాలు నిరూపిస్తున్నాయి.


## చరిత్ర వక్రీకరణ ఇంకెంతకాలం?

ఎవరి అవసరాలకు అనుగుణంగా వారు మార్చుకుంటూపోయిన నేపథ్యంలో, చరిత్ర వక్రీకరణ నిరాటంకంగా సాగింది. ఇప్పటికైనా కళ్లు తెరచి, నిజం చూడకపోతే... వాస్తవ చరిత్రను అర్థం చేసుకోకపోతే, మానవజాతి వికాసం మరుగున పడుతుంది. అందుకే..
**'ఇతిహాసపు చీకటి కోణం అట్టడుగున పడికాన్పించని కథలన్నీ కావాలిప్పుడు!**





దాచేస్తే దాగని సత్యం' అంటాడు మహాకవి శ్రీశ్రీ. నిజానికి చరిత్ర అంటే నిజం. చరిత్ర అంటే నాటి వాస్తవ పరిస్థితుల ఆవిష్కరణ. వివరణ. కానీ, శతాబ్దాలుగా తప్పుడు సమాచరమే చరిత్రగా చెలామణి అవుతున్నది. సింధు లోయ నాగరికత క్రీస్తు పూర్వం 1500–1750 మధ్యకాలంలో శిథిలమై ఉండవచ్చని చరిత్రకారుల అభిప్రాయం. అక్కడ హరప్పా, మొహంజొదారో వంటి పెద్దపెద్ద నగరాలు ఉండేవి. విశాలమైన రోడ్లు.. ఇటుకలతో కట్టిన బహుళ అంతస్థుల భవనాలు.. అద్భుతమైన డ్రైనేజీ వ్యవస్థలతో నాగరికత విరాజిల్లిందని ఆ ప్రాంతంలో లభించిన ఆధారాలు స్పష్టం చేస్తున్నాయి. దీనిని ద్రవిడ నాగరికతగా పేర్కొంటున్నారు. మధ్య ఆసియా నుంచి వచ్చిన ఆర్యులు భారత్‌పై దండయాత్ర చేశారని, సింధు లోయను ఆక్రమించారని ఇంత వరకూ ప్రచారంలో ఉన్న చరిత్ర చెప్తున్నది. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వంటి ఎంతో మంది ఈ సిద్ధాంతాన్ని తిరస్కరించారు. ఆర్యుల దండయాత్ర అనేది ఒక అభూత కల్పనగా కొట్టిపారేశారు. కొన్ని అంశాలను నిశితంగా విశ్లేషిస్తే, వారి వాదన నిజమేనని స్పష్టమవుతుంది. వైదిక యుగంలో ఆర్యులు కుటీరాలు, గుడిసెల్లో నివాసం ఉన్నట్టు ఒకవైపు చెప్తూనే, మరోవైపు, వారు సింధు లోయలో నగరాలు, పట్టణాలను ఆక్రమించుకున్నారని అంటున్నారు. ఇది ఎలా సాధ్యం? అప్పటికే నాగరికతో విరాజిల్లుతూ, అద్భుతమైన కట్టడాలతో ఉన్న నగరాలను ఆక్రమించుకున్నప్పుడు, వాటిలో ఉండకుండా, దూరంగా గుడిసెల్లో లేదా కుటీరాల్లో ఆర్యులు ఎందుకు నివాసం ఉంటారు? ఒకవేళ స్థానికులతో ఆర్యులు జరిపిన యుద్ధంలో భవనాలు లేదా సంస్కృతి పూర్తిగా ధ్వంసమయ్యాయనే అనుకుందాం. అప్పుడు, అవే శిథిలాలపై ఆర్యుల నాగరికత లేదా సంస్కృతికి సంబంధించిన అవశేషాలు ఉండాలి. హరప్పా, మొహంజొదారో తవ్వకాల్లో, ఆర్యుల నాగరికతకు సంబంధించిన అవశేషాలు ఏవీ లేవు. అంటే, ఆర్యుల రాక, వారి దండయాత్ర మాట వాస్తవ దూరమనే కదా అర్థం. జీలం, చినాబ్ నదీ పరీవాహక ప్రాంతాల్లో సుమారు 800 నగరాలు ఉండేవని పురాతన చరిత్రకారులు పేర్కొన్నారు. వేదయుగంలో వైదికులు గ్రామీణ నాగరికతను అనుసరించారనడానికి ఆధారాలు ఉన్నాయి. ఈ రెండూ పరస్పర విరుద్ధం. ఆర్యుల రాక నిజమే అయితే, వారు ఎంతకాలం రాజ్యం చెలాయించారు? ఎప్పుడు, ఎవరి చేతిలో పరాజయం ఎదుర్కొన్నారు? చరిత్రలో వారి స్థానం ఎక్కడ? వంటి ప్రశ్నలకు సమాధానాలు ఉండాలి. కానీ, అలాంటివి ఏవీ లేదు. అందుకే, ఆర్యుల రాక ఒక కట్టుకథ అనే వాదన సరైనదే అనిపిస్తుంది. ఈ కోణంలో వాస్తవిక, హేతుబద్ధమైన చరిత్రను భావి తరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



# రీల్

## 'నేనెవరు?' లోగో విడుదల



నటకిరీటి డా.రాజేంద్ర ప్రసాద్, 'నువ్వేకావాలి, ప్రేమించు' వంటి సూపర్ హిట్ ఫిలమ్స్ ఫేమ్ సాయి కిరణ్, జోగిని శ్యామల ముఖ్యపాత్రల్లో యువ ప్రతిబాశాలి చిరంజీవి తన్నీరు దర్శకత్వంలో తెరకెక్కుతున్న వినోదాత్మక చిత్రం 'నేనెవరు?' ఇందులో నటుడు రాజేంద్ర ప్రసాద్ కీలకపాత్ర పోషిస్తున్నారు. జై చిరంజీవ మూవీ మేకర్స్ పతాకంపై సరికొండ మల్లిఖార్జున్ సమర్పణలో అండేకర్ జగదీష్ బాబు సకినాన భూలక్ష్మి సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రంతో వైజాగ్ సత్యానంద్ శిష్యులు అభిలాష్, సాయిచెర్రి హీరోలుగా పరిచయమవుతున్నారు. దీపిక సోనాక్షి జబర్దస్త్ రాజమౌళి ఇతర పాత్రల్లో నటించిన ఈ చిత్రం షూటింగ్ ముగించుకుని, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. ఈ చిత్రం టైటిల్ లోగోను తెలుగు నిర్మాతల మండలి అధ్యక్షులు కె.ఎల్.దామోదర్ ప్రసాద్, ప్రముఖ దర్శకులు రేలంగి నరసింహారావు, వి.సముద్ర ఆవిష్కరించారు. హైదరాబాద్ లోని, తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ప్రివ్యూ థియేటర్ లో జరిగిన ఈ వేడుకలో చిత్రబృందం పాల్గొన్నారు. ఈ చిత్రానికి మాటలు: శ్రీనివాస్, పాటలు: ఎస్.ఎస్.వీరు, మ్యూజిక్: చిన్ని కృష్ణ, ఎడిటర్: నందమూరి హరి తారకరామారావు, సినిమాటోగ్రఫీ: నాయుడు ప్రసాద్ కొల్లి పని చేస్తున్నారు.



## రామ్ చరణ్ కొత్త లుక్



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ప్రతిష్టాత్మక పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'పెద్ది'లో ఇప్పటివరకూ ఎన్నడూ చూడని కొత్త లుక్‌లో కనిపించబోతున్నారు. నేషనల్ అవార్డ్ విన్నింగ్ ఫిలిం మేకర్ బుచ్చి బాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో విజనరీ వెంకట సతీష్ కిలారు తన బ్యానర్ వృద్ధి సినిమాస్ పతాకంపై భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే సినిమా ఫస్ట్ షాట్ గ్లింప్స్‌తో బజ్ క్రియేట్ చేసింది. రామ్ చరణ్ పెద్దిలో నెవర్ బిఫోర్ లుక్‌తో మెస్మరైజ్ చేయడానికి రెడీ అయ్యారు. టాప్ సెలబ్రిటీ స్టైలిస్ట్ ఆలీం హకీం, రామ్ చరణ్ కోసం స్పెషల్ కేర్ తీసుకొని సరికొత్త లుక్‌లో ప్రెజంట్ చేయబోతున్నారు. రామ్ చరణ్ స్టైల్ కొత్త బెంచ్‌మార్క్‌ను క్రియేట్ చేయనున్నారు. రీసెంట్‌గా స్టైలిస్ట్ ఆలీం హకీం, రామ్ చరణ్ తో కలిసి దిగిన ఫోటోలు మీడియాకు విడుదల చేశారు. రామ్ చరణ్ పుట్టిన రోజు వచ్చే ఏడాది మార్చి 27న విడుదల కానున్న పెద్ది, తన కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టులలో ఒకటిగా రామ్ చరణ్ భావిస్తున్నారు. ఈ చిత్రం నుంచి కన్నడ సూపర్‌స్టార్ శివ రాజ్‌కుమార్ ఫస్ట్ లుక్ కూడా ఇటీవల అతని పుట్టినరోజున విడుదద

## క్రేజీ కింగ్స్ స్టూడియోస్ షూటింగ్ షురూ

రోహిత్ వర్మ కథానాయకుడిగా రియా సుమన్ నాయికగా నటిస్తోన్న నూతన చిత్రం హైదరాబాద్ రామానాయుడు స్టూడియోలో పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. క్రేజీ కింగ్స్ స్టూడియోస్ ఎల్.ఎల్.పి. బేనర్‌లో నజీర్ జమాల్ నిర్మిస్తుండగా, గోవిందరెడ్డి చంద్ర దర్శకత్వం వహిస్తున్నారు. హీరో హీరోయిన్లపై తీసిన ముహూర్తపు సన్నివేశానికి విజయ్ కనకమేడల క్లాప్ కొట్టగా, సీనియర్ దర్శకుడు రామ్ ప్రసాద్ కెమెరా స్విచాన్ చేశారు. మరో దర్శకుడు మల్లిఖార్జున గౌరవ దర్శకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ కనకాల, ప్రగతి, వర్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం చిత్రం గురించి నిర్మాత నజీర్ జమాల్ మాట్లాడుతూ.. తెలుగులో నాకిది మొదటి సినిమా. కథ విన్న తర్వాత బాగా నచ్చి సినిమా చేయడానికి ముందుకు వచ్చాను. కథానాయకుడు రోహిత్ వర్మ మాట్లాడుతూ దర్శకుడు అద్భుతమైన కథ చెప్పారు. తెలుగు ప్రేక్షకులకు మంచి సినిమా ఇవ్వాలని నా మనసులో కోరిక వుండేది. ఈ చిత్రంలో అది కుదిరింది. చిత్రం కోసం తెలుగు బాగా నేర్చుకుంటున్నాను. అందరూ మెచ్చే సినిమా అవుతుందని నమ్మకం ఉంది.



## 'కాంతార చాప్టర్-1'లో గుల్షన్ ఫస్ట్ లుక్

బిగ్గెస్ట్ పాన్ ఇండియా మూవీ 'కాంతార చాప్టర్ 1' నిర్మాతలు బాలీవుడ్ నటుడు గుల్షన్ దేవయ్య ఫస్ట్ లుక్‌ను లాంచ్ చేశారు. రిషబ్ శెట్టి కాంతారకు ప్రతిష్టాత్మక ప్రీక్వెల్‌లో కులశేఖర పాత్రలో నటిస్తున్నాడు గుల్షన్ దేవయ్య. రిషబ్ శెట్టి రచన, దర్శకత్వం వహించి తానే మళ్లీ సెంట్రల్ క్యారెక్టర్‌లో నటిస్తున్న 'కాంతార చాప్టర్ 1'. ఈ సినిమా విజువల్ విజువల్ వండర్‌గా ఉండబోతోంది. సినిమాటోగ్రఫీని అర్వింద్ ఎస్.కాశ్యప్ అందిస్తుండగా, ఫస్ట్ పార్ట్‌లో ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేసిన బి.అజనీష్ లోక్నాథ్ మ్యూజిక్ ఇస్తున్నారు. హోంబాలే ఫిలిమ్స్ విజయ్ కిరగందూర్ నిర్మిస్తున్నారు. కులశేఖర పాత్రలో గుల్షన్ దేవయ్య ఫస్ట్ లుక్ బయటికి రావడంతో సినిమా మీద మరింత హైప్ పెరిగింది. ఈ మోస్ట్ లవ్డ్ యూనివర్స్‌లో అతని రోల్ ఎలాంటి మలుపులు తీసుకొస్తుందో అన్న ఆసక్తి పెరుగుతోంది. ఈ చిత్రం కన్నడతో పాటు తెలుగు, హిందీ, తమిళం, మలయాళం, బెంగాలీ, ఇంగ్లీష్‌లో అక్టోబర్ 2న విడుదల కానుంది.





## 'బరాబర్ ప్రేమిస్తా' నుంచి 'గుంజి గుంజి' పాట విడుదల

ఆటిట్యూడ్ స్టార్ చంద్రహాస్ నూతన చిత్రం 'బరాబర్ ప్రేమిస్తా'. ఈ చిత్రానికి సంపత్ రుద్ర దర్శకత్వం వహిస్తుండగా.. కాకర్ల సత్యనారాయణ సమర్పణలో సిసి క్రియేషన్స్, ఎవిఆర్ మూవీ వండర్స్ బ్యానర్లపై గెడా చందు, గాయత్రి చిన్ని, ఎవిఆర్ నిర్మిస్తున్నారు. మిస్ ఇండియా ఫైనలిస్ట్ మేఘనా ముఖర్జీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. అర్జున్ మహీ ('ఇష్టంగా' ఫేమ్) ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. ఆడియో ప్రమోషన్స్‌లో భాగంగా గతంలో 'రెడ్డి మామ' అంటూ ఓ మాస్ బీట్ సాంగ్‌ను ప్రముఖ నిర్మాత దిల్ రాజు రిలీజ్ చేయడం, అది యూట్యూబ్‌లో ట్రెండ్ అవ్వడం అందరికీ తెలిసిందే. ఇక తాజాగా సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ బన్నీ వాస్ 'గుంజి గుంజి' అంటూ సాగే ఓ యూత్ ఫుల్, మాస్, ఎనర్జిటిక్ సాంగ్‌ను విడుదల చేశారు.

## 'లిటిల్ హార్ట్స్' టీజర్ విడుదల

'90s మిడిల్ క్లాస్ బయోపిక్' ఫేమ్ మౌళి తనుజ్, 'అంబాజీ పేట మ్యారేజి బ్యాండు' మూవీతో గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్ శివానీ నాగరం లీడ్ రోల్స్‌లో నటిస్తున్న మూవీ 'లిటిల్ హార్ట్స్'. ఈ చిత్రాన్ని ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్ బ్యానర్‌పై దర్శకుడు సాయి మార్తాండ రూపొందించారు. '90s మిడిల్ క్లాస్ బయోపిక్' ఫేమ్ డైరెక్టర్ ఆదిత్య హాసన్ 'లిటిల్ హార్ట్స్' మూవీకి నిర్మాతగా వ్యవహరించారు. ఈ సినిమా కంటెంట్ నచ్చి నిర్మాతలు బన్నీ వాస్, వంశీ నందిపాటి సెప్టెంబర్ 12న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు. ఈ చిత్ర టీజర్‌ను బ్లాక్ బస్టర్ డైరెక్టర్ అనిల్ రావిపూడి చేతుల మీదుగా రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా నటుడు రాజీవ్ కనకాల మాట్లాడుతూ 'లిటిల్ హార్ట్స్' సినిమాలో నటించేప్పుడు మా డైరెక్టర్ సాయి సెటిల్డ్‌గా పర్ ఫార్మ్ చేయండి సార్ అంటూ వెంటపడేవాడు. ఎంత సెటిల్డ్ గా నటించినా, మళ్లీ ఇంకాస్త అనేవాడు. ఈ సినిమా తర్వాత నాకు సెటిల్డ్ స్టార్ అనే బిరుదు వస్తుందేమో చూడాలి. డబ్బింగ్ చెప్పేప్పుడు కూడా సెటిల్డ్‌గా చెప్పండి అనేవారు. ఈ సినిమాలో నాకొక కొత్త తరహా క్యారెక్టర్‌లో నటించే అవకాశం దక్కింది అన్నారు. డైరెక్టర్ అనిల్ రావిపూడి మాట్లాడుతూ టీనేజ్‌లో ఉండే సరదా లైఫ్ మనందరికీ దాదాపు ఒకేలా ఉంటుంది. టీనేజ్ బ్యాక్ డ్రాప్‌లో మూవీ చాలా బాగుంటుంది కదా అని డిస్కషన్ చేస్తున్న టైమ్‌లో 'లిటిల్ హార్ట్స్' టీజర్ నా దగ్గరకు వచ్చింది. ఈ టీజర్‌లో చూపించినట్లు గల్లీలో కొట్లాటలు, ఇంట్లో పేరెంట్స్‌తో చివాట్లు, అమ్మాయి చుట్టూ చక్కర్లు, ఎంసెట్ ఎగ్జామ్ టెన్షన్స్..ఇవన్నీ కనిపించాయి. టీజర్ నాకు బాగా నచ్చింది. కామెడీ మూవీని థియేటర్స్ లో చూస్తే ఆ వైబ్ అలా అందరికీ రీచ్ అవుతుంది అని చెప్పారు.





## జూనియర్ ఎన్టీఆర్‌ను విమర్శిస్తే సహించం
### ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ వార్నింగ్

తమ అభిమాన నటుడు జూనియర్ ఎన్టీఆర్‌ను ఎవరూ దూషించినా సహించబోమని ఎన్టీఆర్ అభిమాన సంఘం ప్రకటించింది. ఎన్టీఆర్ ను నోటికొచ్చినట్టు విమర్శించిన తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు రెండు రోజుల సమయం ఇస్తున్నామని, రెండు రోజుల్లో బహిరంగ క్షమాపణ చెప్పకపోతే ఫాన్స్‌గా తమ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. బుధవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జూనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘం నాయకులు మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ కన్వీనర్ ముజీబ్ మాట్లాడుతూ జూనియర్ ఎన్టీఆర్‌ను, షాలిని మేడంను ఎమ్మెల్యే అలా మాట్లాడటం సబబు కాదని అన్నారు. త్వరలోనే చలో అనంతపూర్‌కు పిలుపునిస్తామని చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడిన భాష మేము కూడా మాట్లాడగలం కానీ అలనాటి నీచ సంస్కృతి మా హీరో నేర్పించలేదని అన్నారు. తెలుగుదేశం పార్టీకి చీడపురుగులా తయారైన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ను వెంటనే తెలుగుదేశం పార్టీ నుంచి సస్పెండ్ చెయ్యాలని చంద్రబాబు నాయుడును ఎన్టీఆర్ అభిమాన సంఘం డిమాండ్ చేసింది. ఏది ఫాన్స్ వర్సెస్ ఎమ్మెల్యే వ్యవహారమే తప్ప పార్టీ వర్సెస్ ఫాన్స్ వ్యవహారం కాదని స్పష్టం చేశారు. రెండు రోజుల్లో ఎమ్మెల్యే క్షమాపణ చెప్పకపోతే అన్ని ప్రాంతాల్లో ఆయన మీద కేసులు పెడతామని, అవసరమైతే ఇల్లు ముట్టడించే కార్యక్రమాన్ని కూడా చేపడతామని ఎన్టీఆర్ అభిమాన సంఘం నాయకులు హెచ్చరించారు.



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## తనిఖీకి వచ్చే అధికారులకు ప్రజలు సహకరించాలి : తహసీల్దార్

**ప్రజాపక్షం/సరూర్‌నగర్:** రేషన్‌కార్డుకు ధరఖాస్తు చేసుకున్న వారు రెవెన్యూ కార్యాలయం నుంచి వచ్చే అధికారులకు సహకరించాలని సరూర్ నగర్ మండల తహసీల్దార్ పి.వేణుగోపాల్ అన్నారు. మండల కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డు కోసం మీ సేవలో అప్లై చేస్తే రెవెన్యూ అధికారులు ఎంక్వయిరీ చేసి సివిల్ సప్లై అధికారులకు రిపోర్ట్ అందజేస్తారని తెలిపారు. ఎంక్వయిరీ సమయంలో కొంతమంది తప్పుడు సమాచారం ఇస్తున్నారని, అలా తప్పుడు సమాచారం ఇచ్చిన వారిని రేషన్ కార్డులు మంజూరు కావని తెలిపారు. సివిల్ సప్లై ఇన్‌స్పెక్టర్ లాగిన్‌లో ఎంటర్ చేసే సమయంలో అప్లై చేసిన వారి అధార్ నెంబర్ లింక్ అయి ఉండటం వలన వారికి సంబందించిన స్థిరచర ఆస్తుల వివరాలు తెలుస్తుందన్నారు. తద్వారా అప్లికేషన్ రిజెక్ట్ అవుతుందని తెలిపారు. సివిల్ సప్లై నుంచి సరూర్‌నగర్ మండల కార్యాలయానికి 9500 అప్లికేషన్‌లు ఎంక్వయిరీ కోసం వచ్చాయని, దాదాపు 25 శాతం పూర్తి చేసినట్లు తెలిపారు.

## ఉస్మాన్ సాగర్ జలాశయం రెండు గేట్లు ఎత్తిన అధికారులు



**ప్రజాపక్షం/గండిపేట:** హైదరాబాదు నగరంలోని జంట జలాశయాలు నిండుకుండలా మారడంతో సంబంధిత జలమండలి అధికారులు, గండిపేట మండల తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి రెండు గేట్ల తెరచి దిగువకు నీటిని వదిలారు. పదిరోజులు క్రితమే హిమాయత్‌సాగర్ జలాశయం నిండుకుండల మారడంతో ఫుల్ ట్యాంక్ లెవెల్ చేరువ కావడంతో అధికారులు 10 గేట్ల వరకు తెరిచి దిగువకు నీటిని వదిలిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం హిమాయత్ సాగర్ జలాశయం ఎఫ్‌టిఎల్ 1763.50 కాగా ప్రస్తుత నీటిమట్టం 1763.00 చేరువకావడంతో జలమండలి అధికారులు మూడు ఫీట్లు ఎత్తు చొప్పున రెండు గేట్లను తెరిచి దిగువకు 1600క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రస్తుతం హిమాయత్ సాగర్ 1600 క్యూసెక్కుల నీరు ఎగువ ప్రాంతాల నుంచి చేరతుడటంతో అధికారులు రెండు గేట్ల ద్వారా 1017క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ఈఏడాది మొట్ట మొదటిసారిగా ఉస్మాన్ సాగర్ జలాశయం కూడా బుధవారం ఎఫ్‌టిఎల్ కు 1790 ఫీట్లు కాగా ప్రస్తుతం నీటిమట్టం 1788 ఫీట్లకు చేరువ కావడం తో జలమండలి అధికారులు రెండు గేట్ల నుంచి 1200 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రస్తుతం1200 క్యూసెక్కుల నీరు ఎగువ నుంచి హిమాయత్‌సాగర్ జలాశయంలోకి చేరుతుండడంతో 226 క్యూ సెక్కుల నీటిని దిగువకు ఫీట్ల ఎత్తు వరకు రెండు గేట్లను తెరిచి అధికారులు విడుదల చేశారు. జంట జలాశయాల గేట్లు ఎత్తటంతో మూసీ పరివాహక ప్రాంతాల్లో ప్రజలు అలర్ట్‌గా ఉండాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

## బాలికలకు శానిటరీ కిట్స్ పంపిణీ



**ప్రజాపక్షం/శంకర్‌పల్లి:** ప్రభుత్వ బాలికల పాఠశాలల్లో శానిటరీ ప్యాడ్స్ వెండింగ్ మిషన్ అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీతారావు అన్నారు. శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలో బుధవారం సునీతారావు పర్యటన చేశారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు, 14వ వార్డు సిక్కుల మహిళలకు జిల్లా అధ్యక్షురాలు శ్రీజ్యోతి బీమ్ భరత్ ఆధ్వర్యంలో నారి మహిళా ఆరోగ్య సంకల్పం ప్రియదర్శిని ఉడాన్ సానిటరీ ప్యాడ్లను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ పద్మజ, ఫిజికల్ డైరెక్టర్ అరుంధతి తదితరులు పాల్గొన్నారు.

## కబ్జా అవుతున్న ప్రభుత్వ భూములు


### శంషాబాద్ తహసీల్దార్‌కు ఫిర్యాదు



**ప్రజాపక్షం/శంషాబాద్ :** శంషాబాద్ మండల పెద్దషాపూర్ తాండాలో ప్రభుత్వ భూములు కబ్జాలకు గురతున్నాయని రామునాయక్ ఆరోపించారు. ఈమేరకు బుధవారం తహసీల్దార్ రవీందర్‌దత్‌కు వినతిపత్రం సమర్పించారు. సర్వే నంబర్ 220లో 110 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, అందులో 50 ఎకరాలు స్వతంత్ర సమరయోధులకు, 200 మందికి గుడిసెలేని నిరుపేదలకు 60 గజాల చొప్పున కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయించిందని ఆయన గుర్తు చేశారు. మిగతా భూమి అసైన్డ్‌గా రైతుల ఆధీనంలో ఉన్నప్పటికీ కొంత మంది ప్రభావశీలుల మద్దతుతో విలువైన భూమిని దోచు కుంటున్నారన్నారు. వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.

## సమస్యలు పరిష్కరించడమే లక్ష్యం

### ఎమ్మెల్సీ దయానంద్ గుప్త



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** ప్రజల సమస్యలు పరిష్కరించడమే లక్ష్యమని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్త అన్నారు. ఎల్‌బినగర్ నియోజకవర్గం చైతన్యపురి డివిజన్ న్యూదిల్‌షుఖ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో సొంత నిధులతో బోర్ వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీవాసులలో ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించే విధంగా తనవంతు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బొగ్గారపు శరత్‌చంద్ర, శశిధర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, రవికేశవ్‌నాయుడు, తిరుమల్‌రెడ్డి, రాజశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి పోటీలకు ఆలేఖ్య





**ప్రజాపక్షం/యాచారం :** యాచారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న నేనావత్ ఆలేఖ్య జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పిజికల్ డైరెక్టర్ మానుపాటి మల్లేశ్ తెలిపారు. ఈనెల 25న పూణేలో జరిగే వాలీబాల్ క్రీడల్లో పాల్గొంటారన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వరల్డ్‌స్కూల్ వాలీబాల్ చాంపియన్ షిఫ్ ఆధ్వర్యంలో అండర్ 15 రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు ఈనెల 18,19 తేదీలలో ఇబ్రహింపట్నం లోని గురుకుల విద్యాపీఠ్‌లో జరిగాయన్నారు. తెలంగాణ రాష్ట్ర టోర్నమెంటులో అద్భుత ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జాతీయ స్థాయికి ఎంపిక చేశారన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబర్చిన ఆలేఖ్యను పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సింహ్మా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృదం జోసేఫ్, గోవర్ధనాచారి, సీతారాం, వెంకట్‌రెడ్డి, గోపాల్, జగదీష్‌కుమార్, శ్రీదేవి,బోజయ్య, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

## దసరా ఉత్సవాల వేళ.. బతుకమ్మకుంట సిద్ధం కావాలి

### హైడ్రా కమిషనర్ ఎవి.రంగనాథ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దసరా పండుగ దగ్గర పడుతుండటంతో, బతుకమ్మకుంటను సుందరంగా తీర్చిదిద్దాలని హైడ్రా కమిషనర్ ఎవి.రంగనాథ్ అధికారులకు సూచించారు. బతుకమ్మకుంట అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో బుధవారం పరిశీలించారు. దసరా ఉత్సవాల సమయానికి కుంట పూర్తిగా సిద్ధం కావాలని ఆదేశించారు. బతుకమ్మకుంట చుట్టూ పాత్‌వే, ప్రజలకు నీడ కల్పించే చెట్ల పెంపకం, కూర్చోవడానికి ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. చెరువులోకి నీరు వచ్చే, బయటకు వెళ్ళే మార్గాలను సరిగ్గా ఉండేలా చూడాలని సూచించారు. ఇటీవల వర్షాలకు వరద నీరు నేరుగా కుంటలోకి వెళ్ళడం ద్వారా చుట్టుపక్కల కాలనీలకు ఎలాంటి ఇబ్బందులు కలగలేదని, భవిష్యత్తులో కూడా ఇలాగే ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. కుంటనిండిన తర్వాత మిగులు జాలాలు బయటకు వెళ్ళేందుకు ఎలాంటి అడ్డంకులు లేకుండా పనులు చేపట్టాలని సూచించారు.

**బతుకమ్మ కుంట ఒక నమూనా కావాలి..** వరద నివారణ, భూగర్భ జలాల పెంపుదల, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాల్లో బతుకమ్మకుంట ఒక నమూనాగా నిలవాలని రంగనాథ్ ఆకాంక్షించారు. ఇటీవల కుంటను సందర్శించిన కేంద్రబృందాలు కూడా దీనిని ఒక జాతీయ నమూనాగా ప్రశంసించారని గుర్తు చేస్తూ, అందరి అంచనాలకు తగ్గట్టుగా దీనిని అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు.





**అందమైన హరిత వనంలా...**బతుకమ్మ కుంట మధ్యలో బతుకమ్మను ప్రతిబింబించేలా ఒక నిర్మాణం ఏర్పాటు చేయాలని కమిషనర్ సూచించారు. కుంట చుట్టూ అందమైన మొక్కలు పెంచి, ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా ఏర్పాటు చేయాలని అధికారులకు తెలిపారు. పెద్దలు సేద తీరడానికి వీలుగా గుమ్మటాలు, పరిశుభ్రమైన రెస్ట్‌రూమ్‌లు నిర్మించాలని ఆదేశించారు. బతుకమ్మ ఘాట్ పనులను పర్యవేక్షించారు. కుంటను రక్షించడానికి సెక్యూరిటీ ఉండేలా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.

### వరద నీరు నిలిచిన శ్రీరాంనగర్‌ను పరిశీలించిన హైడ్రా కమిషనర్

ఇటీవల కురిసిన వర్షాలకు వరద నీరు నిలిచిన బాగ్‌లింగంపల్లిలోని శ్రీరాంనగర్ కాలనీని హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. వర్షపు నీటితో పాటు మురుగు నీరు ముంచెత్తడానికి గల కారణాలను తెలుసుకున్నారు. హుస్సేన్‌సాగర్ ఔట్‌లెట్ నాలాను కలుపుతూ 30 ఏళ్ల క్రితం నిర్మించిన పైపులైన్ బ్లాక్ అవ్వడంతో ఈ సమస్య తలెత్తిందని అధికారులు తెలిపారు. ఇక్కడి ఖాళీ ప్లాట్‌లో బోరు వేసినప్పుడు పైపులైను దెబ్బతినిందని చెప్పారు. వెంటనే ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, దెబ్బతిన్న పైపులైనుకు మరమ్మతులు చేపట్టాలని హైడ్రా కమిషనర్ సూచించారు. ఈ లోగా మోటార్లు పెట్టి నీటిని మొత్తం ఖాళీ చేయాలని సూచించారు. సమస్యను తెలుసుకుని వెంటనే వచ్చి పరిశీలించిన కమిషనర్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.



## శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు

### రౌడీ షీటర్లకు కొత్వాల్ హెచ్చరిక..

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గణేష్ ఉత్సవాలు సమీపిస్తుండడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు ముందు జాగ్రత్త చర్యగా హైదరాబాద్‌లో ఉన్న రౌడీ షీటర్లకు పోలీసు కమిషనర్ సివి ఆనంద్ కౌన్సిలింగ్‌తో పాటు వార్నింగ్ ఇచ్చారు. బంజారాహిల్స్‌లోని టిజిఐసిసిసిలో ఉన్న హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో ఎగ్జిక్యూటివ్ కోర్టును నిర్వహించారు. ఈ కోర్టులో, హైదరాబాద్ నగరంలోని సౌత్, సౌత్ ఈస్ట్, సౌత్ వెస్ట్ జోన్‌లలో తమ ఆధిపత్యాన్ని నిలుపుకోవడానికి వివిధ రౌడీషీటర్లు,క్రిమినల్ గ్యాంగ్‌ల మధ్య జరుగుతున్న గొడవలను పరిష్కరించారు. పోలీస్‌స్టేషన్‌ల నుండి వచ్చిన నివేదికలను పోలీసుకమిషనర్, అడిషనల్ డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్ సివి ఆనంద్ పరిశీలించారు. ఈ నివేదికల ప్రకారం, ఈ గ్యాంగ్‌లు పరస్పరం దాడులు, హత్యలు, మరియు హత్యాయత్నాలు వంటి నేరాలకు పాల్పడ్డారని వెల్లడైంది. కోర్టు విచారణలో 10 పోలీసుస్టేషన్లకు సంబంధించిన 11గ్యాంగ్‌ల సంబంధించిన 101 సభ్యులను విడిగా విచారించారు. అందులో 6 గ్యాంగ్‌లు తమ పెద్దలు మరియు కుటుంబ సభ్యుల సమక్షంలో శాంతియుతంగా రాజీ చేసుకున్నామని తెలిపారు. మిగిలిన గ్యాంగ్‌లు తమ విచారణ తర్వాత ఎటువంటి నేరాలకు పాల్పడలేదని, భవిష్యత్తులో కూడా శాంతియుతంగా ఉంటామని హామీ ఇచ్చారు. సివి ఆనంద్ మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో శాంతి భద్రతలకు భంగం కలిగించే వారికి చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా శాంతికి భంగం కలిగించే అవకాశం ఉన్నట్లయితే, వారికి బిఎన్ఎస్ఎస్, 2023లోని సెక్షన్ 126 ప్రకారం కొంత కాలం పాటు శాంతిని కొనసాగించేలా బాండ్ రాయించుకుంటామని ఆయన తెలిపారు.



## తెలంగాణ సినిమా పాలసీ రూపొందించాలి

### రాష్ట్ర ప్రభుత్వానికి వక్తల డిమాండ్

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** ఆంధ్ర, తెలంగాణ సినిమా విభజన చట్టాన్ని అమలు చేయాలని, తెలంగాణ సినిమా పాలసీని తక్షణమే రూపొందించాలని పలువురు వక్తలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ సినిమా వేదిక (టిసివి) గౌరవాధ్యక్షులు తుమ్మల ప్రపుల్ రాంరెడ్డి అధ్యక్షతన "సినిమా కార్మికుల సమ్మె ఆంధ్ర, తెలంగాణ సినిమా విభజన" అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ప్రముఖ దర్శకులు ఎన్.శంకర్, ప్రొఫెసర్ నందిని సిద్ధారెడ్డి, చల్ల శ్రీనివాస్, పి.కుల్జారెడ్డి, సినిమా ఆర్టిస్ట్ భూక్యా బాల్, సినీ నటులు కార్తీక్ రెడ్డి తదితర ప్రముఖులు హాజరై మాట్లాడారు. సినిమా అభివృద్ధికి ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని రియల్ ఎస్టేట్ సంస్థగా మార్చిన స్టూడియోస్‌లను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకొని, తెలంగాణ సినిమా రంగానికి 50శాతం వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. వంద ఎకరాలలో ప్రొఫెసర్ జయశంకర్ ఫిలిం యాక్టింగ్ స్కిల్‌వర్సిటీని ఏర్పాటు చేయాలని కోరారు. తెలంగాణ భాస, యాస సంస్కృతిలో వచ్చే సినిమాలకు 50శాతం సబ్సిడీని అందజేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో వేదిక రాష్ట్ర అధ్యక్షులు లారా, కార్యదర్శి మోహన్ బైరాగి, షేక్ షావలి, ఐఎఫ్‌టివి అంజలికుమారి, జోగిరాల, పిఒడబ్ల్యూ సునీత పాల్గొన్నారు.



## కెమికల్, ఫార్మాస్యూటికల్ పరిశ్రమలలో పూర్తిస్థాయి తనిఖీలు

### రంగారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారి సంగీత

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** జిల్లాలోని అన్ని కెమికల్, ఫార్మాస్యూటికల్ పరిశ్రమలను నెలరోజుల్లో పూర్తిస్థాయి తనిఖీలు నిర్వహించలని జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్ఒ) సంగీత సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో డిఆర్ఒ అధ్యక్షతన జిల్లా స్థాయి డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్,జిల్లా ఫైర్ ఆఫీసర్,జిఎం ఇండస్ట్రీస్, కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్, బాయిలర్ ఇన్స్పెక్టర్, బూల్కాడ్రాగ్, ఫార్మా, ఫార్ములేషన్ ఫ్యాక్టరీ ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలోని అన్ని పరిశ్రమలు ప్రభుత్వ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని,కార్మికులకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పిస్తూ, భద్రతా చర్యలు ఖచ్చితంగా పాటించాలని డిఆర్ఒ ఆదేశించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి శ్రీలక్ష్మీ, పిసిబి ఇఇ వెంకటనర్సు, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ శ్యాంసుందర్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ డి.వాల్యా, డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఎన్.జీ.వైదేవి, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి నాగేశ్వర్‌రావు, ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జంగయ్య, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సమాజంలో క్రీడాకారులకు సముచిత గౌరవం

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** సమాజంలో క్రీడాకారులకు సముచిత గౌరవం లభిస్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని మినీ స్టేడియంలో నిర్మించనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ఐదుగురు చొప్పున క్రీడా విద్యార్థులను ఎంపిక చేసి ప్రతి నెల రూ.5వేల చొప్పున స్కాలర్ షిఫ్ ఇచ్చేందుకు కృషి చేస్తానని అన్నారు. షాద్‌నగర్ నియోజకవర్గం వ్యాప్తంగా సుమారు 200మంది విద్యార్థులను ఎంపిక చేసి ప్రతి నెల స్కాలర్ షిఫ్ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ డిప్యూటి ఇఇ శ్రీనివాస్, ఏఈ గోపాల్, మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌గౌడ్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మోహన్, నేతలు చెంది తిరుపతిరెడ్డి, మహ్మద్ ఇబ్రహీం, బాలునాయక్, శ్రీశైలం గౌడ్, బచ్చలి నరేష్, కబీర్, ఖదీర్ పాల్గొన్నారు.



### సాంకేతిక రంగాన్ని తీసుకువచ్చిన ఘనత రాజీవ్‌గాంధీదే

దేశానికి శాస్త్ర సాంకేతిక రంగాన్ని తీసుకువచ్చిన ఘనత దివంగత రాజీవ్ గాంధీదేనని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా పట్టణంలోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు బాబర్‌ఖాన్, చెన్నయ్య, అందె మోహన్, చెంది తిరుపతిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, దంగు శ్రీనివాస్, నీరటి వాసు, వీరేశం, శ్రీకాంత్‌రెడ్డి, మసూద్‌ఖాన్‌లు పాల్గొన్నారు.

## ఉత్సవాలలో డిజెలకు అనుమతి లేదు

### ఇబ్రహింపట్నం ఎసిపి కెపివి రాజు

**ప్రజాపక్షం/యాచారం :** గణేష్ మంటపాలలో డిజెలకు ఎట్టి పరిస్థితిలో అనుమతి లేదని ఇబ్రహింపట్నం ఎసిపి కెపివి రాజు తెలిపారు. మత సామరస్యానికి ప్రతీకగా గణేశ్ నవరాత్రి ఉత్సవాలను జరుపుకోవాలని ఆయన కోరారు. బుధవారం మండల కేంద్రంలోని సాయిశరణం గార్డెన్‌లో గణేష్ ఉత్సవ నిర్వాహకులతో గణేశ్ నవరాత్రుల సన్నాహక సమావేశం సిఐ నందీశ్వర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. సమావేశానికి అయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. శాంతిభద్రతలకు విఘాతం కలువకుండా ఉత్సవాలు జరుపుకోవాలన్నారు. ఎవరికి ఇబ్బందులేకుండా మంటపాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మంటపాల వద్ద విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వాట్సఫ్ గ్రూపుల్లో వివాదాస్పద పోస్టులు పెడితే చర్యలు తీసుకుంటామన్నారు. మంటపాల పట్ల సానిటేషన్ సక్రమంగా చూడాలన్నారు. ఎలాంటి సమస్యలున్న అధికారుల దృష్టికి తెస్తే పరిష్కరించడానికి కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో ఎంపిడిఒ రాధారాణి, ఎంపిఒ శ్రీలత, మండల డిప్యూటీ తహసీల్దార్ కీర్తి సాగర్, గ్రీన్ ఫార్మా సిటీ సిఐ సత్యనారాయణ, ఎస్ఐలు ఉయ్యాల మధు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.




## పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించండి

### టిడిపి నాయకుడు సాయిబాబా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్‌ను ముంచెత్తుతున్న భారీవర్షాల కారణంగా నగరంలో పారిశుద్ధ్య సమస్య తీవ్రంగా మారిందని టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా అన్నారు. దోమల్‌గూడ జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వర్షపు నీరు, మురుగు నీరు నిలిచిపోవడంతో పలు ప్రాంతాల్లో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోందన్నారు. దీంతో పాదచారులు, స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వర్షాలకు మూసీ నది ఉప్పొంగి లంగర్ హౌజ్ లోని బాపూఘాట్ వద్ద ఉన్న గాంధీ సమాధి ప్రాంగణంలో బురద పేరుకుపోయిందన్నారు. వెంటనే ఆ ప్రాంతాన్ని శుభ్రపరచాలని డిమాండ్ చేశారు. విపత్తు నిర్వహణ కమిటీని జిహెచ్ఎంసి నుండి హైడ్రాకు బదిలీ చేయడం వల్ల పరిస్థితి మరింత అధ్వానంగా తయారైందని సాయిబాబా అన్నారు. సమావేశంలో నల్లెల్ల కిషోర్, పి.బాల్‌రాజ్ గౌడ్, ఎస్.ప్రకాష్, కిరణ్ పాల్గొన్నారు.



## సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్సీ

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజురైన చెక్కులను ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి లబ్దిదారులకు అందజేశారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధికి ధరఖాస్తులు చేసుకున్న లబ్దిదారులకు విధిగా చెక్కులను పంపిణీ చేశారు. ఎల్‌ఓసిలతోపాటు లబ్దిదారులకు చెక్కులను అంధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి మౌనిక హరికృష్ణ గౌడ్, మాజీ సర్పంచ్‌లు, నాయకులు శ్రీశైలం యాదవ్, రవీందర్ గౌడ్, రవీందర్‌నాయక్, యాదయ్య, శ్రీనివాస్ గౌడ్, జయంతిరెడ్డి, గోవింద్,మల్లయ్య, సురేష్, మహేష్, కుమ్మరి ప్రశాంత్, మంగలి శివ పాల్గొన్నారు.



## దేశంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఘనత రాజీవ్‌దే

### రాజీవ్‌గాంధీ జయంతి వేడుకల్లో మాజీ ఎంపి

**ప్రజాపక్షం/హయత్ నగర్ :** మాజీ ప్రధాని దివంగత రాజీవ్ గాంధి 81 జయంతిని ఎల్‌బి నగర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎల్ బి నగర్ చౌరస్తాలో ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలను గుర్తుకు చేసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ మధు యాష్కీ మాట్లాడుతూ దేశంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కిందని ఆయన అన్నారు. దేశానికి శాస్త్ర సాంకేతిక రంగాన్ని తీసుకువచ్చిన ఘనత దివంగత రాజీవ్‌గాంధీదేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి. పాణ్యల జైపాల్ రెడ్డి, వాజీర్ ప్రకాష్ గౌడ్. గుర్రం శివ చరణ్ రెడ్డి. షరీఫ్. జాకిర్ పాల్గొన్నారు.

**యాచారం :** యాచారం మండల కేంద్రంలో దివంగత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ముందుగా అయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్ళు అర్పించారు. అనంతరం యాచారం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు బ్రేడ్ పంపిణీ చేశారు. ఈ సంధర్బంగా మాజీ ఎంపిపి రాచర్ల వేంకటేశ్వర్లు మాట్లాడుతూ రాజీవ్ అశయ సాధన కోసం ప్రతిఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ సర్కారు ప్రజా సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తుందని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రేస్ పార్టీ మండల అధ్యక్షులు మస్కు నర్సింహ్మా, వుప్పల బాస్కరు గుప్త, మోటే శ్రీశైలం,,వరికుప్పల సుధాకర్, రెడ్డి వేంకట్‌రెడ్డి, రాజు, పాశం జయప్రకాశ్, తిరుమలేశ్ తదితరులు పాల్గొన్నారు.





# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## పార్కు సుందరీకరణ పనులు

ప్రజాపక్షం/మల్కాజిగిరి : ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్‌లోని సఫిల్ కాలనీలో రూ.3లక్షల వ్యయంతో చేపట్టిన పార్కు సుందరీకరణ పనులను స్థానిక కార్పొరేటర్ వై.ప్రేమ్‌కుమార్ బుధవారం ప్రారంభించారు. ఈ పార్కును మార్నింగ్ వాకర్లు ఉపయోగించుకోవచ్చన్నారు. పిల్లలకు సాయం సమయాల్లో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు కృష్ణ, రాజ్, వివేక్, నాగార్జున, ప్రవీణ్, చంద్రకళ, శర్మ, జగన్మోహన్, భానుప్రకాష్, శివ తదితరులు పాల్గొన్నారు.





## సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ పెంచాలి
### ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు

ప్రజాపక్షం/ఘట్‌కేసర్ : కోల్ ఇండియా సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ పెంచాలని భారత కమ్యూనిస్ట్ పార్టీ (సిపిఐ) ప్రధాన కార్యదర్శి డి రాజాకు సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు వినతి పత్రాన్ని అందజేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రాష్ట్ర 4వ మహాసభలకు విచ్చేసిన సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి రాజాకు కోల్ ఇండియా సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు కోల్ మైన్స్ పెన్షన్ స్కీం 1998 ప్రకారం కనీస పెన్షన్ వెయ్యి రూపాయలు చొప్పున చెల్లిస్తున్నారని అన్నారు. పెన్షన్ పథకం ప్రవేశపెట్టి 27 సంవత్సరాలు గడిచిన కరువు భత్యంతో కూడిన పెన్షన్ చెల్లించక పోవడం బాధాకరం. భారత కమ్యూనిస్టు పార్టీ తరఫున కోల్‌మైన్స్ పెన్షన్ స్కీం 1998 చట్టాన్ని సవరించి బొగ్గు పెన్షనర్లు గౌరవప్రదమైన జీవితం కొనసాగించేందుకు కేంద్ర ప్రభుత్వంపైన ఒత్తిడి తీసుకొని రావాలని సింగరేణిరిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) ఉప కార్యదర్శి మిరియాల రంగయ్య, ఉప ప్రధాన కార్యదర్శి కె సారయ్య, కేంద్ర కార్యదర్శి వంగ వెంకటేష్, సలహాదారులు దమ్మలపాటి శేషయ్య,కె వీరస్వామి,తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పనిచేయాలి
### రాజీవ్ గాంధీ జయంతి సభలో తోటకూర వజ్రేష్ యాదవ్

ప్రజాపక్షం/బోడుప్పల్ : భారత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ స్ఫూర్తి తో కాంగ్రెస్ పార్టీ బలోపేతంకోసం పని చేయాలని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. బుధవారం బోడుప్పల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగుల నరసింహారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో రాజీవ్‌గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ దేశ ప్రధాని గా పనిచేసి దేశాన్ని సాంకేతిక పరిజ్ఞానంలో ముందంజలో ఉంచిన ఘనత స్వర్గీయ రాజీవ్ గాంధీకే దక్కుతుందని అన్నారు. ఆయన స్ఫూర్తితో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు క్రమశిక్షణతో ముందుకు సాగి పార్టీని బలోపేతం చేసి రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, సీనియర్ నాయకులు రాపోలు రాములు, మేడ్చల్ నియోజకవర్గం బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిలు విశ్వం గుప్త, మహిళా అధ్యక్షురాలు సమతా యాదవ్, మాజీ కార్పొరేటర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

**మల్కాజిగిరిలో :** పరిపాలనా దక్షతతో ప్రపంచవ్యాప్తంగా దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకొని వచ్చిన దివంగత భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ఆదర్శప్రాయుడని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. రాజీవ్ 81వ జయంతి సందర్భంగా



మౌలాలి చౌరాస్తాలో రాజీవ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్‌చేసి రాజీవ్ అమర్ రహే అంటూ నినదించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ప్రేమ్‌కుమార్, జితేంద్రనాథ్, కాంగ్రెస్ శ్రేణులు వెంకటేష్ యాదవ్, లక్ష్మి కాంత్‌రెడ్డి, వినోద్ యాదవ్, బికె శీను,తదితరులు పాల్గొన్నారు. నేరేడ్‌మెట్ చౌరాస్తాలో మాజీ కౌన్సిలర్లు ఎస్సార్ ప్రసాద్, ఇందిరాచంద్రశేఖర్‌ల ఆధ్వర్యంలో జరిగిన మరో కార్యక్రమంలో దివంగత రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు చంద్రశేఖర్, మాజీ కౌన్సిలర్ వెంకటేష్, గోకుల్, ప్రభ, రాఘవన్, రాజలింగం, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు అవగాహన సదస్సు

ప్రజాపక్షం/దుండిగల్ : దుండిగల్ మున్సిపల్ కార్యాలయంలో 100 ప్రోగ్రాంలో భాగంగా మహిళ గ్రూపు సభ్యులకు సహాస్ ఎన్జీవో సభ్యులు హైజానిక్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. రుతు క్రమంలో ఏ విధంగా జాగ్రత్తలు పాటించాలి. నాచురల్ డిస్పోజల్ సానిటరీ ప్యాడ్స్ వాడాలని మహిళలకు వివరించారు అదేవిధంగా అందరూ ప్లాస్టిక్ ను నిషేధించాలని ప్లాస్టిక్ వాడకుండా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్.వెంకటేశ్వర నాయక్, మెప్మా పిడి విజయలక్ష్మి, అనిల్, మంజుల, సుహాస్, మహిళ రిసోర్స్ పర్సన్స్, మహిళా గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

## నేటి నుంచి 25 వరకు
# ప్రత్యేక పారిశుధ్ద్య కార్యక్రమం
### జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్



ప్రజాపక్షం/హైదరాబాద్: జిహెచ్ఎంసి పరిధిలో మరోసారి ప్రత్యేక పారిశుధ్ద్య కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని కమిషనర్ ఆర్.వి. కర్ణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ నెల 21వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఐదు రోజుల పాటు ఈ కార్యక్రమం జరగనుంది. గతంలో నిర్వహించిన వర్షాకాల శానిటేషన్ డ్రైవ్‌లు మంచి ఫలితాలను ఇవ్వడంతో, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు కమిషనర్ ఆర్.వి. కర్ణన్ తెలిపారు. కమిషనర్ ఆర్.వి. కర్ణన్ మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాపించే మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలకుండా పరిసరాల పరిశుభ్రత ఎంతో అవసరమన్నారు. రాబోయే రోజుల్లో వర్షాలు తక్కువగా ఉండే అవకాశం ఉండడంతో, ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకొని నగరంలో పేరుకుపోయిన చెత్త, భవన నిర్మాణ వ్యర్థాలు, లెగసీ వేస్ట్ తొలగించేందుకు ఈ డ్రైవ్ చేపట్టినట్లు వివరించారు. గతంలో చేపట్టిన డ్రైవ్‌లో మిగిలిపోయిన కాలనీలతో పాటు, గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ల వద్ద పేరుకుపోయిన చెత్తను కూడా తొలగించి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు పూర్తిస్థాయి చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలు కూడా భాగస్వామ్యం కావాలని, స్థానిక ప్రజా ప్రతినిధుల సలహాలు తీసుకుని హైదరాబాద్‌ను 'క్లీన్ సిటీ'గా మార్చేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**రోడ్ సేఫ్టీ కార్యక్రమాలూ ముమ్మురం..** ఈ ప్రత్యేక పారిశుధ్ద్య కార్యక్రమంలో భాగంగా రోడ్ సేఫ్టీ కార్యక్రమాలను కూడా వేగవంతం చేస్తున్నారు. వర్షాకాలంలో దెబ్బతిన్న క్యాచ్‌పిట్స్, మ్యాన్ హోల్స్‌కు మరమ్మత్తులు చేసి ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ఇప్పటి వరకు గుర్తించిన 11,741 పాట్‌హోల్స్‌లో 8,330 మరమ్మత్తులు పూర్తి చేశామన్నారు. అదనంగా 434 క్యాచ్‌పిట్స్‌కు మరమ్మత్తులు చేసి, అవసరమైన చోట 232 కవర్లు ఏర్పాటు చేశామని తెలిపారు.

ఈ రోడ్ మరమ్మత్తు పనులను ఈ నెల 25వ తేదీ లోపు పూర్తి చేస్తామని, ముఖ్యంగా వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని కమిషనర్ ఆర్.వి. కర్ణన్ స్పష్టం చేశారు.



## ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీలో భిన్నత్వంలో ఏకత్వం
### ఇఎస్‌సిఐ డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వర్ రావు

ప్రజాపక్షం/హైదరాబాద్:ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఈఎస్‌సిఐ) ప్రాంగణం దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన శిక్షణార్థులతో సందడిగా మారింది. ఇది 'భిన్నత్వంలో ఏకత్వం' అనే భావనను ప్రతిబింబిస్తోందని ఈఎస్‌సిఐ డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వర్ రావు అన్నారు. 'పవర్ సెక్టార్ లో సైబర్ సెక్యూరిటీ' అనే సదస్సు ముగింపు సందర్భంగా ఆయన ప్రసంగించారు. ఈఎస్‌సిఐలోని వివిధ విభాగాలు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాల కోసం భారతదేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాల నుండి అభ్యర్థులు హాజరయ్యారు. ఈ శిక్షణల్లో సైబర్ సెక్యూరిటీ ఇన్ పవర్ సెక్టార్, స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్ అండ్ ఫైనాన్షియల్ అక్యుమెన్, లీన్ సిక్స్ సిగ్మా గ్రీన్ బెల్ట్, ఇంజినీరింగ్ డిజైన్ యూసింగ్ సాలిడ్ వర్క్స్, రెన్యూవబుల్ ఎనర్జీ టెక్నాలజీస్, ఎనర్జీ పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్, డిజిటల్ ల్యాండ్ సర్వే వంటి కోర్సులు ఉన్నాయి. ఈ కార్యక్రమాల ద్వారా దేశవ్యాప్తంగా ఒక 'పాన్ ఇండియా' వాతావరణం నెలకొందని డాక్టర్ రామేశ్వర్ రావు తెలిపారు. కాలేజీలోని సెంటెనరీ కన్వెన్షన్ సెంటర్‌లో జరుగుతున్న అంతర్జాతీయ సదస్సు 'హెల్దీ బిల్డింగ్స్2025' కోసం విదేశాల నుండి కూడా అతిథులు వచ్చారు. దీంతో భారతదేశంలోని వివిధ రాష్ట్రాల అభ్యర్థులతో పాటు విదేశీయులు కూడా క్యాంపస్‌లో ఉండటం ఒక కొత్త వాతావరణాన్ని సృష్టించిందన్నారు. ఈ సదస్సు కోసం ఏర్పాటు చేసిన సెమినార్ హాళ్లు, లెక్చర్ హాళ్లు, ఆడిటోరియంలన్నీ దేశ, విదేశీ ప్రతినిధులతో నిండిపోయాయని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఒకేసారి ఇన్ని కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించిన వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులకు డాక్టర్ రామేశ్వర్ రావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ బహుళ కార్యక్రమాలు ఈఎస్‌సిఐ ప్రాంగణానికి ఒక కొత్త శోభను తీసుకొచ్చాయన్నారు.

## గణేష్ మంటపాలకు అనుమతి తప్పనిసరి
### నవాబ్ పేట్ ఎస్ఐ జి.పుండ్లిక్



ప్రజాపక్షం/నవాబుపేట్: గణేష్ మండపాలు ఏర్పాటు చేసేటప్పుడు అన్ని జాగ్రత్తలు, సూచనలు పాటించాలని నవాబుపేట్ ఎస్సై జి. పుండ్లిక్ అన్నారు. బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలీసు శాఖ వారు రూపొందించిన గణేష్ మండపం నిర్వహణకు సంబంధించిన ఆన్లైన్ అప్లికేషన్ అనేది కేవలం మండపం నిర్వహణ, మండపంనకు సంబంధించిన సమాచారం కొరకు మాత్రమే రూపొందించిందని, ఈ యొక్క సమాచారం ద్వారా భద్రత మరియు బందోబస్తు ఏర్పాటు చేయడానికి పోలీసు అధికారులకు సులువుగా ఉంటుందని, ఆన్లైన్ ఇన్ఫర్మేషన్ కు ఎటువంటి రుసుము లేదని ఎస్సై తెలిపారు. గణేష్ ఉత్సవాల నిర్వాహకులు గణేష్ విగ్రహాల ఏర్పాటు సమాచారం ఆన్లైన్ లో పొందుపరిచి పోలీసుస్టేషన్ల లో సమాచారం ఇవ్వాలని అందుకోసం ఆన్లైన్ అప్లై చేసుకోవాలని అన్నారు. వినాయక మండపాల నిర్వాహకులకు ఎస్సై పుండ్లిక్ పలు సూచనలు చేశారు. మండపం ఏర్పాటు చేసే సమయం లో షార్ట్ సర్క్యూట్ జరుగకుండా మంచి నాణ్యత గల వైరును ఉపయోగించి పలు జాగ్రతలు పాటించాలి.

గణేష్ మండపాల నిర్వాహకులు వారి మండపాల కమిటీ వివరాలు, మండపాల బాధ్యత వహించే వారి వివరాలు, ఫోన్ నెంబర్ల ను మండపంలో ఏర్పాటు చేయాలి మరియు తమ పరిధిలోని పోలీస్ అధికారుల ఫోన్ నెంబర్ లు కల్గి ఉండాలి. మండపాల్లో ఎట్టిపరిస్థితులోను డిజేలను ఏర్పాటు చేయరాదు. గణేష్ ప్రతిమలు కూర్చుండబెట్టే ప్రదేశంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా షెడ్ నిర్మాణంలో మంచి నాణ్యత గల షెడ్ ఏర్పాటు చేయవలెను. గణేష్ మండపంలో 24 గంటలు ఒక వాలంటీర్లు ఉండే విధంగా నిర్వహకులు తగు చర్యలు తీసుకోవాలి. గణేష్ మండపాల వద్ద ఎప్పుడైన ఎలాంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత చర్యలు తీసుకోవాలి. నిర్వాహకులు తప్పనిసరిగా తమ మండపాలలో పాయింట్ పుస్తకం ఏర్పాటు చేసుకోవాలి, పోలీసు అధికారుల తనిఖీకి వచ్చినప్పుడు అందులో వ్రాసి సంతకం చేస్తారు. మండపాల్లో ఏదైనా అనుమానాస్పదంగా బ్యాగులు, ప్లాస్టిక్ సంచులు,వస్తువులు లేదా వ్యక్తులు కనిపించినట్లుయితే తక్షణమే డయల్ 112గాని లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలి. సామాజిక మాధ్యమాలలో వచ్చే ఎలాంటి రూమర్స్, వదంతులను నమ్మకూడదు. గణేష్ మండపాల ఏర్పాటు కొరకు పోలీస్‌శాఖ అనుమతి నిమిత్తం https://policeportal.tspolice.gov.in/index.htm ఈ లింకుద్వారా సంప్రదించగలరు అని తెలిపారు.

## ప్రజలకు ఉన్నత సేవలు అందించాలి
### కలెక్టర్ ప్రతీక్‌జైన్



ప్రజాపక్షం/పరిగి: పరిగి నియోజకవర్గంలో పంచాయతీ రాజ్‌శాఖ కు సంబంధించిన బిల్డింగ్ నందు పరిగి తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేసినందుకు అట్టి నూతన భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ,జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ , ఎస్పీ నారాయణరెడ్డి తో కలిసి ప్రారంభించారు. పూజ కార్యక్రమం అనాంతరం తహసీల్దార్ వెంకటేశ్వరిని కూరీలో కూర్జోబెట్టి పూల బోకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సిబ్బంది అందరు సమయ పాలన పాటిస్తు కార్యాలయంలో అందుబాటులో ఉండాలని సంబంధిత అధికారులను అదేశించారు. అనంతరం నూతనంగా నిర్మించబోతు న్న 100పడకల ప్రభుత్వ ఆసుపత్రి పరిసరాను పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న వేయింటాంటింగ్ హాలు నిర్మాణ పై సంబంధిత అధికరితో పుర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారుఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ , ట్రైనింగ్ కలెక్టక్ హర్స్‌చౌదరి , ఆర్‌డిఓ వాసుచంద్ర , డిఎస్‌పి శ్రీనివాస్ , ఈఈ పిఆర్ ఉమేష్‌కుమార్ , మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య సిబ్బంది పాల్గోన్నారు.

## వినాయక చతుర్థికి అధికారులు అన్ని ఏర్పాటు చేయాలి
### భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కుత్బుల్లాపూర్



ప్రజాపక్షం/దుండిగల్ : కుత్బుల్లాపూర్ అసెంబ్లీ పరిధి వినాయక చతుర్థి కి జిహెచ్ఎంసి మరియు దుండిగల్, కొంపల్లి నిజాంపేట్ మున్సిపాలిటీలలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని అదేవిధంగా పోలీస్ అధికారులు మండపాల ఏర్పాట్లు విషయంలో ఇబ్బంది పెట్టరాదని మరియు వినాయక నిమజ్జనానికి కావాల్సిన ఏర్పాట్లు చేయాలని డివిజన్లో వారిగా గత సంవత్సరం వినాయక చవితికి ఏర్పాట్లు విషయం జరిగిన ఇబ్బందులపై చర్చించి అదేవిధంగా హిందూలందర్నీ సంఘటితం చేయడమే కాకుండాఅన్ని మండపాలతో సమన్వయం చేసుకునే విధంగా కార్యాచరణ కోసం భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ గిరి వర్ధన్ రెడ్డి మరియు కోకన్వీనర్ ఆకుల సతీష్, కట్ట కుమార్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు సమావేశం పలు విషయాలపై చర్చించడమే కాకుండా వినాయక చవితి సందర్భంగా ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో పండుగ జరుపుకోవడానికి భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీడిమెట్ల డివిజన్ కన్వీనర్ బలరాం మరియు సూరారం కన్వీనర్ శ్రీనాథ్, రమేష్, చింతల్ డివిజన్ కన్వీనర్ సూర్య భానుచందర్, కుత్బుల్లాపూర్ కొకన్వీనర్ రామ్, సుభాష్ నగర్ డివిజన్ కన్వీనర్ విగ్నేష్, రంగారెడ్డి నగర్ డివిజన్ కన్వీనర్ వేణు, జగదిగిరిగుట్ట కన్వీనర్ రాజు, రమేష్ యాదవ్, కుత్బుల్లాపూర్ పవన్, నిజాంపేట్ కన్వీనర్ చక్రధర్ అరుణ్ రావు, సుబ్బారావు, కొంపల్లి మున్సిపాలిటీ కన్వీనర్ శివాజీ, సతీష్, సాగర్ మాధవి, దుండిగల్ మున్సిపల్ కన్వీనర్ ఆంజనేయులు, మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మానవ సేవే.. మాధవ సేవ
### టిపిసిసి ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్

ప్రజాపక్షం/శామీర్‌పేట : ప్రజలకు సేవ చేయడంలోనే గుర్తింపు లభిస్తుందని టిపిసిసి ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. బుధవారం శామీర్‌పేట మండల కేంద్రంలో మాజి ఎంపిటిసి దప్పు సాయిబాబు తన తండ్రి కీర్తి శేషులు దప్పు బిక్షపతి జ్ఞాపకార్థం ఉచిత వైకుంఠ రథాన్ని టిపిసిసి ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా టిపిసిసి ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అని అన్నారు. సమాజసేవ చేసిన వారికి మంచి గుర్తింపు లభిస్తుందని, సేవ చేసిన వారే గొప్ప నాయకులుగా ఎదుగుతారని ఆయన వివరించారు. ఎంతో గొప్ప సేవా దృక్పథంతో ముందుకు వచ్చి వైకుంఠ రథాన్ని ప్రజలకు ఉచితంగా ఏర్పాటు చేసినందుకు దాత దప్పు సాయి బాబాను వజ్రేష్‌యాదవ్ ప్రశంసిస్తు సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హజ్‌యాత్ర కమిటి సభ్యుడు ముజుబుద్దీన్, మాజి ఎంఎల్‌వి మలిపెద్ది సుదీర్‌రెడ్డి, శామీర్‌పేట ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్, మాజి సర్పంచ్‌లు కిషోర్, వెంకటేష్, కమఠం కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





## మహిళల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట
### ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

ప్రజాపక్షం/దోమ: పరిగి నియోజకవర్గంలోని దోమ మండల పరిధిలోని రైతు వేదికలో ఎస్సీ కార్పోరేషన్ ద్వారా శిక్షణ పొందిన 35మంది మహిళలకు ఉచిత కుట్టుమిషన్లు, సర్టిఫికెట్లను అధికారులతో, స్థానిక నాయకులతో కలిసి పరిగి ఎమ్మెల్యే డిసిసి అధ్యక్షులు రామ్మోహన్‌రెడ్డి పంపిణీ చేశారు. అనంతరం దోమ గ్రామానికి చెందిన మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 99 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ ను ఎమ్మెల్యే అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్టంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలందరీకి ఇందిరమ్మ ఇల్లు, వడ్డీలేని రుణాల ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లు వంటి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. పరిగి నియోజకవర్గంలో ఫస్ట్ దఫా 3,500 ఇండ్లు మంజూరు చేసిన ట్లు తెలిపారు. రాబోయే 3 సంవత్సరాలలో నియోజకవర్గంలో 20వేల ఇందిరమ్మ ఇండ్లను అర్హులైన పేదవారికి కట్టించి ఇస్తామని ఆయన తెలిపారు. పేదవాడు బలోపేతం అయ్యేందుకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకునే వారికి రూ.5లక్షల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నామని తెలిపారు. ప్రతిగ్రామానికి బిటి రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేస్తున్నామని, మారుమూల ప్రాంతాలలోని చిన్నచిన్న తాండాల అనుసంధానం కోసం లింక్‌రోడ్లకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాజీ విజయ్‌కుమార్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ యాదవరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శాంత్‌కుమార్, శివకుమార్ రెడ్డి, రాములు నాయక్, తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని గాజులరామారంలో బుధవారం ప్రారంభమైన సిపిఐ మూడు రోజుల మహాసభలకు జిల్లావ్యాప్తంగా అన్ని ప్రాంతాల నుండి భారీగా పార్టీ శ్రేణులు, శ్రేయోభిలాషులు, అభిమానులు వేలాది సంఖ్యలో తరలివెళ్లారు. ఎర్ర చొక్కాలు, ఎర్ర చీరలు ధరించిన పార్టీ శ్రేణులు పార్టీ నినాదాలు చేస్తూ మహాసభలకు హాజరయ్యారు.



ఉప్పల్ నియోజకవర్గ నేతలు ఈసిఐఎల్‌లోని సిపిఐ కార్యాలయం నీలం రాజశేఖరరెడ్డి భవన్ నుండి తరలి వెళ్లారు. మల్కాజిగిరి మండల సిపిఐ నాయకులు, జిల్లా కౌన్సిల్ సభ్యులు సిహెచ్ దశరథ్, మండల కార్యదర్శి టి.యాదయ్య గౌడ్, సహాయ కార్యదర్శులు కాసర్ల నాగరాజు,కె.అశోక్, పి.సత్యనారాయణ, ఎఐటియుసి మండల కార్యదర్శులు పాల్గొన్నారు.

## కొత్త రోగాలకు దారితీస్తున్న ఆరోగ్య కేంద్రం

* కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలోనే ఆస్పత్రి దుస్థితి
* భవనంలో లీకేజి, డ్రైనేజి సమస్య
* తనిఖీకి వచ్చిన కలెక్టర్‌కు సమస్యల ఏకరువు

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : డ్రైనేజి సక్రమంగా లేక మురికి నీటి పారుదల, రోగులు చికిత్సలు పొందే ఇన్‌పేషంట్లు, ఔట్ పేషంట్లు ఉండే ప్రాంతాల్లో భవనంపై లీకేజి వల్ల లోపలికి వర్షం నీరు రావటం, ఆస్పత్రికి లోపలికి వెళ్లే మార్గంలో షాబాద్ రాళ్లు సక్రమంగా లేక చికిత్సల కోసం వచ్చే రోగులు కింద పడి పోయే ప్రమాదకర పరిస్థితులు, కనీసం రోగులే కాకుండా సిబ్బందికి సైతం పనికి రాకుండా ఉండే మరుగుదొడ్లు బెడ్ల కొరత....ఇదీ సాక్షాత్తూ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణ పరిధిలోకి వచ్చే శామీర్‌పేట మండల సామాజిక ఆరోగ్య కేంద్ర దుస్థితి. కూతవేత దూరంలో ఉన్న ఈ ఆస్పత్రిని మెరుగుపరచటంలో వైద్యారోగ్య శాఖ, జిల్లా యంత్రాంగం ప్రజల ఆరోగ్యం పట్ల కనపరుస్తున్న అశ్రద్ధకు అద్దంలా నిలుస్తోంది. ఇలాంటి దుస్థితి నెలకొన్న ఈ ఆస్పత్రికి వచ్చే రోగాలకు నయం చేసుకొందామని వస్తే కొత్త రోగాలు రానున్నాయి. తనిఖీ పేరిట బుధవారం ఈ ఆస్పత్రికి వచ్చిన జిల్లా కలెక్టర్ మనుచౌదరికి అక్కడి వైద్యాధికారి, సిబ్బందికి ఆస్పత్రి దుస్థితి, సమస్యలను ఏకరువు పపెట్టారు. వాటర్ లీకేజి సమస్య పరిష్కారానికి శాశ్వత రీతిలో కాకుండా తాత్కాలిక పద్దతిలో భవనంపై రేకుల షెడ్ ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. డ్రైనేజి, మరుగు దొడ్ల సమస్యల పరిష్కారానికి అవసరమైన నిధులు మంజూరు చేస్తానని కలెక్టర్ చెప్పారు. ఇకనైనా కలెక్టర్ చెప్పిన మేరకు నిధులు మంజూరు అయి సమస్యల పరిష్కారం అవుతాయా లేదా అని ఎదురు చూడాల్సిందే..





# బలమైన, మిలిటెంట్ తరహా ఉద్యమాలు చేపట్టాలి

## సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ



ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు, మతోన్మాద శక్తులకు వ్యతిరేకం గా తెలంగాణ రాష్ట్రంలో కమ్యూనిస్టు పార్టీలు బలమైన, మిలిటెంట్ తరహా ఉద్యమాలను చేపట్టాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. ఇందుకు వామపక్షాలు, అభ్యుదయ వాదులు ముందుకు రావాలని కోరారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వర్ రావు నగర్ (గాజుల రామారం)లో జరుగుతున్న సిపిఐ రాష్ట్ర 4వ మహాసభలో బుధవా రం జాన్‌వెస్లీ సౌహార్ద సందేశమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ప్రజా సమస్యల పరిష్కారానికి బలమైన ఉద్యమాలను చేపట్టడం ద్వా రానే కమ్యూనిస్టు పార్టీలు మరింత బలపడుతాయని సూచించారు. ప్రజలలో ఉన్న అసమానతలపైన చైతన్యం కల్పించి, వాటికి వ్యతిరేకంగా పోరాటాలు చేయడం కేవలం కమ్యూనిస్టు పార్టీల వల్లనే సాధ్యమన్నారు. హిట్లర్ లాంటి నియంతనే మట్టి కరిపించిన ఎర్ర జెండాకు ప్రధాని మోదీ ఒక్క లెక్క కాదని, ఇలాంటి మోదీలను ఎర్ర జెండా ఎంతో మందిని చూసిందని జాన్ వెస్లీ చెప్పారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా, రాజ్యాధికారాన్ని నిర్వీర్యం చేసేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. అమెరికా సామ్రాజ్యవాద విధానాలకు ప్రధాని మోదీ మోకరిల్లుతున్నారని, దేశ ప్రజలను అవమానించే విధంగా బిజెపి వ్యవహరిస్తోందని మండిపడారు. రాష్ట్రంలో బిసిల కు 42 శాతం రిజర్వేషన్లను బిజెపి అడ్డుకుంటుందని విమర్శించారు. ప్రభుత్వాలు విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు లేకుండా చేస్తున్నాయని, కార్మిక, రైతుల హక్కులను కాలరాస్తున్నాయని జాన్ వెస్లీ దుయ్యబట్టారు. కమ్యూనిస్టు బలమైన ఉద్యమాలకు సిపిఐ తెలంగాణ రాష్ట్ర మహాసభ స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కౌలు రైతులకు రూ.12వేలు, పెన్షన్‌పెంచుతామనే హామీని అమలు చేయలేదని, మహిళలకురూ. 2500 ఇవ్వడం లేదని ఆయన ఆరోపించారు.





# పంచాయతీ నుంచి పార్లమెంట్ దాకా..

**• కమ్యూనిస్టు పార్టీ ప్రాతినిధ్యం ఉండాలి • ఒకటి రెండు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ స్థానాలతో సంతృప్తి చెందొద్దు • పార్టీ బలోపేతమైతే మన చేతిలోనే ఆయుధంగా నిలుస్తుంది • సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా**

**కె. సంతోష్ కుమార్**
**కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వరరావు నగర్ నుంచి**

గ్రామ పంచాయతీ స్థాయి నుంచి పార్లమెంట్ వరకు కమ్యూనిస్టు పార్టీ ప్రాతినిధ్యం ఉండాలని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. ప్రస్తుతం కమ్యూనిస్టు పార్టీకి ఉన్న ఒకటి రెండు ఎంఎల్‌ఎ, ఎంఎల్‌సి స్థానాలతో పార్టీ నాయకులు, శ్రేణులు సంతృప్తి పడొద్దన్నారు. కమ్యూనిస్టులు బలంగా ఉంటే తప్ప భావసారూప్యత కలిగిన పార్టీలతో రాజకీయంగా సర్దుబాటు చర్చల ను బలంగా జరపలేమన్నారు. ఒకప్పుడు తెలంగాణ నుంచి అనేక మంది కమ్యూనిస్టు పార్టీ నాయకులు చట్ట సభలలో ప్రాతినిధ్యం వహించారని గుర్తు చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభు త్వం ఉందని, లౌకిక, ప్రజాస్వామ్య శక్తులకు తగిన ప్రాముఖ్యతను ఇచ్చి సమన్వయం చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్‌పైనే ఉందన్నారు. సిపిఐ రాష్ట్ర 4వ మహాసభలో భాగంగా బుధవారం మధ్యాహ్నం డెలిగేట్స్ సెషన్‌ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డి.రాజా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సిపిఐకి ఘనమైన చరిత్ర ఉన్నదని, గతంలో సిపిఐకి లోక్‌సభలో ప్రాతినిధ్యం కూడా ఉండేదని, అనేక ప్రజా పోరాటాలు చేశామని, అలాంటి పోరాట చరిత్ర కలిగిన పార్టీకి ప్రస్తుతం ఒకటి రెండు స్థానాలకు పరిమితమయ్యే పరిస్థితులు ఎందుకు కొచ్చాయో, క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితి ఏమిటో ఒక సారి ఆలోచన చేయాలని సూచించారు. సిపిఐని బలోపేతం చేయనంత వరకు వామపక్ష ఐక్యతను సాధించలేమని తెలిపారు. శ్రేణులకు పార్టీయే ఒక ఆయుధమని, పార్టీ బలోపేతమైతే మన చేతిలోనే ఆయుధంగా నిలుస్తుందని వివరించారు. యువత, మహిళలను పెద్ద సంఖ్యలో కమ్యూనిస్టు పార్టీలోకి ఆకర్షించాలని పిలుపునిచ్చారు. జాతీయ స్థాయిలో బిజెపి గతంలో 'కాంగ్రెస్ ముక్త్ భారత్' అని నినదించిందని, అనంత రం చత్తీస్‌ఘడ్‌లో మావోయిస్టుల అంతం లక్ష్యం గా 'ఆపరేషన్ కగార్'ను చేపట్టిందని, భవిష్యత్ లో కమ్యూనిస్టులే లక్ష్యంగా బిజెపి కార్యాచరణ చేపడుతుండడంలో ఆశ్చర్యం లేదన్నారు. బలమైన శత్రువులను ఎదుర్కొనేందుకు, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడానికి లౌకిక, ప్రజాస్వామ్య శక్తులు కలిసి పనిచేయాలని, ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ మతతత్వ శక్తులు భారతదేశ క్యారెక్టర్‌ను మార్చేందుకు, ఫాసిస్టు, మతతత్వ దే శంగా చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆగ్ర హం వ్యక్తం చేశారు. సిపిఐ అత్యంత బలంగా ఎదగకపోతే బిజెపిని ఎలా అడ్డుకుంటామని ప్ర శ్నించారు. కేంద్రంలో 400 ఎంపి సీట్లు వస్తే రా జ్యాంగాన్ని మార్చేద్దామని బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ శక్తులు భావించాయని, కానీ సొంతంగా అధికారంలోకి కూడా రాలేకపోయిందని వివరించారు. పెట్టుబడిదారి వ్యవస్థ సంక్షోభంతో అమెరికా వివిధ దేశాలపై అనేక ఆంక్షలను విధిస్తూ ప్రతి దేశాన్ని నియంత్రించేందుకు ప్రయత్నిస్తుందన్నారు. పలు అంతర్జాతీయ సంస్థల సూచనలను కూడా అమెరికా అధ్యక్షులు ట్రంప్ పట్టించుకోవడంలేదన్నారు. ప్రపంచవ్యాప్తంగా యుద్ధవాతావరణం నెలకొందని, పాలస్తీనాపై ఇజ్రాయిల్ యుద్ధం చేస్తూ మారణహోమం సృష్టిస్తూ చిన్న పిల్లలను, మహిళలను కూడా చంపుతున్నదన్నారు. గతంలో భారతదేశం పాలస్తీనా ప్రజలకు మద్దతునిస్తుందని, మహాత్మా గాంధీ బహిరంగంగానే పాలస్తీని అని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. పాలస్తీనాకు గత కేంద్ర ప్రభుత్వం మద్దుతుగా నిలిచేదని, కానీ బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత, మోదీ ఇజ్రాయిల్‌కు మద్దతునివ్వడం గర్హనీయమన్నారు.

# విభజన తర్వాత ఎపిలో భిన్నమైన రాజకీయ వాతావరణం

## సిపిఐ ఎపి రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



తెలంగాణ, ఎపి విడిపోయిన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో పూర్తి భిన్నమైన రాజకీయ వాతావరణం నెలకొన్నదని సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. విభజనత తరవాత ఆంధ్రప్రదేశ్‌లో కమ్యూనిస్టు పార్టీలు గడ్డుకాలాన్ని అధిగమిస్తున్నాయని, ఈ పరిస్థితుల నుంచి ముందుకు వెళ్తామని ధీమా వ్యక్తం చేశారు. మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వర్ రావు నగర్ (గాజులరామారం)లో జరుగుతున్న సిపిఐ రాష్ట్ర 4వ మహాసభలలో బుధవారం రామకృష్ణ సౌహార్ద సందేశ మిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎన్‌డిఎ, ఇండియా కూటమి రెండు ఉండగా, మిగతా రాష్ట్రాలలో ఎన్‌డిఎకు అనుకూలంగా, కొంత వ్యతిరేక ఓటు వేసే అవకాశాలు ఉంటాయని, ఎపిలో మాత్రం ఇందుకు భిన్న పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఉప రాష్ట్రపతి ఎన్నిక, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే బిల్లులకు మద్దతు తెలిపే విషయంలో ఎపిలో మాత్రం అధికార, ప్రతిపక్ష పార్టీలు ఎన్‌డిఎ కూటమికే మద్దతునిస్తాయన్నారు. ఎన్‌డిఎకు వ్యతిరేకంగా ఒక్క ఓటు కూడా పోలవ్వని ఏకైకా రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని రామకృష్ణ అన్నారు. ఎపిలో టిడిపి, జనసేన రెండు ప్రాంతీయ పార్టీలు బిజెపితో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయని, ప్రతిపక్షంలో ఉన్న మరో ప్రాంతీయ వైసిపి మాత్రం ఎపిలో ఎన్‌డిఎకు వ్యతిరేకంగా కోట్లాడుతారని, ఢిల్లీకి వెళ్లగానే మోదీ సంకన ఎక్కుతారని ఆయన ఎద్దేవా చేశారు. బిజెపికి పూర్తి స్థాయి మెజార్టీ వస్తే రాజ్యాంగాన్ని మారుస్తారనే విషయంలో ఎటువంటి సందేహామూ లేదన్నారు. బిజెపికి ప్రజాస్వామ్యం, రాజ్యాంగంపైన ఎటువంటి నమ్మకం లేదని, అందుకే రాజ్యాంగ రక్షణ, ప్రజాస్వామ్య పరిరక్షణకు లౌకికవాదాన్ని నిలబెట్టుకునేందుకు ప్రజా సమస్యల పరిష్కారానికి దేశ వ్యాప్తంగా బలమైన ఉద్యమాలు నిర్మించాలని రామకృష్ణ పిలుపు నిచ్చారు.

## సిపిఐ మహాసభ – కమిటీలు

సిపిఐ రాష్ట్ర 4వ మహాసభ నిర్వహణకు పలు కమిటీలను మహాసభలో ప్రతినిధులు ఎన్నుకున్నారు.కమిటీలను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేసి సంబశివరావు ప్రతిపాదించగా, ప్రతినిధుల సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. కమిటీల వివరాలు.

**అధ్యక్షవర్గం** : చైర్ పర్సన్ పశ్య పద్మ, సభ్యులు వి.ఎస్.బోస్, నెల్లికంటి సత్యం, వలీ ఉల్లా ఖాద్రీ, ఇ.ఉమామహేశ్, మారుపాక అనిల్‌కుమార్, అజ్మీరా రాంమూర్తి

**సారథ్య సంఘం** : కన్వీనర్ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుతో పాటు పార్టీ రాష్ట్ర కార్యవర్గం మొత్తం

**తీర్మానాల కమిటీ** : కన్వీనర్ తక్కళ్ళపల్లి శ్రీనివాస్ రావు, సభ్యులు ఇ.టి.నరసింహ, ఎస్.కె.సాబీర్‌పాషా, ఎస్.బాలరాజు, బొమ్మగాని ప్రభాకర్, ఉజ్జిని రత్నాకర్‌రావు.

**మీడియా బ్రీఫింగ్ కమిటీ:** పల్లా వెంకట్ రెడ్డి, బాగం హేమంత్‌రావు, కలవేణ శంకర్ , ఎండి.యూసఫ్

**అర్హతల కమిటీ** : కన్వీనర్ ఎం.బాలనర్సింహ ఎన్.జ్యోతి, స్టాలిన్ (హైదరాబాద్), కె.ధర్మేంద్ర, పుట్ట లక్ష్మణ్, కె.మణికంఠరెడ్డి, ఎస్‌ఎండి. ఫయాజ్.

**మినిట్స్ కమిటీ** : కన్వీనర్ కె.బిక్షపతి, ఎల్.శ్రావణ్‌కుమార్, పంజాల శ్రీనివాస్.












# పలువురు ప్రముఖులకు సిపిఐ ఘననివాళి

ఇటీవల మరణించిన పలువురు సిపిఐ నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులకు సిపిఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభ సంతాపాన్ని, వారి కుటుం బ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసిం ది. అమరులు సమాజానికి చేసిన సేవలను కొనియాడుతూ మహాసభల నివాళులు అర్పించింది. మహాసభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యు లు బాగం హేమంతరావు ప్రవేశ పెట్టిన సంతాప తీర్మానాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించింది. సిపిఐ రాష్ట్ర 3వ మహాసభల నుండి ఇప్పటి మహాసభల వరకు మరణించిన పలువురు సిపిఐ నాయకులు, ప్రముఖులు, వివిధ ఘటనలు, ప్రమాదాల్లో మరణించిన వారికి సభ సంతాపాన్ని తెలియజేసింది. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యు లు, కేరళ రాష్ట్ర కార్యదర్శి కణం రాజేంద్రన్, అఖిల భారత కిసాన్ సభ జా తీయ ప్రధాన కార్యదర్శి అతుల్ కుమార్ అంజాన్, సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాలమల్లేశ్ ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, ఖమ్మం జిల్లా మాజీ వైస్ చైర్మన్ బి.అయోధ్య, నారాయణపేట జిల్లా కార్యదర్శి, కొండన్నలతో పాటు పలువురు సిపిఐ నాయకులు, స్వాతం త్ర్య సమరయోధులకు ప్రతినిధులు నివాళులు అర్పించా రు. భారత మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్ మోహన్‌సింగ్, కర్నాటక మాజీ ముఖ్యమంత్రి ఎస్.ఎం.కృష, హర్యా నా మాజీ ముఖ్యమంత్రి ఓం ప్రకాశ్ చౌతాలా, ఉత్తరప్రదేశ్ మాజీ సిఎం ములా యం సింగ్ యా దవ్, జార్ఖండ్ మాజీ సిఎం శిబుసోరెన్, కేంద్ర న్యాయ శాఖ మాజీ మంత్రి శాంతిభూషణ్, ప్రధాని నరేంద్ర మోదీ తల్లి హీరాబెన్, భారత హరిత విప్లవ పితామహుడు, ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.ఎస్. స్వామినాథన్, కేరళ రాష్ట్ర మాజీ సిఎం ఊమన్ చాందీ , ఈనాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు, కేంద్ర మాజీ మంత్రి, సినీ నటులు కృష్ణంరాజు, ప్రముఖ సినీ నటులు ఘట్టమనేని కృష్ణ, కళాతపస్వి కె.విశ్వనాథ్, కైకాల సత్యనారాయణ, తమ్మారెడ్డి చలపతిరావు, ప్రముఖ నటీనటులు జమున, ప్రముఖ సినీ గాయణి వాణీజయరామ్, చంద్రమోహన్, కోటా శ్రీనివాసరావు, శరత్‌బాబులకు నివాళులు అర్పించారు. వివిధ ప్రమాదా లు, వరదలతో మరణించిన వారికి ప్రతినిధుల సభ సంతాపం తెలియజేసింది.

ఫోటోలు అనిల్











# గాజులరామారం అరుణశోభితం

**టి.మల్కయ్య**
**కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వరరావు నగర్ నుంచి**

సిపిఐ రాష్ట్ర 4 మహాసభ ప్రారంభోత్సవం సందర్భంగా తొలుత షాపూర్‌నగర్ కూడలి నుంచి మహాసభల ప్రాంగణం 'కామ్రేడ్ ఎన్.బాలమల్లేష్ హాల్' వరకు భారీ 'రెడ్ ఫ్లాగ్ మార్చ్' నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా నాట్య మండలి కళాకారులు ఆట పాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సిపిఐ సమర యోధులకు జోహర్లు అంటూ పార్టీ శ్రేణులు నినదిస్తూ ఎర్ర జెండాలు చేత బూని ముందుకు సాగారు. దాదాపు మూడు కిలో మీటర్ల పొడవునా దారి అరుణారుణమైంది. అరుణ పతాకాలు రెపరెపలాడాయి. ఎర్ర జెండా పోరాటాలకు నిలయమైన కుత్బుల్లాపూర్ ప్రాంతంలోని ప్రజలు సిపిఐ ప్రదర్శనను ఆసాంతం తిలకించారు. సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజ్‌పాషా, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి , ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం ప్రదర్శన అగ్రభాగాన నడవగా పార్టీ నాయకులు, ప్రతినిధులు, శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహాసభ ప్రాంగణంలో సిపిఐ సీనియర్ నాయకులు కందిమళ్ల ప్రతాపరెడ్డి అరుణ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా మహాసభల ప్రాంగణం పార్టీ శ్రేణుల నినాదాలతో దద్దరిల్లింది. ప్రజానాట్యమండలి కళాకారులు తమ పాటలతో ఉత్తేజం నింపారు. ప్రముఖ కవి, నవచేతన పబ్లిషింగ్ హౌజ్ సంపాదకులు ఏటుకూరి ప్రసాద్ అమరవీరుల స్థుపాన్ని ఆవిష్కరించారు. అమరవీరుల స్థూపం వద్ద సిపిఐ జాతీయ ప్రధానకార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజ్‌పాషా, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు,జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, పశ్యపద్మ, జాతీయ కౌన్సిల్ సభ్యులు పల్లావెంకటరెడ్డి, కె.శ్రీనివాస్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాస రావు, కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్, ఇ.టి.నరసింహా, కళవేన శంకర్, ఎం.బాల నర్సింహా, ప్రముఖ సినీ నటుడు మాదాల రవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కౌన్సిల్ సభ్యులు, మహాసభల ప్రతినిధులు అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలుంచి నివాళులు అర్పించారు. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుల ఫొటో ఎగ్జిబిషన్, 'సభాపతి అమరవీరుల ప్రాంగణం' ప్రత్యేక ఆకర్షణ గా నిలిచింది. మహాసభకు రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి 743 మంది పార్టీ ప్రతినిధులు హాజరయ్యారు.







Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com